thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 234 కరీంనగర్ శనివారం, 1 నవంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఆరో తరం ఫైటర్ జెట్‌పై భారత్ దృష్టి

న్యూఢిల్లీ : అత్యాధునిక ఆరో తరం ఫైటర్ జెట్‌ల అభివృద్ధిపై భారత్ దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), జపాన్, ఇటలీ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్లోబల్ కాంబాట్ ఎయిర్ ప్రోగ్రామ్ (జీసీఏపీ) ప్రాజెక్టులో చేరేందుకు భారత్ ఆసక్తి చూపిస్తోంది. కానీ, రక్షణ రంగంలో భారత్, రష్యా మధ్య ఉన్న బలమైన బంధం నేపథ్యంలో జీసీఏపీలో భారత్‌ను చేర్చుకునే అంశంలో జపాన్ ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. జపాన్ మీడియాలో ఈ మేరకు కథనాలు వెలువడ్డాయి. ఆరో తరం ఫైటర్ జెట్‌లను కలిసి అభివృద్ధి చేసేందుకు యూకే, జపాన్, ఇటలీ.. 2022 డిసెంబరులో జీసీఏపీ ప్రాజెక్టును చేపట్టాయి. 2035 నాటికి అత్యాధునిక ఫైటర్ జెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలనేది లక్ష్యం.




## కోటి ప్రభుత్వ ఉద్యోగాలు.. కోటి మంది లఖ్‌పతి దీదీలు: బిహార్‌లో ఎన్డీయే మ్యానిఫెస్టో

పట్నా: బిహార్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మరికొన్ని రోజుల్లో జరగనుంది. దీంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచార జోరు పెంచాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు హామీల వర్షం కురిపిస్తున్నాయి. తాజాగా బిహార్ అధికార ఎన్డీయే కూటమి శుక్రవారం ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేసింది. వలస కార్మికులను ఆకట్టుకునేలా రాష్ట్రంలో కోటి ప్రభుత్వ ఉద్యోగాలు సృష్టిస్తామని హామీ ఇచ్చింది. పట్నాలో ఈ ఉదయం జరిగిన కార్యక్రమంలో 'సంకల్ప పత్ర' పేరుతో భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా, బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ ఈ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఎల్జేపీ (రాంవిలాస్) పార్టీ చీఫ్ చిరాగ్ పాసవాన్ కూడా పాల్గొన్నారు. **మ్యానిఫెస్టోలోని ముఖ్యాంశాలివే..** రాష్ట్రంలోని యువతకు కోటి ప్రభుత్వ ఉద్యోగాలు. ప్రతి జిల్లాలో మెగా నైపుణ్య కేంద్రాల ఏర్పాటు. కేజీ టు పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్య. ఏడాదికి రూ.లక్ష వరకు సంపాదించేలా కోటి మంది మహిళలను 'లఖ్‌పతి దీదీ'లుగా మార్చడమే లక్ష్యం. మహిళలు వ్యాపారాలు ప్రారంభించేందుకు రూ. 2 లక్షల వరకు ఆర్థికసాయం. ఈబీసీలకు రూ. 10 లక్షల వరకు ఆర్థిక ప్రోత్సాహకాలు. రాష్ట్రంలో సామాజిక-ఆర్థిక పరిస్థితులను అంచనా వేసేందుకు సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు. కర్పూరీ ఠాకూర్ కిసాన్ సమ్మాన్ నిధి కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ.9వేలు పెట్టుబడి సాయం. మూడు విడతల్లో ఈ మొత్తం చెల్లింపు. బిహార్‌లో ఏడు ఎక్స్‌ప్రెస్‌వేలు, నాలుగు నగరాల్లో మెట్రో రైలు సేవల ఏర్పాటు. 5 ఏళ్లలో రూ.50 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటు. ప్రతి జిల్లాలో తయారీ యూనిట్లు , మెడికల్ కాలేజీల ఏర్పాటు. గిగ్ వర్కర్లు, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం.




## ఆ ఇద్దరు ఎమ్మెల్యేలకి కార్పొరేషన్ల పదవులు

హైదరాబాద్, అక్టోబరు31: రేవంత్‌రెడ్డి సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. మంత్రి పదవి కోసం ఎదురు చూసిన మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావులకు కార్పొరేషన్ చైర్మన్ల పదవులని కేటాయించింది. తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా సుదర్శన్‌రెడ్డిని నియమించింది. కేబినెట్ హోదాతో తెలంగాణ ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. 6 గ్యారెంటీల అమలు బాధ్యతని సుదర్శన్‌రెడ్డికి అప్పగించింది కాంగ్రెస్ సర్కార్. అయితే, మంత్రి పదవిని సుదర్శన్‌రెడ్డి ఆశించారు. సివిల్ సప్లాయిస్ కార్పొరేషన్ చైర్మన్‌గా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుని నియమించింది. కేబినెట్ హోదాతో కార్పొరేషన్ చైర్మన్‌గా ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు కొనసాగనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి పదవులు ఆశించిన సీనియర్లని కాంగ్రెస్ హైకమాండ్ బుజ్జగిస్తుంది. కాగా, ఇవాళ(శుక్రవారం) అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. అయితే, రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గాన్ని పూర్తిస్థాయిలో విస్తరించడానికి లైన్ క్లియర్ చేశారు. ఈ క్రమంలో నవంబర్‌లో పూర్తి స్థాయి మంత్రివర్గ విస్తరణ చేయనున్నట్లు సమాచారం. అయితే కేబినెట్ విస్తరణలో భాగంగా కొంతమందిని పక్కన పెట్టి కొత్తవారికి మంత్రి పదవులు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. సామాజిక వర్గాలు, ఉమ్మడి జిల్లాల ప్రాధాన్యత ఆధారంగా కేబినెట్ కూర్పు చేయనున్నట్లు తెలుస్తోంది.




హైదరాబాద్: తెలంగాణ మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పాల్గొన్నారు. 1963 ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లో అజారుద్దీన్ జన్మించారు. అబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించారు. నిజాం కాలేజీలో బీకాం చదివారు. మేనమామ జైనులాబుద్దీన్ స్ఫూర్తితో క్రికెట్ వైపు అడుగులు వేశారు. 1984లో అంతర్జాతీయ క్రికెట్‌లో రంగప్రవేశం చేశారు.

అజారుద్దీన్ క్రికెటర్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తొలి మూడు టెస్టుల్లోనూ సెంచరీలతో సంచలనం సృష్టించారు. 1989లో భారత క్రికెట్ జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టారు. 16 ఏళ్ల క్రికెట్ కెరీర్‌లో 99 టెస్టులు, 334 వన్డేలు ఆడారు. రిటైర్మెంట్ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. 2009 ఫిబ్రవరి 19న కాంగ్రెస్‌పార్టీలో చేరారు. అదే సంవత్సరం యూపీలోని మొరాదాబాద్ స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2018లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అజారుద్దీన్‌ను నియమించారు. **ఏ శాఖ ఇచ్చినా ఓకే : మంత్రి అజారుద్దీన్...** ఈ మేరకు.. అజారుద్దీన్ మీడియాతో మాట్లాడారు.. మంత్రి పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పట్టించుకోవాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. తనకు ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదన్నారు. తన మంత్రి పదవికి, జూబ్లీహిల్స్ ఎన్నికలకు ముడి పెట్టొద్దని పేర్కొన్నారు. రెండింటిని వేరువేరుగా చూడాలని కోరారు. తానేంటో ప్రజలందరికీ తెలుసని ధీమా వ్యక్తం చేశారు. తనకు ఏ శాఖ ఇచ్చినా న్యాయం చేస్తాని అజారుద్దీన్ స్పష్టం చేశారు. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరిగింది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే.. రాష్ట్రంలో ఎప్పుడు కేబినెట్ ఏర్పడినా.. ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి చెందిన అజారుద్దీన్‌కు రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్‌లో స్థానం కల్పించింది.




# మొంథా తుఫాన్ ప్రభావంతో...

# 12 జిల్లాల్లో తీవ్ర నష్టం!

## నష్టాన్ని త్వరితగతిన అంచనా వేయండి

### - అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

హైదరాబాద్, అక్టోబరు31: మొంథా తుఫాన్ ప్రభావంతో 12 జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజలు ఎవరూ అధైర్యపడొద్దని.. అందర్నీ ఆదుకుంటామని భరోసా కల్పించారు. వర్షాలు తగ్గాయి కాబట్టి పంట నష్టాన్ని వెంటనే అంచనా వేయాలని అధికారులని ఆదేశించారు. ఇవాళ(శుక్రవారం) వరంగల్ జిల్లాలోని కాపువాడలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. వరద బాధితులతో మాట్లాడి భరోసా ఇచ్చారు. అలాగే, పోతననగర్‌లో ముంపు ప్రాంతాలని పరిశీలించారు. అనంతరం మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. మొంథా తుఫానుపై ఆస్తి, పంట నష్టం అంచనాలు చేసే సమయంలో ప్రజాప్రతినిధులను తీసుకెళ్లాలని సూచించారు. ఇన్‌చార్జ్ మంత్రులు, కలెక్టర్లతో నివేదికలు తయారుచేయాలని ఆదేశించారు సీఎం రేవంత్‌రెడ్డి. ప్రాణ నష్టం, పశు సంపద నష్టంపై నివేదికలు తెప్పించాలని ఆజ్ఞాపించారు. తుఫానుకి దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు తెప్పించాలని ఆదేశించారు. అన్ని నివేదికలు సమీకరించి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టాలని సూచించారు. తెలంగాణ ధనిక రాష్ట్రమని కేంద్ర ప్రభుత్వం వదిలేస్తే కుదరదని హెచ్చరించారు. క్లౌడ్ బరస్ట్‌లు భవిష్యత్‌లోనూ వస్తాయని తెలిపారు. వర్ష ప్రభావిత సమస్యలను అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని దిశానిర్దేశం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి రూపాయి వచ్చేలా రాష్ట్ర అధికారులు నివేదికలు తయారు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు, కలెక్టర్ల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు. శాఖల మధ్య సమన్వయం లేకపోతే నష్టం జరుగుతుందని చెప్పుకొచ్చారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు వెంటనే చేపట్టాలని ఆజ్ఞాపించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం ఇస్తున్నామని ప్రకటించారు. పొలాల్లో ఇసుక మేటలు తొలగించేందుకు ఎకరాకు రూ.లక్ష అయినా ఇస్తామని చెప్పుకొచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి. ప్రతి ఎకరానికి రూ. 10 వేల చొప్పున పరిహారం అందజేస్తామని పేర్కొన్నారు. దెబ్బతిన్న ప్రతి ఇంటికీ రూ. 15 వేల చొప్పున ఆర్థికసాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. వరంగల్‌లో నాలాలు, చెరువుల కబ్జాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు.

వరంగల్‌లో మున్సిపల్, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయం ఎందుకు లేదని ప్రశ్నించారు. వరంగల్ స్మార్ట్ సిటీ పథకంలో పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని ఆజ్ఞాపించారు. స్మార్ట్ సిటీ పథకంలో ఇంకా నిధులు అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఆర్ఎస్ఎస్‌ను నిషేధించాలి.. ఖర్గే డిమాండ్


న్యూఢిల్లీ: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌పై నిషేధం విధించాలని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మరోసారి డిమాండ్ చేశారు. అయితే ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని అన్నారు. ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలలో ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనకుండా సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కూడా ఒకసారి నిషేధం విధించారని ఆయన వాదించారు. శుక్రవారంనాడిక్కడ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలో ఎక్కువగా శాంతిభద్రతల పరిస్థితి తలెత్తడానికి బీజేపీ-ఆర్ఎస్ఎస్ కారణమని తాను భావిస్తున్నట్టు చెప్పారు. పటేల్ హయాంలో నిషేధం విధిస్తే 2024లో బీజేపీ ప్రభుత్వం ఆ నిషేధాన్ని ఎత్తివేసిందని, ఇప్పుడు మళ్లీ ఆర్ఎస్ఎస్‌పై నిషేధం విధించాలని అన్నారు. కశ్మీర్ మొత్తాన్ని దేశంలో కలపాలని సర్దార్ పటేల్ కోరుకున్నారని, అందుకు అప్పటి ప్రధాని నెహ్రూ నిరాకరించారని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు చేసిన క్రమంలో ఖర్గే తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

సర్దార్ పటేల్ అప్పట్లో జన్‌సంఘ్ పార్టీ సంస్థాపక అధ్యక్షుడు, ఆర్ఎస్ఎస్ నేత శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి రాసిన లేఖను ఖర్గే ప్రస్తావిస్తూ, మహాత్మాగాంధీ హత్యకు దారితీసిన పరిస్థితిని ఆర్ఎస్ఎస్ సృష్టించిందని ఆ లేఖలో పటేల్ పేర్కొన్నట్టు తెలిపారు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్ మధ్య విభేదాలున్నట్టు చిత్రిస్తూ బీజేపీ చరిత్రను వక్రీకరించిందని ఖర్గే తప్పుపట్టారు. అయితే నెహ్రూ, పటేల్ మధ్య చక్కటి సంబంధాలు ఉండేవని, ఇద్దరూ ఒకరినొకరు ప్రశంసించుకునే వారని తెలిపారు.

అక్టోబర్ 31న సర్దార్ పటేల్ జయంతి అయితే, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి అని, వీరిద్దరూ గొప్ప నేతలని ఖర్గే కొనియాడారు. పటేల్ ఉక్కు మనిషి అయితే, ఇందిరాగాంధీ ఉక్కు మహిళ అని, ఇద్దరూ దేశానికి ఎంతో సేవ చేశారని, దేశ ఐక్యతకు




పాటుపడ్డారని అన్నారు. 'ఇది కాంగ్రెస్ చరిత్ర... కాంగ్రెస్ కంట్రిబ్యూషన్' అని ఖర్గే పేర్కొన్నారు. **కాంగ్రెస్ నయవంచన.. బీజేపీ....** ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ వెంటనే స్పందించింది. కాంగ్రెస్ పార్టీ పటేల్ పేరును రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటోందని తప్పుపట్టింది. పటేల్ వారసత్వాన్ని దశాబ్దాలుగా కాంగ్రెస్ నిర్లక్ష్యం చేసిందని, ఇప్పుడు ఆర్ఎస్ఎస్‌పై దాడికి ఆయన పేరును వాడుకుంటోందని బీజేపీ ప్రతినిధి షెహజాద్ పూనావాలా ఆరోపించారు. 'ఐఎన్‌సీ అంటే ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ కాదు. ఇండియన్ నాజీ కాంగ్రెస్. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు పన్నినా ఆర్ఎస్ఎస్‌పై నిషేధాన్ని కోర్టు ఎత్తివేసింది. ఆర్ఎస్ఎస్ రాజకీయేతర సంస్థ అని, ఆ సంస్థ కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు పాల్గొనవచ్చని కోర్టు చెప్పింది. ఇది సహించలేని కాంగ్రెస్ పార్టీ.. పీఎఫ్ఐ, ఎస్‌డీపీఐ, ఎంఐఎంలకు బాసటగా ఉంటూ దేశ సంక్షేమం కోసం పాటుపడుతున్న ఆర్ఎస్ఎస్‌పై విషం చిమ్ముతోంది' అని ఆయన అన్నారు.




## భారత్ బలం తెలిసొచ్చింది: పాక్‌పై మోదీ వ్యాఖ్యలు

చరిత్ర రాయడంలో సమయం వృథా చేయకూడదని, దానిని సృష్టించాలని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విశ్వసించారు. దానికి తగ్గట్టే భారతదేశాన్ని ఏకంచేసి ఆయన చరిత్ర సృష్టించారని కొనియాడారు. గుజరాత్‌లో ఐక్యతా విగ్రహం వద్ద పటేల్ 150వ జయంతి వేడుకల్లో పాల్గొని ప్రసంగించారు. "స్వాతంత్ర్యం తర్వాత 550 సంస్థానాలను ఏకం చేసి అసాధ్యమైన పనిని సుసాధ్యం చేశారు. ఆయనకు ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ దార్శనికత అత్యంత ముఖ్యమైంది. దానిని మేం సమర్థిస్తాం. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల మాదిరిగానే ఏక్తా దివస్‌ను జరుపుకొంటున్నాం. భారతీయులంతా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉంది. విభజన శక్తులకు దూరంగా ఉండాలి. దేశ సమగ్రతకు నక్సలిజం ముప్పుగా పరిణమించింది. నక్సల్స్ ఏరివేత కోసం ఎన్నో ఆపరేషన్స్ చేశాం. నక్సలిజం మూలాలను సమూలంగా పెకిలిస్తాం. కశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో కలపాలని పటేల్ ఆకాంక్షించారు. దానిని నెహ్రూ గౌరవించలేదు. పటేల్, అంబేడ్కర్‌ను కాంగ్రెస్ అవమానించింది. ఆయన దూరదృష్టిని మరిచిపోయింది. **కాంగ్రెస్-ఆర్జేడీ కూటమిని బిహార్ క్షమించదు..** కాంగ్రెస్ చేసిన తప్పు వల్లే కశ్మీర్‌లో కొంత భాగాన్ని పాకిస్థాన్ ఆక్రమించింది. దానివల్ల కశ్మీర్, దేశంలో అశాంతి నెలకొంది. ఉగ్రవాదాన్ని దాయాది దేశం పెంచి పోషించింది. ఇంత జరిగినా ఉగ్రవాదుల ముందు కాంగ్రెస్ తలవంచింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ బలాన్ని ప్రపంచం మొత్తం చూసింది. మన దేశం నిజమైన బలం ఏంటో ఆ ఉగ్రవాదులకు తెలిసింది. దేశ ఐక్యతను బలోపేతం చేసే చర్యలను ప్రోత్సహించాం. ఆయన ఆకాంక్షలను మేం గౌరవించాం. అక్రమ వలసదారులపై చర్యలు తీసుకుంటుంటే కొందరికి బాధగా ఉంటుంది. దేశం నుంచి చొరబాటుదారులను తరిమికొట్టాలని ప్రతిజ్ఞ చేద్దాం" అని మోదీ మాట్లాడారు. పటేల్ జయంతి సందర్భంగా ప్రత్యేక నాణెం, స్టాంపు విడుదల చేశామని వెల్లడించారు. ఈ రోజు పటేల్ జయంతి సందర్భంగా ఏక్తా దివస్‌ను పురస్కరించుకొని ప్రత్యేక పరేడ్ ఏర్పాటుచేశారు. ఇందులో సైనిక దళాల కవాతు ఆకట్టుకుంది.




రాష్ట్ర ఏక్తా దివస్ 2025లో భాగంగా నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజాలో 'ఐక్యత రన్'ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సినీ నటుడు చిరంజీవి హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. టీ హబ్ వద్ద నిర్వహించిన 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమంలో మాదాపూర్ డీసీపీ రితిరాజ్ పాల్గొన్నారు. ఇతర ప్రాంతాల్లోనూ నిర్వహించిన కార్యక్రమాల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.




# ఎకరాకు రూ.10 వేలు కాదు.. రూ.50 వేలు పరిహారం ఇవ్వాలి: కవిత




కరీంనగర్, అక్టోబర్ 31: తెలంగాణలో భారీ వర్షాలకు పంటనష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ. 10 వేలు కాకుండా.. ఎకరాకు రూ. 50 వేలు పరిహారం ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో కొట్టుకుపోయిన కల్వల మత్తడిని శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. కల్వల మత్తడి కొట్టుకుపోయి 3 ఏళ్ళు అవుతోందని.. దీని రిపేర్ కోసం గత ప్రభుత్వమే రూ. 70 కోట్లు విడుదల చేస్తూ జీవో ఇచ్చిందని, కానీ తర్వాత ప్రభుత్వం మారటంతో పనులు జరగటం లేదన్నారు. ఈ మత్తడిని రిపేర్ చేయించాలని హుజూరాబాద్, మానకొండూరు నియోజకవర్గ ఇద్దరు ఎమ్మెల్యేలను కోరుతున్నట్లు తెలిపారు. 6 వేల ఎకరాలకు సాగునీరు ఇచ్చే ఈ ప్రాజెక్ట్‌పై వందలాది రైతు కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకోవాలన్నారు. గతంలో ఇచ్చిన రూ. 70 కోట్ల జీవో ను పాస్ చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు సంబంధం లేకుండా రైతుల బాగు కోసం మత్తడి పనులను తొందరగా పూర్తి చేయాలన్నారు. రైతు లేనిదే రాజ్యం లేదు అనే మాటను నిజం చేయాలంటే రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. గతంలో కట్ట తెగినప్పుడు అప్పటి ప్రజాప్రతినిధులు స్పందించి తొందరగా దీన్ని పూర్తి చేశారని.. అదే స్ఫూర్తితో ఇప్పుడు కూడా మత్తడిని పునరుద్ధరించాలని కోరారు. మొంథా తుపాను కారణంగా తెలంగాణ మొత్తం రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్, ఖమ్మం రైతులకు మాత్రమే ఎకరాకు రూ. 10 వేలు ఇస్తామన్నట్లుగా విన్నామని చెప్పారు. శంకరపట్నంలో కూడా వరి రైతులు నష్టపోయారని.. వారికి కూడా పరిహారం ఇవ్వాలన్నారు. ఎకరాకు రూ. 10 వేలు కాకుండా ఎకరాకు రూ. 50 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దాదాపు చేతికొచ్చిన పంటను రైతులు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఇప్పుడు పంట కోసిన కూడా 25 శాతం వచ్చే పరిస్థితి లేదన్నారు. అందుకే ప్రభుత్వం రైతుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ చొరవ చూపి అధికారులను ఫీల్డ్ కు పంపించి పంట నష్టం లెక్కలు తీయాలన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కూడా కేంద్రం తరపున రైతులకు పంట నష్టం పరిహారం ఇప్పించాలని కోరారు. కల్వల మత్తడి రిపేర్ కోసం ముఖ్యమంత్రితో ఎంపీ మాట్లాడాలన్నారు. అటు ఈ ప్రాజెక్ట్ మీదనే దాదాపు 180 ముదిరాజ్ కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని.. వారికి ఇదే జీవనాధారమని చెప్పారు. వెంటనే మత్తడి బాగు చేయించి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

# డీఆర్సీ సెంటర్‌కు మూడంచెల భద్రత..

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రక్రియను నిర్వహించే యూసుఫగూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియాన్ని డిస్ట్రిబ్యూషన్ రిసెప్షన్ కౌంటింగ్ (డీఆర్సీ)సెంటర్‌గా మార్చి మూడంచెల భద్రతను ఏర్పాటు చేయనున్నారు. అలాగే స్ట్రాంగ్‌రూమ్ భద్రతను కేంద్ర బలగాలు పర్యవేక్షిస్తాయి. – మొదటి అంచెలో.. విజయభాస్కర్ రెడ్డి స్టేడియం ప్రధాన గేటు వద్ద ఒక ఏసీపీ, ముగ్గురు ఇన్‌స్పెక్టర్లు, ఐదుగురు ఎస్‌ఐలు, ఎనిమిది మంది ఏఎస్‌ఐలు, 33మంది కానిస్టేబుళ్లు, 8మంది ఉమెన్ కానిస్టేబుళ్లు, 3 ప్లాటూన్ల సాయుధ బలగాలతో భద్రత ఏర్పాటుచేయనున్నారు. – రెండో అంచెలో.. స్టేడియం లోపలికి వెళ్లే గేటు వద్ద ఒక ఏసీపీ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఏఎసఐలు, 8 మంది కానిస్టేబుళ్లు, నలుగురు ఉమెన్ కానిస్టేబుళ్లు, రెండు చెకింగ్ టీమ్‌లు, రెండు అడ్వాడ్ ఫోర్సెస్ ప్లాటూన్లు బందోబస్తు నిర్వహించనున్నాయి. – మూడో అంచెలో.. స్టేడియం లోపల ఈవీఎంల పంపిణీ, ఓట్ల లెక్కింపును చూసేలా ఒక ఏసీపీ, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ముగ్గురు ఎస్‌ఐలు, నలుగురు ఏఎసలు, 12మంది కానిస్టేబుళ్లు, ఐదుగురు మహిళా కానిస్టేబుళ్లు నిఘాలో ఉండనున్నారు. – స్ట్రాంగ్ రూమ్ వద్ద ఒక ప్లాటూన్ సాయుధ బలగాలు 24 గంటల పాటూ అప్రమత్తంగా ఉండనున్నాయి. – స్టేడియానికి వెళ్లే రోడ్లలో ఆరు పికెటింగ్‌లు ఏర్పాటు చేయనున్నారు. – వెస్ట్‌జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ పర్యవేక్షణలో స్టేడియం వద్ద మూడంచెల భద్రత, నిరంతర నిఘా మధ్య కొనసాగనుంది.. – స్టేడియం చుట్టూ, పికెటింగ్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు.




హైదరాబాద్: రెండేళ్లలోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్ లో పలువురు ఎంఐఎం నాయకులకు కండువా కప్పి గులాబీ పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. నోటికొచ్చిన హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తాం.. యువతులకు స్కూటీలు ఇస్తాం.. వృద్ధులకు నాలుగు వేల పెన్షన్ ఇస్తామంటూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్, ఒక్క హామీని కూడా అమలు చేయలేదని దుయ్యబట్టారు. ఇలాంటి సమయంలోనే ప్రజలు తెలివిగా ఆలోచించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఎలా దారి తప్పించిందో గుర్తుచేసుకోవాలని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డబ్బులు ఇచ్చి ప్రలోభ పెట్టేందుకు కూడా కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని.. ఆ డబ్బులు తీసుకొని మిగితా బాకీ డబ్బులు ఎప్పుడిస్తారో నిలదీయాలన్నారు. ఇవి కారుకు, బుల్డోజర్‌కు మధ్య జరుగుతున్న ఎన్నికలని అభివర్ణించారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టిన ఈ బుల్డోజర్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. కొందరు కాంగ్రెస్ నేతలు ప్రజలపై బెదిరింపులకు దిగుతున్నారని.. వారికి ఎవ్వరూ భయపడాల్సిన పనిలేదని ధైర్యం చెప్పారు. ప్రజలకు బీఆర్‌ఎస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# 2026: తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ 2026 విడుదల




హైదరాబాద్, అక్టోబర్ 31: తెలంగాణలో 2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పరీక్షల తేదీలను ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఈ పరీక్షలు జరగనున్నట్లు తెలిపింది. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమై ఫిబ్రవరి 21వ తేదీ నాటికి పూర్తవుతాయని పేర్కొంది. జనవరి 21వ తేదీన ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష ఉంటుందని, జనవరి 23వ తేదీన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, జనవరి 24వ తేదీన ఎన్విరాన్ మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహిస్తారని స్పష్టం చేసింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది.

**ఇంటర్ ఫస్ట్ ఇయర్ షెడ్యూల్ 2026**... 25- 02 -2026 : పార్ట్ 1 (సెకండ్ లాంగ్వేజ్ -1) 27- 02 -2026 : పార్ట్ 2 - ఇంగ్లీష్ పేపర్ - 1 02- 03 -2026 : మ్యాథ్స్ 1ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్ 5- 03 -2026 : మ్యాథ్య్ పేపర్ 1బీ, జువాలజీ, హిస్టరీ -1 9- 03 -2026 : ఫిజిక్స్, ఎకానమిక్స్ -1 12- 03 -2026 : కెమిస్ట్రీ, కామర్స్ 17- 03 -2026 : మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్ 1, జియోగ్రఫీ - 1

**ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షల షెడ్యూల్ 2026...** 26- 02 -2026 : పార్ట్ 2 (సెకండ్ లాంగ్వేజ్ -2) 28- 02 -2026 : పార్ట్ 1 - ఇంగ్లీష్ పేపర్ -2 03- 03 -2026 : మ్యాథ్స్ 2ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్ -2 6- 03 -2026 : మ్యాథ్య్ పేపర్ 2బీ, జువాలజీ, హిస్టరీ -2 10- 03 -2026 : ఫిజిక్స్, ఎకానమిక్స్ -2 13- 03 -2026 : కెమిస్ట్రీ, కామర్స్ -2 16-03-2026: పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్ 2, 18- 03 -2026 : మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్ 1, జియోగ్రఫీ - 1.

# ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్.. సుప్రీంను గడువుకోరిన స్పీకర్ కార్యాలయం

**హైదరాబాద్: తెలంగాణలో ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు శాసనసభ స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టును గడువు కోరింది. గతంలో సుప్రీంకోర్టు విధించిన మూడు నెలల గడువు నేటితో పూర్తికావడంతో రెండు నెలల గడువు ఇవ్వాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ కార్యాలయం కోరింది. నలుగురు ఎమ్మెల్యేల విచారణ మాత్రమే పూర్తయిందని.. అంతర్జాతీయ సదస్సులు ఉండటంతో గడువు సరిపోలేదని సుప్రీంకోర్టుకు తెలిపింది.**



# కిషన్ రెడ్డికి మహేష్ కుమార్ గౌడ్ సవాల్..




హైదరాబాద్: కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. కాంగ్రెస్ నేత అజారుద్దీన్‌పై ఎలాంటి కేసులు ఉన్నాయి..? అవి ఏమయ్యాయో కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలి..? అని ప్రశ్నించారు. భారత కెప్టెన్‌గా అజారుద్దీన్ ఎన్నో విజయాలు అందించిన విషయం కిషన్ రెడ్డి మరిచిపోయారా..? అని మండిపడ్డారు. ఎంపీగా కూడా అజారుద్దీన్ ప్రజలకు సేవలు అందించారని గుర్తు చేశారు. అజారుద్దీన్ మంత్రి పదవిపై బీజేపీ నేతలు ఎందుకు అక్కసు వెళ్లగక్కుతున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. అజారుద్దీన్ సుదీర్ఘ కాలం దేశానికి సేవలు అందించిన వ్యక్తి అని కొనియాడారు. అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వడం వల్ల మైనారిటీలకు మేలు జరుగుతుందని భావిస్తున్నట్లు చెప్పారు. మంత్రి పదవి గురించి మూడు నెలల ముందుగానే నిర్ణయం తీసుకున్నట్లు మహేష్ కుమార్ గౌడ్ ఆసక్తిర వ్యాఖ్యలు చేశారు.




చింతకాని: ఖమ్మం జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. సీపీఎం నేత, రైతు సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి సామినేని రామారావును దుండగులు హతమార్చారు. చింతకాని మండలం పాతర్లపాడులో ఈ ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లిన ఆయన్ను కత్తులతో పొడిచి చంపేశారు. రామారావు రెండుసార్లు రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శిగా, పాతర్లపాడు సర్పంచ్‌గా పనిచేశారు. ఖమ్మం సీపీ సునీల్ దత్ ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పోతినేని సుదర్శన్, పొన్నం వెంకటేశ్వరరావుతో పాటు పలువురు నేతలు రామారావు కుటుంబాన్ని పరామర్శించారు. మరోవైపు పాతర్లపాడులో పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**రాష్ట్రంలో హింసా రాజకీయాలకు తావు లేదు: భట్టి విక్రమార్క...** సామినేని రామారావు హత్యపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రాష్ట్రంలో హింసా రాజకీయాలకు తావులేదని.. దోషులను వెంటాడి, వేటాడి చట్టపరంగా శిక్షిస్తామని చెప్పారు.

# సర్దార్ స్ఫూర్తితోనే మోడీ ముందడుగు: కిషన్ రెడ్డి




హైదరాబాద్, అక్టోబర్ 31: ఏడాది పాటుగా సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉత్సవాలు జరుపుతామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. పటేల్ రాజకీయ నేత కాదు రైతాంగ ఉద్యమ నేత అని చెప్పుకొచ్చారు. సర్దార్ పటేల్ అంటే కాంగ్రెస్ పార్టీకి నొప్పి అని.. పీవీ నరసింహారావు అంటే కాంగ్రెస్‌కు నచ్చదంటూ వ్యాఖ్యలు చేశారు. కేవలం నెహ్రూ కుటుంబమే కాంగ్రెస్‌కు నచ్చుతుందన్నారు. కాంగ్రెస్‌కు దేశమంటే నెహ్రూ, నెహ్రూ అంటే దేశమని.. నెహ్రూ తప్ప కాంగ్రెస్‌కు ఎవ్వరూ అవసరం లేదని విమర్శలు గుప్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ద్రోహం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది అంటూ విరుచుకుపడ్డారు. పటేల్‌ను వెన్నుపోటు పొడిచిన చరిత్ర కాంగ్రెస్ ది అంటూ ఆరోపించారు. పటేల్‌ను తెలంగాణ బిడ్డలు ఎవరూ మర్చిపోరని.. సర్దార్ చేసిన త్యాగమే తెలంగాణ అని చెప్పుకొచ్చారు. పటేల్ చొరవతోనే తెలంగాణలో మూడు రంగుల జెండా ఎగిరిందని కేంద్రమంత్రి తెలిపారు. నిజాం నిరంకుశత్వంపై ఉక్కు పాదం మోపిన ఘనుడు పటేల్ అని పేర్కొన్నారు. నిజాం మెడలు వంచి తెలంగాణ గడ్డ మీద మూడు రంగుల జెండా ఎగరవేశారన్నారు. ఈ ఏడాది అంతా పటేల్ 150 జయంతి ఉత్సవాలను తెలంగాణలో ప్రతి ఇంట్లో ఘనంగా జరుపుకోవాలని కోరారు. ఆయన స్ఫూర్తిని గుర్తు చేసుకోవాలన్నారు. ప్రతి పౌరుడు పటేల్ చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. సర్దార్ స్ఫూర్తితో ప్రధాని మోడీ అడుగులు వేస్తున్నారని.. వికసిత భారత్ లక్ష్యంగా పరిపాలన కొనసాగిస్తున్నారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.




# మళ్లీ పెరిగిన బంగారం ధర.. ఎంతంటే..?

బంగారం కొనుగోలు చేయాలనుకునే వారికి మరోసారి షాక్ తగిలింది. గత వారం రోజులుగా తగ్గుతూ వస్తున్న బంగారం ధర ఒక్కసారిగా పెరిగింది. ఇవాళ(శుక్రవారం) ఉదయం నిలకడగా ఉన్న పసిడికి ఇప్పుడు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. నిన్న(గురువారం) ఒక్కరోజే తులంపై రూ.1,940 తగ్గిన ధర.. ఇవాళ రూ.1,200 పెరిగింది. దీంతో ప్రస్తుతం దేశంలో 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,22,680 ఉంది. అయితే.. బంగారం ధరలు ఒక్కసారిగా పెరటంతో పెట్టుబడిదారుల్లో ఉత్సాహం నెలకొంది.

**హైదరాబాద్‌లో బంగారం ధరలు..** 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం - 1,22,680 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం - 1,12,450 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం - 92,010

**విజయవాడలో బంగారం ధరలు..** 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం - 1,22,680 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం - 1,12,450 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం - 92,010

**బెంగళూరులో బంగారం ధరలు..** 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం - 1,22,680 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం - 1,12,450 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం - 92,010

**అహ్మదాబాద్‌లో బంగారం ధరలు..** 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం - 1,22,730 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం - 1,12,500 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం - 92,060

చురకలు


## పరమ భాగవతోత్తముడు అంబరీషుడు : ఆధ్యాత్మిక ప్రాసంగికులు డాక్టర్ సంగన భట్ల






భక్తి, శ్రద్ధ, విధేయతతో పరమ భాగవతోత్తముడు అంబరీషుడు శాప విముక్తుడై మరణాన్ని జయించిన ఘట్టం భగవంతుడి భక్తిని ఎలా ఆచరించాలి అన్న సందేశాన్ని అందిస్తుందని ప్రముఖ సంస్కృతాంధ్ర పండితులు, కవి, రచయిత, నటులు, చారిత్రక పరిశోధకులు, నాటక దర్శకులు, విశ్రాంత ప్రాచార్యులు, ఆధ్యాత్మిక ప్రాసంగికులు, విశేషించి పురాణ ప్రవచకులు, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ సంగన భట్ల నర్సయ్య ఉద్ఘాటించారు. ధర్మపురి క్షేత్రంలో శ్రీ శారదా మహిళా మండలి ఆధ్వర్యంలో... మండలి భవనంలో నిర్వహిస్తున్న కార్తీక పురాణ సప్తాహ కార్యక్రమంలో స్కాంద పురాణ అంతర్గత కార్తిక మాస మహాత్మ్యం పురాణ ప్రవచనం గావించారు. ఈ సందర్భంగా శుక్ర వారం స్కాంద పురాణం అంతర్గత కార్తిక మహాత్మ్యం పురాణ ప్రవచనం గావిస్తూ అంబరీష ఉపాఖ్యాన అంశాలను వివరించారు. అంబరీష మహారాజు కథ స్కంద పురాణంలోని కార్తీక మాసం సంబందిత కథలలో ముఖ్యమైనదన్నారు. అంబరీష మహారాజు ఎంతో భక్తిశ్రద్ధలతో వైష్ణవ భక్తుడిగా, శ్రీమహావిష్ణువు పట్ల పరమ భక్తిని కలిగి ఉండేవాడని, తన భార్యతో సహా ద్వాదశి రోజున కృష్ణ పక్షంలో ఏకాదశి వ్రతం ఆచరించాడన్నారు. ఈ వ్రతాన్ని ఎంతో నియమం, నియతంగా పాటించాడని, అంతేకాక, ద్వాదశి రోజు పరమ సంతోషంగా ప్రసాదం స్వీకరించేందుకు సిద్ధమయ్యాడని, ఆ సమయంలో ఆయన ఇంటికి దుర్వాస మహర్షి విచ్చేసిన సందర్భాన్ని వివరించారు. అంబరీషుడు దుర్వాస మహర్షిని గౌరవంతో ఆహ్వానించి, ఆయనకు ఆహారం ఏర్పాటు చేయగా, దుర్వాసుడు తపస్కార్యాలకు వెళ్లి తిరిగి రాకముందే ద్వాదశి సమయం అయిపోతుందనే భయంతో అంబరీషుడు స్వల్ప మాత్రలో జలమును స్వీకరించి వ్రతాన్ని ముగించాడన్నారు. దుర్వాసుడు తిరిగి వచ్చి జరిగింది తెలుసుకుని, కోపంతో అంబరీష మహారాజును శపించాడన్నారు. అంబరీషుడు మహా విష్ణువు ధ్యానంలో లీనమై ఉండగా...దుర్వాసుని హృదయంలో నిల్చిన విష్ణువు...దుర్వాసుని శాపాలను అన్నింటిని స్వీకరించాడని, దాని ఫలితమే దశావతారాల ఆవిర్భావమని వివరించారు. అంబరీషుడు భగవంతుని ఆశ్రయంతో శాపాన్ని తెలుసు కోలేని స్థితిలో... శాపం ఎలాంటి విపత్తు కలిగించ కూడదని మహావిష్ణువు ఆగ్రహంతో దుర్వాసుని కోసం సుదర్శన చక్రాన్ని పంపి రక్షించిన నేపథ్యాన్ని సోదాహరణంగా వివరించారు. మహిళా మండలి అధ్యక్ష కార్యదర్శులు మధ్వాచారి విజయలక్ష్మి, బావి శోభ నిర్వహణలో, సభ్యుల సహకాంతో కార్యక్రమం జరిగింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల**

## రొమాంటిక్ ఐకాన్ హరనాథ్ - నవంబర్ 1... హరనాథ్ వర్ధంతి



బుద్ధరాజు వెంకట అప్పల హరినాథ రాజు అలియాస్ హరనాథ్ (సెప్టెంబర్ 2, 1936 – నవంబర్ 1, 1989) తెలుగు సినిమా కథానాయకుడు. ఆయన 1936లో సెప్టెంబర్ 2 న తూర్పుగోదావరి గొల్లప్రోలు మండలం రాపర్తి గ్రామంలో బుద్ధరాజు వరహాలరాజు దంపతులకు జన్మించాడు. ఆయనకు కుమారుడు శ్రీనివాస రాజు, కుమార్తె పద్మజ ఉన్నారు. తండ్రి బుద్ధరాజు వరహాలరాజు శ్రీ ఆంధ్ర క్షత్రియ వంశ రత్నాకరము అనే గ్రంథ రచయిత. మద్రాసులో పాఠశాల విద్యను పూర్తి చేసి, కాకినాడలో ఆర్ట్స్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. తన కళాశాల రోజుల్లో, పాఠ్యేతర కార్యకలాపాల్లో పాల్గొనడానికి ఉత్సాహభరితమైన వ్యక్తి. ఆయన తన కళాశాలలో నాటకాలు మరియు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి నిలిపాడు. కళాశాలలో హరనాథ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ వంటి అనేక నాటకాల్లో నటించాడు. మరియు బహుమతులు కూడా గెలుచు కున్నాడు. ఆయన శిక్షణ పొందిన పైలట్. ఒక రోజు, ఆయన పైలట్ శిక్షణా తరగతికి హాజరై తిరిగి వచ్చినప్పుడు, దర్శకుడు గుత్తా రామినీడును చూశాడు. ఒకేసారి, దర్శకుడు అతనిని చూశాడుబీ వెంటనే రామినీడు, హరనాథ్ ను తన మనస్సులో ఒక హీరోగా ఊహించు కొన్నాడు. వెంటనే చిత్రంలో హీరోగా బుక్ చేసుకున్నాడు. ఆ చిత్రం ఋష్యశృంగ. 60 వ దశకంలో హరినాథ రాజు తెలుగు సినిమాల్లో రొమాంటిక్ ఐకాన్ గా పేరొందాడు. ఆయన తొలి సినిమా మా ఇంటి మహాలక్ష్మి 1959 లో హైదరాబాద్ సారథీ స్టూడియోస్ లో చిత్రీకరించారు. మా ఇంటి మహాలక్ష్మి సినిమాతో ఎన్టీయార్, ఏఎన్నార్ తరువాత తెలుగులో హరనాద్ ప్రముఖ హీరో అని అనిపించు కున్నాడు. నందమూరి తారక రామారావు 1959 నిర్మించిన సీతారామ కళ్యాణం సినిమాలో శ్రీరాముడుగా నటించాడు. 1967 లో నిర్మించిన భీష్మలో శ్రీకృష్ణుడుగా నటించాడు. 1969 శ్రీ రామ కథ శ్రీ రామ పాత్రలో నటించాడు. సుమారు 117 తెలుగు సినిమాలు, 12 తమిళం, 1 హిందీ, 1 కన్నడం సినిమాల్లో నటించాడు. హరనాథ్, జమున తో కలిసి చాలా చిత్రాల్లో నటించాడు. లేత మనసులు' చిత్రంలో హరనాథ్ నటించిన 'అందాలా ఓ చిలకా, అందుకో నా లేఖా' పాట ఆ రోజుల్లో ఆంధ్రప్రదేశ్ మొత్తాన్ని మంత్ర ముగ్ధులను చేసింది. పాలమనసులు, పెళ్లి రోజు వంటి సినిమాలు, హరనాథ్, జమున ప్రధాన జంటగా అద్భుతమైన విజయాలు సాధించాయి. ఆయన చివరి చిత్రం 1989 లో తోడల్లుడు. ఆయన 1981 లో విడుదలైన మా ఇంటి దేవత అనే ఒక చిత్రాన్ని నిర్మించాడు. చివరి దశలో మద్యపానానికి అలవాటు పడడంతో కేవలం అతిథి పాత్రలలో నటించే అవకాశాలే వచ్చాయి. 1984లో హరనాథ్ చివరగా చిరంజీవి నటించిన, నాగు సినిమాలో తండ్రి పాత్ర పోషించాడు. ఆయన 1989, నవంబర్ 1 న మరణించాడు. హరనాథ్ కుమారుడు శ్రీనివాస్ బుద్ధరాజు చిత్ర నిర్మాత, కుమార్తె పద్మజా చిత్ర నిర్మాత జివిజి రాజు భార్య. హరనాథ్...కలవారి సంసారం (1982)బీ గడసరి అత్త సొగసరి కోడలు (1981)బీ బాల భారతం (1972)బీ భలే పాప (1971)బీ కథానాయిక మొల్ల (1970)బీ శ్రీదేవి (1970)బీ తల్లి తండ్రులు (1970)బీ ప్రేమకానుక (1969)బీ చల్లని నీడ (1968)బీ నడమంత్రపు సిరి (1968)బీ బంగారు సంకెళ్ళు (1968)బీ పెళ్ళిరోజు (1968)బీ భక్త ప్రహ్లాద (1967)బీ చదరంగం (1967)బీ శ్రీ శ్రీ శ్రీ మర్యాద రామన్న (1967)బీ లేత మనసులు (1966)బీ శ్రీకృష్ణ పాండవీయం (1966)బీ చంద్రహాస (1965)బీ సర్వర్ సుందరం (1964)బీ అమరశిల్పి జక్కన్న (1964)బీ మురళీకృష్ణ (1964)బీ పెంపుడు కూతురు (1963)బీ గుండమ్మ కథ (1962)బీ భీష్మ (1962)బీ కలసివుంటే కలదు సుఖంబీ ఋష్య శృంగ (1961)బీ మా ఇంటి మహాలక్ష్మి (1959)బీ తదితర చిత్రాలలో విభిన్న పాత్రలలో నటించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## వరదాయిని ఉత్థాన ఏకాదశి



కార్తీకశుద్ధ ఏకాదశికే ఉత్థాన ఏకాదశి, భోధన ఏకాదశి, దేవ ప్రబోధిని ఏకాదశి అని పేర్లు. ఆషాడ శుద్ధ ఏకాదశి, అంటే తొలి ఏకాదశి రోజున శయనించిన శ్రీమహావిష్ణువు ఈ ఏకాదశి రోజునే యోగనిద్ర నుండి మేల్కొనే రోజు కాబట్టి ఇది ఉత్థాన ఏకాదశిగా అయ్యింది. దీనినే హరి–భోధిని ఏకాదశి అని కూడా అంటారు. తొలి ఏకాదశి నాడు ప్రారంభమైన చాతుర్మాస్యవ్రతం ఈ ఏకాదశితో ముగుస్తుంది. మహభారత యుద్ధంలో బీష్ముడు ఈ ఏకాదశినాడే అస్త్ర సన్యాసం చేసి, అంపశయ్య మీద శయనించాడు. యజ్ఞవల్క్య మహర్షి ఈరోజునే జన్మించారు. ఈ రోజున ఉపవాసం ఉండి, విష్ణువును పూజించి, రాత్రి అంతా జాగరణ చేసి, మరునాడు ద్వాదశి ఘడియలు ఉండగానే విష్ణుపూజ చేసి, పారణ చేసి (భోజనం చేసి) వ్రతాన్ని ముగించాలి. ఈ ఏకాదశి మహత్యాన్ని గురించి బ్రహ్మదేవునికి నారద మహర్షికి మధ్య జరిగిన సంభాషణ స్కందపురాణంలో కనిపిస్తుంది. ఉత్థాన ఏకాదశి పాపాలను హరిస్తుంది. 1000 అశ్వమేధ యాగాలు, 100 రాజసూయ యాగాలు చేసిన పుణ్యం లభిస్తుంది. కొండంత పత్తిని ఒక చిన్న నిప్పు రవ్వ ఎలా కాల్చి బూడిద చేస్తుందో అలా ఒక జీవుడు, తన వేల జన్మలలో చేసిన పాపాలను కాల్చి వేస్తుంది ఈనాటి ఏకాదశి ఉపవాస వ్రతం. ఈ రోజు చిన్న మంచిపని (పుణ్య కార్యం) చేసినా, అది మేరు పర్వతానికి సమానమైన పుణ్య ఫలితం ఇస్తుంది. ఈ ఏకాదశి వ్రతం చేసినవారికి సాధించ లేనివి ఏమి ఉండవు. ఈ రోజు ఉపవాసం ఉన్నవారికి ధాన్యం, సంపదలు, ఉన్నతస్థానం కలగడంతో పాటు పాపాపరిహారం జరుగుతుంది. పుణ్యక్షేత్ర దర్శనాలు, యజ్ఞ యాగాలు, వేదం చదవడం వల్ల కలిగిన పుణ్యానికి కోటిరెట్ల పుణ్యం ఒక్కసారైనా, ఈ ఏకాదశి ఉపవాస వ్రతం చేసినవారికి లభిస్తుంది" అని బ్రహ్మదేవుడు నారదునికి వివరించినట్లు పురాణ కథనం. ఈ వ్రతంలో ఒకరికి చేసే అన్నదానం వలన సూర్య గ్రహణ సమయంలో పవిత్ర గంగాతీరాన కోటిమందికి అన్నదానం చేసినంత ఫలితం లబిస్తుంది. వస్త్రదానం చేయడం వలన, పండ్లు, దక్షిణతో కూడిన తాంబూలాన్ని పండితులకు ఇవ్వడం వలన ఈ లోకంలోనే గాక మరణానంతరం పరలోకంలో కూడా సర్వసుఖాలు లభిస్తాయి. ఈ రోజున బ్రహ్మాది దేవతలు, యక్షులు, కిన్నెరులు, కింపురుషులు, మహర్షులు, సిద్దులు, యోగులు అందరూ విష్ణులోకం చేరి కీర్తనలతోనూ, భజనలతోనూ, హారతులతోనూ శ్రీమహావిష్ణువును నిద్రలేపుతారు. అందువల్ల ఉత్థాన ఏకాదశి రోజున ఎవరు శ్రీ మహావిష్ణువుకు హారతి ఇస్తారో వారికి అపమృత్యు దోషం తొలగి పోతుందని ధార్మిక గ్రంధాలు చెప్తున్నాయి. విష్ణుమూర్తికి హారతి ఇవ్వడం సాంప్రదాయం. ఏవైనా కారణాల వల్ల హారతి ఇవ్వడం కూడా కుదరక పోతే దేవాలయానికి వెళ్ళి. అక్కడ స్వామికి ఇచ్చే హారతిని కన్నులారా తిలకించి, వీలైతే స్వామికి హారతి కర్పూరం సమర్పించాలి. అపమృత్యు దోషం పరిహారం జరుగుతుంది. స్వామి అనుగ్రహం కలుగుతుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# స్వతంత్ర భారతావనిలో రాష్ట్రాల ఏర్పాటు

## నవంబర్ 1...ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినం




స్వతంత్ర భారతంలో రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ ఒక ప్రధాన ఘట్టం, ముఖ్యమైన అంశం. దీని కోసం కేంద్ర ప్రభుత్వం వివిధ కమిటీలను నియమించగా, అవి పలు సిఫార్సులు చేశాయి. 1955 సెప్టెంబర్ 30న ఫజల్ అలీ కమిషన్ నివేదిక కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ సందర్భంగా రాష్ట్రాల పునర్ విభజన కమిటీల గురించి పూర్వా పరాల గురించి తెలిపే ప్రయత్నం. ఖాన్ బహదూర్ సయ్యద్ సర్ ఫజల్ అలీ (19 సెప్టెంబర్ 1886 – 22 ఆగస్టు 1959)... 15 అక్టోబర్ 1951నుండి 30 మే 1952 సుప్రీం కోర్టు న్యాయ మూర్తిగా, 1952 నుండి 1956 వరకు ఒడిశా గవర్నర్‌గా మరియు 1956 నుండి 1959 వరకు అస్సాం గవర్నర్‌గా ఉన్నారు. భారతదేశ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ గురించి సిఫార్సులు చేసిన రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమిషన్‌కు ఫజల్ అలీ నాయకత్వం వహించారు . బ్రిటీష్ సామ్రాజ్యం నుంచి 1947లో స్వాతంత్ర్యం పొందాకా భారతదేశం వేర్వేరు కేటగిరీలుగా విభజించి వుంది. అవి ఇలా ఉన్నాయి. (1).పార్ట్ ఎ రాష్ట్రాలు (పాత బ్రిటీష్ ఇండియా ప్రావిన్సులు)...9 రాష్ట్రాలు: అస్సాం, బీహార్, బొంబాయి, తూర్పు పంజాబ్, మధ్యప్రదేశ్, మద్రాస్, ఒరిస్సా, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌బీ (2).పార్ట్ బి రాష్ట్రాలు (గత సంస్థానాలు లేదా ఒప్పంద రాష్ట్రాల సమూహాలు)...9 రాష్ట్రాలు: హైదరాబాద్, జమ్ము అండ్ కాశ్మీర్, మధ్యభారత్, మైసూర్, పాటి యాలా, తూర్పు పంజాబ్, రాష్ట్రాల యూనియన్ (పిఈపిఎస్‌యు), రాజస్థాన్, సౌరాష్ట్ర, ట్రావెన్కోర్–కొచ్చిన్, వింధ్య ప్రదేశ్‌బీ (3).పార్ట్ సి రాష్ట్రాలు (గత సంస్థానాలు లేదా ప్రావిన్సులు)..10 రాష్ట్రాలు: అజ్మీర్, కూర్గ్, కూచ్ – బీహార్, భోపాల్, బిలాస్ పూర్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, కచ్, మణిపూర్, త్రిపురబీ (4).పార్ట్ డి (కేంద్రపాలిత ప్రాంతం)..అండమాన్ అండ్ నికోబార్ దీవులు..... ఇవన్నీ బ్రిటీష్ వారి రాజకీయ, సైనిక, వ్యూహాత్మక ప్రణాళికకు అనుకూలంగా ఏర్పడుతూ వచ్చాయి. స్వతంత్ర్య భారతంలో రాష్ట్రాల సరిహద్దులు పునర్వి భజనకు ఒక ప్రాతిపదిక కావాల్సి వచ్చింది. భాషల ప్రాతిపదికన పునర్విభజన జరగాలన్నది ప్రతిపాదనల్లో ఒకటి. 1920 నుంచి భారత జాతీయ కాంగ్రెస్ ప్రావిన్సులను భాష ప్రాతిపదికన ఏర్పాటు చేయడానికి కట్టుబడి వుంది. స్వాతంత్ర్యం వచ్చాక రాష్ట్రాలను భాషా ప్రాతిపదికన పునర్విభజిస్తామన్నది కాంగ్రెస్ లక్ష్యాల్లో ఒకటి. ఇది 1945–46 ఎన్నికల మ్యానిఫెస్టోలోని హామీల్లో కూడా చేరింది. విభజన సమయంలో మత వైషమ్యాలతో విపరీతమైన రక్తపాతం, హింస చోటు చేసు కోవడం వంటివి భారతదేశపు తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, తొలి ఉపప్రధాని, గృహమంత్రి వల్లభ్ భాయి పటేల్ మొదలైన వారిలో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటుపై వైఖరిలో మార్పు తీసుకు వచ్చింది. 1948లో రాజ్యాంగ అసెంబ్లీ అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్ ఎస్.కె.దార్ (అలహాబాద్ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి), జె.ఎన్.లాల్ (న్యాయవాది), పన్నాలాల్ (విశ్రాంత భారత సివిల్ సర్వీసెస్ అధికారి)లతో దార్ కమిషన్ ఏర్పాటు చేశారు. కమిషన్ తన నివేదికను సమర్పిస్తూ పూర్తిగా కానీ, ప్రధానంగా కానీ భాషా ప్రాతి పదికన రాష్ట్రాలను ఏర్పాటు చేయడం దేశ విస్తృత ప్రయోజ నాలకు అనుగుణమైనది కాదన్నారు. దార్ కమిషన్ సూచనలను అధ్యయనం చేయడానికి జవహర్ లాల్ నెహ్రూ, వల్లభ్ భాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్యలతో జేవీపీ కమిటీ వేశారు. కొత్త ప్రావిన్సుల ఏర్పాటుకు ప్రస్తుతం సరైన సమయం కాదనీ, ఆ కమిటీ తేల్చి చెప్పింది. డా. అంబేద్కర్ ధార్ కమిషన్‌కు ఒక మెమోరాండం సమర్పించారు (తేదీ 14 అక్టోబర్ 1948), భాషా ప్రావిన్సుల ఏర్పాటుకు మద్దతుగా, ప్రత్యేకంగా మరాఠీ –మహారాష్ట్ర మహారాష్ట్ర రాష్ట్రం బొంబాయి రాజధానిగా ఏర్పడింది. 1952 నాటికి, మద్రాస్ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తెలుగు–మెజారిటీ రాష్ట్ర ఏర్పాటు డిమాండ్ చాలా శక్తిమంతంగా మారింది. తెలుగు మెజారిటీ రాష్ట్ర ఏర్పాటు డిమాండ్ చేస్తున్న కార్యకర్తలలో ఒకరైన పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి 16 డిసెంబర్ 1952 న మరణించారు. రాష్ట్రాల పునర్విభజన కమిషన్ (ఎస్సార్సీ) లేదా ఫజల్ అలీ కమిషన్ డిసెంబర్ 29, 1953లో భారత కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల సరిహద్దులను పున: సమీక్షించడంలో సలహా ఇచ్చేందుకు ఏర్పరిచింది. కమీషన్ లో ఫజల్ అలీ, కె.ఎం.పణిక్కర్, హెచ్.ఎం.కుంజ్రూలు ఉన్నారు. తెలుగు–మెజారిటీ ఆంధ్ర రాష్ట్రం 1953 లో ఏర్పడింది. ఇది దేశవ్యాప్తంగా ఆందోళనలు రేకెత్తించింది, భాషా సంఘాలు ప్రత్యేక రాష్ట్రాల కోసం డిమాండ్ చేశాయి. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ కమిషన్ నివేదిక ప్రభుత్వం 30–సెప్టెంబర్ –1955 మధ్యాహ్నం అందుకుంది. ఈ కమిషన్ తన నివేదికలో....మూడు అంచెల (పార్ట్–ఎ/బి/సి) రాష్ట్ర వ్యవస్థను రద్దు చేయాలని, రాజప్రముఖ సంస్థ మరియు పూర్వ సంస్థానాలతో ప్రత్యేక ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఆర్టికల్ 371 ద్వారా భారత ప్రభుత్వంలో ఉన్న సాధారణ నియంత్రణను రద్దు చేయాలని, అండమాన్ నికోబార్, ఢిల్లీ మరియు మణిపూర్ 3 రాష్ట్రాలు మాత్రమే కేంద్రపాలిత ప్రాంతాలుగా ఉండాలని, ఇతర పార్ట్–సి/డి భూభాగాలను పక్క రాష్ట్రాలతో విలీనం చేయాలని నివేదించింది. ఈ నివేదిక 14 డిసెంబర్ 1955 న లోక్ సభలో పెట్టబడింది. కమిషన్ చేసిన సలహాల్లో కొన్నిటిని కేంద్ర ప్రభుత్వం 1956 నాటి రాష్ట్రాల పునర్విభజన చట్టం, 1956లో పరిగణనలోకి తీసుకుంది. దీనికి అనుగుణంగా 1956లో పార్లమెంట్ రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణ చట్టం, ఏడో రాజ్యాంగ సవరణ చేసింది. ఈ సవరణ ద్వారా పార్ట్ –ఎ,పార్ట్ –బి, పార్ట్–సి అనే వ్యత్యాసాలను రద్దు చేసి రాష్ట్రాలను పునర్ వ్యవస్థీ కరించింది. ఫలితంగా 14 రాష్ట్రాలు, ఆరు కేంద్రపాలిత ప్రాంతాలతో నూతన వ్యవస్థ అమల్లోకి వచ్చింది. రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా తెలంగాణ ప్రాంతాన్ని కలుపుకొని ఆంధ్ర ప్రదేశ్‌గా రాష్ట్రాన్ని పునర్ వ్యవస్థీకరించారు. ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణతో కలిపి 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరించింది. 1956 తర్వాత...గుజరాత్ (1 మే, 1960) 15వ రాష్ట్రంగా, నాగాలాండ్ (1 డిసెంబర్, 1963) 16వ రాష్ట్రంగా ఏర్పాటైంది. హర్యానా(1 నవంబర్, 1966)17వ రాష్ట్రంగా, 18వ రాష్ట్రంగా, మణిపూర్ (21 జనవరి, 1972) 19వ రాష్ట్రంగా, త్రిపుర (21 జనవరి, 1972) 20వ రాష్ట్రంగా, మేఘాలయ (21 జనవరి, 1972) రాష్ట్రంగా, సిక్కిం (16 మే, 1975) 22వ రాష్ట్రంగా, మిజోరాం (20 ఫిబ్రవరి, 1987) 23వ రాష్ట్రంగా, అరుణాచల్ ప్రదేశ్ (20 ఫిబ్రవరి, 1987)24వ రాష్ట్రంగా, గోవా (30 మే, 1987) 25వ, ఛత్తీస్‌గఢ్(1 నవంబర్, 2000) 26వ రాష్ట్రంగా, ఉత్తరాఖండ్ (9 నవంబర్, 2000) 27వ రాష్ట్రంగా, జార?ండ్ (15 నవంబర్, 2000) 28వ రాష్ట్రంగా జార?ండ్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణ (2 జూన్, 2014): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని పునర్ వ్యవస్థీకరించి 29వ రాష్ట్రంగా 10 జిల్లాలతో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విడిపోయింది. భారత దేశంలో ప్రస్తుతం మొత్తం 28 రాష్ట్రాలు మరియు 8 కేంద్రపాలిత ప్రాంతాలు ఉన్నాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

## మహిమాన్వితాలు... పంచ పర్వాలు



కార్తీకమాసం అన్ని మాసములలో, అత్యంత పవిత్రమైనదిగా భావించ బడుతున్నది. 'న కార్తీక సమో మాసః' అని అత్రి మహాముని వచనము. కార్తీక మాసంతో సమానమైన మాసం లేదని అర్థం. కార్తీక మాసంలో చేయదగిన పుణ్య కార్యక్రమాలలో నదీ స్నానం, ఉపవాసం, పురాణ పఠనం, ఆధ్యాత్మిక అంశాల శ్రవణం, దీపారాధనం, దీప దానం, తులసిమాల ధారణం, సాలగ్రామ పూజ, దైవ పూజ, వనభోజనం మున్నగునవి. కాగా వీటిలో విశేష పుణ్య ఫలాలను ఇచ్చేది కార్తీక స్నానం. జ్యోతిష శాస్త్ర ప్రకారం ప్రతి మాస నిర్ణయము ఆ మాసంలో పౌర్ణిమ రోజున వచ్చే నక్షత్రం ఆధారంగా చేయబడుతుంది.. "చంద్రుడు పౌర్ణిమ రోజున కృత్తికా నక్షత్రములో సంచరించే మాసం కార్తీక మాసం". అంబా దులా నితంతీ చ, అభ్రయంతి తథైవ చ, వర్షయంతి చపుణికా, షడ్ ఏతే కృత్తికా స్మృతా...అంబా, దులా, నితంతీ, అభ్రయంతీ, వర్షయంతీ, చపూణికా అనే పేర్లతో పిలవబడే షట్కృత్తికలు కార్తీక మాస మునకు అధిపతులు. కృత్తికా నక్షత్రము కృత్తికలకు అధిష్టానము, అగ్ని స్వరూపము. అశ్విన్యాది 27 నక్షత్రములు దేవతలకు ఇంద్రియ ములుగా చెప్పబడ్డాయి. 'నక్షత్రం దేవమింద్రియం అని శృతి వచనం. వాటిలో అతి ముఖ్యమైన తేజస్సును దేవతలకు అందించే నక్షత్రం కృత్తికా. అట్టి కృత్తికా నక్ష త్రముతో కూడిన పౌర్ణిమాస్య కలిగిన ఈ మాసము కార్తీక మాసముగా, విశేష పుణ్య ఫలదముగా చెప్ప బడింది. చాంద్రమాన రీత్యా ఎనిమిదవ మాసమైన కార్తీకమునకు ఒక విశేష స్థానము కలదు. శరదృతువు ఉత్తర భాగములో వచ్చే కార్తీక మాసము నెల రోజులు పర్వ దినాలుగానే భావిస్తారు. ప్రత్యేకించి కార్తీక శుక్ల ఏకాదశి నుండి పౌర్ణమి వరకు "పంచ పర్వాలుగా" భావించ బడతాయి. కార్తీక శుద్ధ ఏకాదశి – ఉత్థాన ఏకాదశి ప్రత్యేకత ననుసరించి, ఆషాడ శుద్ధ ఏకాదశి మొదలు కార్తీక శుద్ధ ద్వాదశి వరకు గల నాలుగు మాసములు చాతుర్మాస్య వ్రతముగా చెప్పబడు చున్నవి. మహా విష్ణువు ఆషాడ శుద్ధ ఏకాదశి మొదలు కార్తీక శుద్ధ ఏకాదశి వరకు యోగనిద్రలో ఉండి, తిరిగి కార్తీక శుద్ధ ఏకాదశి నాడు ఉత్థానము చెందును కావున, దీనిని "ఉత్థాన ఏకాదశి" అని కూడా పిలుస్తారు. పీఠాధిపతులు, యతీశ్వరులు, మునులు ఈ వ్రతమును ఎంతో భక్తి శ్రద్ధలతో, ఆహార నియమాలతో చేయడం జరుగు తున్నది. కార్తీక శుద్ధ ఏకాదశి లేదా "ఉత్తాన ఏకాదశి" లేదా ప్రభోదనైకాదశి" అంటారు. ప్రబోధనైకాదశి నాడు విష్ణుమూర్తి క్షీరాబ్ధి నుండి బయలు దేరి "క్షీరాబ్ది ద్వాదశి", "చిలుకు లేదా మదన ద్వాదశి", "యోగిని ద్వాదశి" నాడు విష్ణువు....లక్ష్మి. బ్రహ్మ మున్నగు వారితో కలిసి బృందావనంలో ప్రవేశిస్తాడు. దీనిని క్షీరసాగరాన్ని మధించిన చిలికిన దినంగా వ్యవహరిస్తారు. అమదేర్ జ్యోతిషీ గ్రంథ ప్రకారం చాతుర్మాస్య వ్రత సమాపనదినం. విష్ణ మూర్తికి ప్రీతిపాత్రమైనది కార్తీక శుద్ధ త్రయోదశి. విష్ణువు శంకరుడిని పూజించిన దినం "వైకుంఠ చతుర్దశి". ఇది జాగరణ వ్రతం, ప్రతిమావ్రతం, లింగ వ్రతం, ప్రబోధ వ్రతాలకు ఉద్దీపితమైనది. "కార్తీక పౌర్ణమి" శివునికి ప్రీతిపాత్రం. ముక్కంటి త్రిపురాసుడిని హత మార్చిన దినం. పార్వతి దేవి పాప పరిహా రార్ధం శివారాధన చేసిన దినం. బౌద్ధులకు చాతు ర్మాస్య వ్రతారంభదినం. ఇలా ఐదు దినాలను పంచ పర్వాలుగా ఆచరించడం సనాతన సాంప్రదాయాచారం. దేవాలయా లలో మూల విరాట్టుల అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు, పూజలు చేస్తారు. భక్తులు ఆలయాల మధ్య గల ఉసిరిక వృక్షం చుట్టూ సాంప్రదాయ ప్రదక్షిణలు ఆచరించి, ఉసిరికలను దానం చేసుకుని కార్తీక దామోదరునికి ప్రత్యేక పూజలొనరిస్తారు. మంగళ స్నానాలాచరించి, దొప్పలలో వెలిగించిన కార్తీక దీపాలను వదిలి పెడతారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

చురకలు

# సంపాదకీయం

## పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్యలో అమెరికా డ్రోన్లు.. ఏమిటీ అసలు గుట్టు!

ఇటీవల అఫ్ఘనిస్థాన్–పాకిస్థాన్ మధ్య ఇటీవల తీవ్ర ఘర్షణ వాతావరణం నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ ఘటనలో సైనికులతో పాటు సామాన్యులు ప్రాణాలు కోల్పోయారు. అయితే... టర్కీ, ఖతార్ మధ్యవర్తిత్వంతో కొన్ని రోజులు కాల్పుల విరమణ జరిగింది. అయితే తాజాగా టర్కీ వేదికగా జరుగుతున్న శాంతి చర్చలు విఫలమయ్యాయి. అయితే అందుకు కారణం అమెరికా డ్రోన్లు అనే విషయం తాజాగా తెరపైకి వచ్చింది. అవును... సరిహద్దుల్లో కాల్పుల విరమణ, సీమాంతర ఉగ్రవాదం, మొదలైన అం శాలపై ఈ రెండు దేశాల మధ్య శనివారం టర్కీ వేదికగా చర్చలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. అయితే ఇవి విఫలమైనట్లు తాజాగా పాకిస్థాన్ ప్రకటించింది. ఈ సందర్భంగా స్పందించిన పాక్ సమాచార, ప్రసార శాఖ మంత్రి అతావుల్లా తరార్.. చర్చల్లో ఎలాంటి పరిష్కారమూ కనుగొనలేకపోయామని, అవి విఫలమయ్యాయని తెలిపారు.

**అసలు విషయం చెప్పిన ఆఫ్ఘన్ మీడియా!:** టోలో న్యూస్ నివేదిక ప్రకారం.. ఆఫ్ఘన్ గగనతలాన్ని ఇస్లామాబాద్ ఉల్లంఘించడం ఆపివేసి, అమెరికా డ్రోన్ విమానాలను నిరోధించినట్లయితే.. పాకిస్తాన్ పై దాడులకు తమ భూభాగాన్ని ఉపయోగించకుండా నిరోధించడానికి ఆఫ్ఘనిస్తాన్ కట్టుబడి ఉంటుందని చర్చలు జరిపిన వారు తెలిపారు. అయితే... ఈ షరతుకు పాకిస్తాన్ అంగీకరించడానికి నిరాకరించిందని ఆఫ్ఘన్ మీడియా ఒక మూలాన్ని ఉటంకిస్తూ తెలిపింది. ఇదే సమయంలో... ఆఫ్ఘనిస్తాన్ లోపల నిఘా, సంభావ్య దాడుల కోసం డ్రోన్లు తన గగనతలంలో పనిచేయడానికి అనుమతించే మరో దేశంతో ఒప్పందంపై సంతకం చేసినట్లు పాకిస్తాన్ అంగీకరించిందని కాబూల్ కు చెందిన జర్నలిస్ట్ తమీమ్ బాహిస్ ఎక్స్ లో పోస్ట్ చేశారు. అయితే.. చర్చల్లో మాత్రం అమెరికాతో చేసుకున్న ఆ ఒప్పందాన్ని ఉల్లంఘించలేమని పాకిస్థాన్ పేర్కొందని టోలో న్యూస్ వెల్లడించింది. ఇదే క్రమంలో... పాకిస్తాన్ సంధానకర్తలు మొదట్లో కొన్ని నిబంధనలను అంగీకరించారని.. అయితే, పాకిస్తాన్ హైకమాండ్ కు ఫోన్ కాల్ వచ్చిన తర్వాత తమ వైఖరిని మార్చుకున్నారని.. అమెరికా డ్రోన్ లపై తమకు నియంత్రణ లేదని, ఐసిస్ పై చర్య తీసుకునేలా చేయలేమని చెప్పారని ఆ వర్గాలు చెప్పాయని అది పేర్కొంది. ఈ సమాధానానికి ఖతార్, టర్కీ మధ్యవర్తులు కూడా ఆశ్చర్య పోయారని అది నివేదించింది.


**భారత్ పై పాక్ ఆరోపణలు!:** ఇటీవల ఢిల్లీ – కాబూల్ మధ్య బంధం మరింత బలపడుతున్నాయని చెబుతోన్న వేళ పాకిస్థాన్ కడుపు తెగ మండిపోతుందనే చెప్పాలి. ఇప్పటికే ఢిల్లీ చెప్పినట్లుగా కాబూల్ ఆడుతుందని.. వారి తరుపున తాలిబన్లు తమపై ప్రాక్సీ యుద్ధం చేసున్నారని పాకిస్థాన్ పదే పదే ఆరోపించింది. ఈ క్రమంలో తాజాగా శాంతి చర్చలు విఫలమవ్వడంతో అందుకు భారత్ కారణమని చెప్పుకొచ్చింది. ఈ సందర్భంగా స్పందించిన పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ స్పందిస్తూ... కాబూల్ లో తీగలను లాగుతూ, తోలుబొమ్మ ప్రదర్శన నిర్వహిస్తున్న వారిని ఢిల్లీ నియంత్రిస్తోందని అన్నారు. అయితే... పాకిస్తాన్ గడ్డను ఉపయోగించి అమెరికా డ్రోన్ దాడుల అంశంపై మాత్రం ఆసిఫ్ స్పందించలేదు! మరోవైపు... తాలిబన్ పాలనను పూర్తిగా తుడిచిపెట్టి, వారిని తిరిగి గుహల్లోకి నెట్టేందుకు పాకిస్తాన్ తన పూర్తి ఆయుధశాలలో కొంత భాగాన్ని కూడా ఉపయోగించాల్సిన అవసరం లేదని.. వారు కోరుకుంటే, తోరా బోరా వద్ద వారి ఓటమి దృశ్యాలు పునరావృతం కావడం ఖచ్చితంగా ఈ ప్రాంత ప్రజలకు చూడటానికి ఒక దృశ్యం అవుతుందని ఖ్వాజా ఆసిఫ్ చెప్పారని కరాచీకి చెందిన డాన్ నివేదిక తెలిపింది.

# కవితాలోకాన కల్పవల్లి.. దేవులపల్లి - నవంబర్ 1... కృష్ణశాస్త్రి జన్మదినం



ఆయన కవిత్వంలో భావుకత్వం వెల్లివిరుస్తుంది.. ఆయన రాసే గీతాల్లో లాలిత్యం పాఠకులను తన్మయత్వంలో మునిగితేలేలా చేస్తుంది. తెలుగు కవిత్వ లోకాన ఆయన ఓ ప్రముఖ అధ్యాయం. తెలుగు సినిమా రంగాన ఆయన పాటలు జగద్విఖ్యాతం. ఆంధ్రా షెల్లీగా ప్రఖ్యాతి గాంచి "కృష్ణపక్షం" వంటి గొప్ప రచనను తెలుగు పాఠకులకు అందించిన ఆ మేటి సాహితీ దురంధరుడే "దేవులపల్లి కృష్ణశాస్త్రి". దేవులపల్లి కృష్ణశాస్త్రి తూర్పు గోదావరి జిల్లా, పిఠాపురం దగ్గరలోని రామచంద్రపాలెం గ్రామంలో తమ్మన్నశాస్త్రి, సీతమ్మ దంపతులకు నవంబరు 1, 1897 తేదీన జన్మించారు. అతని విద్యాభ్యాసమంతా పిఠాపురం పాఠశాలలో సాగింది. పాఠశాల రోజుల్లోనే కూచి నరసింహం, రఘుపతి వెంకటరత్నం వంటి రచయితల వద్ద ఆంగ్ల సాహిత్యాన్ని ఔపోసన పట్టాడు కృష్ణశాస్త్రి. 1918లో విజయ నగరం వెళ్లి డిగ్రీ చేస్తున్న రోజుల్లోనే ఆయనకు కవిత్వం రాయడం పట్ల మమకారం ఏర్పడింది. డిగ్రీ పూర్తి చేసి పెద్దాపురంలో ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరాక ఆయన పూర్తిస్థాయిలో రచనా వ్యాసంగాన్ని మొదలు పెట్టారు. బ్రహ్మసమాజం లోను, నవ్య సాహితీసమితి లోను సభ్యునిగా, భావ కవిత్వోద్యమ ప్రవర్తకునిగా దేశమంతటా ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సమయంలో ఎందరో కవులతోను, పండితులతోను పరిచయాలు కలిగాయి. ప్రాచ్య, పాశ్చాత్య సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. పిఠాపురంలోని హరిజన వసతి గృహంతో సంబంధం ఏర్పరచుకొని హరిజనోద్ధరణ కార్యక్రమాలలో పాల్గొన్నందున బంధువులు అతనిని వెలివేశారు. అయినా వెనుకాడని కృష్ణశాస్త్రి వేశ్యావివాహ సంస్థను ఏర్పాటు చేసి ఎందరో కళావంతులకు వివాహాలు నిర్వహించారు. 1922లో కృష్ణశాస్త్రి సతీమణి అర్థాంతరంగా మరణించడంతో కొన్నాళ్లు అదే బాధలో గడిపారు ఆయన. అదే బాధలో అనేక విషాద కవితలు రాశారు. ఊహా ప్రేయసి, ఆత్మాశ్రయత్వం, ప్రవాసము, ఊర్వశి వంటి ఖండకావ్యాలు అలా పుట్టినవే. 1929లో రవీంద్ర నాథ్ టాగుర్‌తో ఏర్పడిన పరిచయం కృష్ణశాస్త్రి జీవితాన్ని మరో మలుపు తిప్పింది. మరిన్ని కవితా రచనలను చేసేలా ప్రేరేపించింది. లాలిత్యం, సారళ్యం, ప్రకృతి సౌందర్యం – కృష్ణశాస్త్రి పాటల్లోని ప్రధాన లక్షణాలు. భావోద్వేగాలకు, హృదయ స్పందనలకు అక్షర రూపమిచ్చి భావ కవితలంత సుకుమారంగా ప్రణయ విరహ గీతాల్ని రాసిన కవి. చందమామ లోని చల్లదనాన్ని, మందార పువ్వులోని మకరందాన్ని, గుండెలోని ఆర్ద్రతని రంగరించి రాస్తే అది కృష్ణశాస్త్రి పాటవుతుంది. పట్టు పరికిణిలో ఒదిగిన సింగారం కృష్ణశాస్త్రి పాట. ఆయన తెలుగు పదం అమ్మమ్మ చేతిలో నేతి నైవేద్యం. వర్షం వచ్చేముందు వీచే చల్లనిగాలి తెమ్మెర తనువును తాకితే ఎంత పులకరిస్తామో, కృష్ణశాస్త్రి కవిత వింటుంటే అదే పులకరింత వీనుల విందుగా వస్తుంది. భావ కవిత్వానికి సినిమా పాటల ద్వారా ఒక శాశ్వత స్థానాన్ని ఏర్పాటు చేసి, దిశానిర్దేశం చేసిన అతి కొద్ది మంది కవులలో కృష్ణశాస్త్రి ముందుంటారు. తెలుగు సినిమాల్లో జనని జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి.. అని భరతమాతను కీర్తించినా, జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్య ధాత్రి.. అంటూ దేశభక్తిని చాటినా.. ఆకులో ఆకునై , పువ్వులో పువ్వునై , నునులేత రెమ్మనై, సెలయేటిలో పాటనై, తెరచాటు తేటినై , నీలంపు నిగ్గునై... అని మగువ ఆర్ద్రతకు పెద్దపీట వేసినా అది కృష్ణశాస్త్రికే చెల్లింది. భావ కవిగా, 'ఆంధ్రా షెల్లీ 'గా ప్రసిద్ధులైన దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి... 1942లో బి.ఎన్.రెడ్డి ప్రోత్సాహంతో 'మల్లీశ్వరి (1951)'తో చిత్రరంగంలో అడుగుపెట్టి, సినిమా పాటకు కావ్య గౌరవం కలిగించి, మల్లీశ్వరితో ప్రారంభించి కృష్ణశాస్త్రి ఎన్నో చక్కని సినిమా పాటలు అందించారు. అవి సామాన్యులనూ, పండితులనూ కూడా మెప్పించే సాహితీ పుష్పాలు. తరువాత అనేక చిత్రాలకు సాహిత్యం అందించాడు. 1957లో ఆకాశవాణిలో చేరి తెలుగు సాహిత్య ప్రయోక్తగా అనేక గేయాలు, నాటికలు, ప్రసంగాలు అందించారు. పిలచిన బిగువటరా, ఎ మనసున మల్లెల మాలలు, ఆకాశ వీధిలో హాయిగా , ఔనా.. నిజమేనా? సడి సేయకో గాలి ప్రతి రాత్రి వసంత రాత్రి, రానిక నీకోసం, ఆకులో ఆకునై, ఆరనీకుమా ఈ దీపం, గోరింట పూచింది, పగలైతే దొరవేరా, గట్టుకాడ ఎవరో, కుశలమా.. నీకు కుశలమేనా, చుక్కలతో చెప్పాలని, అడుగడుగున గుడి ఉంది, రావమ్మా మహాలక్ష్మీ, ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకు, ఈనాటి బంధం ఏనాటిదో, వేళ చూస్తే.. సందె వేళ, చీకటి వెలుగుల కౌగిటిలో, పాడనా తెనుగు పాట, ఇది మల్లెల వేళయనీ, మావి చిగురు తినగానే, లాంటి పాటలు సినీ సాహిత్యంలో అజరామరాలు. 1975లో–ఆంధ్ర విశ్వవిద్యాలయం – కళాప్రపూర్ణ, 1978లో సాహిత్య అకాడమీ అవార్డు, 1976లో పద్మ భూషణ్ దేవులపల్లి ని వరించాయి. 1964 లో తిరుపతిలో అన్నమయ్య జయంతి ఉత్సవంలో కృష్ణశాస్త్రి పాల్గొన్నారు. ఆయన వెంట బాలాంత్రపు రజనీ కాంతరావు కూడా వెళ్ళారు. ఉపన్యాసం చదివేందుకు ఉద్యుక్తుడైన కృష్ణశాస్త్రి గొంతు బొంగురు పోయింది. దాంతో తన ఉపన్యాసాన్ని రజనీకాంతరావు చేత చదివించారు. వైద్య పరీక్షల్లో అది గొంతు క్యాన్సర్ అని నిర్ధారణ అయింది. మద్రాసులో కృష్ణశాస్త్రి స్వరపేటికను తొలగించారు. స్వరపేటిక తొలగించిన తరువాత కృష్ణశాస్త్రి దాదాపు పదహారేళ్లు బ్రతికినా, మూగవోయిన కంఠంతోనే అనేక సినిమాలకు పాటలు, ఆకాశవాణికి లలిత గీతాలు రాశారు. 1980 ఫిబ్రవరి 24న కృష్ణశాస్త్రి మరణించారు. తెలుగు దేశపు నిలువుటద్దం బద్దలైంది. షెల్లీ మళ్లీ మరణించాడు' అంటూ కృష్ణశాస్త్రి చనిపోయిన రోజున శ్రీశ్రీ రోదించాడు. కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ స్పందిస్తూ 'ఒక్క షెల్లీ యే కాదు, కీట్స్, వర్డ్స్‌వర్త్ వంటి మహాశయుల సంయుక్త స్వరూపం కృష్ణశాస్త్రి' అన్నారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# తెలంగాణ ప్రజాసాహిత్య పితామహుడు వట్టికోట - నవంబర్ 1...వట్టికోట ఆళ్వారుస్వామి జయంతి



తెలంగాణ ప్రజాసాహిత్య చరిత్రలో వట్టికోట ఆళ్వారుస్వామి ఒక మహోన్నత స్థానం పొందారు. ఆయన కేవలం రచయిత మాత్రమే కాకుండా ఉద్యమకర్త, కమ్యూనిస్టు నాయకుడు, ప్రచురణకర్త, పాత్రికేయుడిగా విభిన్న రంగాలలో సేవలందించారు. భాషా సాహిత్యం నుంచి పౌరహక్కుల ఉద్యమాల వరకు అనేక రంగాలలో ఆయన తన ప్రతిభను ప్రదర్శించారు. ఆయనకు "తెలంగాణ ప్రజాసాహిత్య పితామహుడు" అనే బిరుదు అందించారు.

**బాల్యం మరియు ప్రారంభ జీవితం...** 1915 నవంబర్ 1న నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలంలోని చెరువు మాదారం అనే గ్రామంలో జన్మించిన ఆళ్వారుస్వామి, చిన్నతనం నుండే సామాజిక అన్యాయాలను గమనించారు. ఈ అన్యాయాలు ఆయనలో చైతన్యాన్ని, మార్పు తపనను రేకెత్తించాయి. ఆయనకు సాహిత్యం పట్ల ఉన్న ఆసక్తిని "గ్రంథాలయోద్యమం" మరింత పెంచింది. నిజాం పాలనలో ఉన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ దౌర్జన్యాలు ఆయనను రాజకీయాల వైపు నడిపించాయి. వట్టికోట ఆళ్వారుస్వామి నిజాం పాలనకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. పేద ప్రజల పట్ల అన్యాయం, వివక్షలపై ఆయన గళం ఎత్తారు. ఈ ఉద్యమంలో ఆయన అనేక సార్లు జైలు శిక్ష అనుభవించారు. జైలు జీవితం ఆయన వ్యక్తిత్వం, సాహిత్యం పై విపరీతమైన ప్రభావం చూపింది. జైలులో ఉన్నప్పుడు ఆయన తన అనుభవాలను కథల రూపంలో అభివ్యక్తం చేయడం ప్రారంభించారు. "జైలు లోపల" అనే కథా సంపుటి ఆయన జైలు అనుభవాలకు ప్రతిబింబంగా నిలిచింది, ఇందులో జైలు లోపల నిర్బంధితుల జీవితం, వారి బాధలు వాస్తవానికి దగ్గరగా ఉంటాయి. తెలుగులో రాజకీయ నవలలను రచించిన మొట్ట మొదటి వ్యక్తిగా వట్టికోట ఆళ్వారు స్వామి ప్రసిద్ధి చెందారు. ఆయన "ప్రజల మనిషి" అనే నవల రచించి తెలంగాణ ప్రజల జీవన పరిస్థితులను, సామాజిక అన్యాయాలను, ప్రజల మానసిక స్థితిగతులను ప్రతిబింబించారు. ఈ నవల ఆనాటి సామాజిక, రాజకీయ పరిస్థితులపై తీవ్ర విమర్శగా నిలిచింది. వట్టికోట రచనల్లోని కథలు, నాటికలు సమాజాన్ని విమర్శిస్తూ, ప్రజలను చైతన్యవంతం చేసే లక్ష్యంతో ఉన్నవి. సురవరం ప్రతాప రెడ్డి హైదరాబాద్ లో స్థాపించిన "గోలకొండ" పత్రిక లో ప్రూఫ్ రీడర్ గా పని చేసారు. వట్టికోట ఎల్లప్పుడూ ప్రజాస్వామ్య విలువలను గౌరవించి, ప్రజా స్వేచ్ఛను కాపాడటానికి కృషి చేశారు. సమాజంలో న్యాయం, సమానత్వం రావాలనే ఆశయంతో ఆయన అనేక కార్యక్రమాలలో పాల్గొన్నారు. వట్టికోట ప్రజాసాహిత్య చైతన్యానికి ఒక బలమైన పునాదిగా నిలిచారు. ప్రజల జీవన గాథలను సాహిత్యంలోకి తీసుకురావడం ద్వారా సామాజిక మార్పు తపనను ప్రేరేపించారు. తెలంగాణా లో స్టేట్ కాంగ్రెస్, ఆర్య సమాజం, ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ, అభ్యుదయ రచయితల సంఘం, తెలంగాణా రచయితల సంఘం వంటి సామాజిక, రాజకీయ సాహిత్య సంస్థలలో కార్యకర్తగా, నాయకుడిగా పనిచేశారు. హైదరాబాద్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, 1944లో గుమాస్తాలు సంఘం, రిక్షాకార్మిక సంఘం, రైల్వే ఉద్యోగులు, కార్మిక ఉద్యోగుల సంఘాలకు నాయకత్వం వహించారు. దాశరధి వట్టికోట కలసి 1948 లో మూడు నెలలు నిజామాబాద్ జైలులో ఉన్నారు. దాశరథి పద్యాలు జైలు గోడల మీద రాసి దెబ్బలు తిన్నారు. వట్టికోట ఆళ్వారుస్వామి కేవలం ఒక రచయిత మాత్రమే కాకుండా సమాజ సేవకుడు, ఉద్యమకర్త, ప్రజల చైతన్య దాత అని చెప్పవచ్చు. ఆయన రచనలు ప్రజల బాధలను, వారి ఆశయాలను ప్రతిబింబిస్తూ, ప్రజాస్వామ్య పునాదుల స్థాపనకు తోడ్పడతాయి. ఆయన సాహిత్యం తెలంగాణ ప్రజాసాహిత్యంలో ఒక అద్భుతమైన అధ్యాయంగా నిలిచిపోతుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం




ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి 1953, అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం అవతరించగా 1956 నవంబర్ 1న హైదరాబాద్ రాష్ట్రం విలీనం కావడంతో ఆంధ్ర రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ గా మారింది. దేశంలో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందింది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలన్న అమరజీవి పొట్టి శ్రీరాములు కృషి సాకారం అయిన నిజమైన దినం. ఆ రోజునే ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవంగా జరుపుకుంటూ వచ్చారు. 2014 జూన్ 2న రాష్ట్రం విడిపోయిన తర్వాత చంద్రబాబు ప్రభుత్వం సంప్రదాయంగా వస్తున్న అవతరణ దినోత్సవానికి స్వస్తి పలికి, జూన్ 2న నవ నిర్మాణ దీక్షలను చేపట్టింది. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని ఎప్పుడు జరపాలో తెలపాలని చంద్రబాబు హయాంలో అధికారులు కేంద్ర హోం శాఖను కోరారు. దీనిపై కేంద్ర హోం శాఖ .. ఆంధ్రప్రదేశ్ ఒరిజనల్ బ్రాండ్ ఇమేజ్‌ను కోల్పోకుండా ఉండాలంటే గతంలో లాగానే నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని నిర్వహించు కోవాలని స్పష్టం చేసింది. అలా విడిపోయిన నాలుగు రాష్ట్రాలు ఆ విభజన తేదీ నాడే అవతరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయని, అసలు రాష్ట్రాలు మాత్రం పాత అవతరణ తేదీ నాడు దినోత్సవాలనే చేసుకుంటున్నాయని కేంద్ర హోంశాఖ స్పష్టం చేసింది. ఫలితంగా నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించి ఆచరిస్తున్నది. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి 1953, అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం అవతరించగా.. 1956 నవంబర్ 1న హైదరాబాద్ రాష్ట్రం విలీనం అయిన నేపథ్యంలో ఆంధ్ర రాష్ట్రం .. ఆంధ్రప్రదేశ్‌గా మారింది. దేశంలో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గుర్తింపు పొందింది. 2014 జూన్ 2న రాష్ట్రం విడిపోయాక.. జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవం జరుపు కోవడం ఆనవాయితీగా మారింది. మద్రాసు ప్రెసిడెన్సీలో 40 శాతం జనసంఖ్య, 58 శాతం రాష్ట్ర విస్తీర్ణం తెలుగు వారిదే. రాష్ట్ర రాజకీయాలలో తమకు పలుకుబడి లేదని, తమిళుల చేత అవహేళనకు గురౌతున్నామన్న భావన తెలుగు వారిలో మెదలైంది. 1911 లో ఆనాటి వార్తా పత్రికల వ్యాసాల ద్వారా, సంపాదకీయం ద్వారా తెలుగు ప్రజలలో ప్రత్యేక రాష్ట్ర వాంఛ మొదలైంది. 1911 చివరి నాటికి ప్రత్యేక రాష్ట్ర చర్చ ఊపందుకుంది. తమిళులలో మాత్రం ఈ ప్రతిపాదనకు వ్యతిరేకత వ్యక్తమైయ్యింది. పట్టాభి సీతారామయ్య మాత్రం ఆంధ్ర ప్రాంతాన్ని ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా, దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు కావాలని సూచించారు. తెలుగు మాట్లాడే ప్రజలందరూ ఒకే రాష్ట్రంగా ఏర్పడాలనే అభిప్రాయాలు ఆంధ్రరాష్ట్ర ఉద్యమం ప్రారంభమైనప్పటి నుండి వినబడు తుండేది. 1938 లో ఆచార్య మామిడిపూడి వెంకట రంగయ్య, సమైక్య తెలుగు రాష్ట్రం ఏర్పడే అవకాశాల గురించి మాట్లాడారు. 1940లో, 1942లో ఆంధ్ర నాయకులు సమైక్య తెలుగు రాష్ట్రం గురించి తమ ఆశాభావాలను వ్యక్తం చేశారు. హైదరాబాద్ సంస్థానం విమోచన తర్వాత సమైక్య తెలుగు రాష్ట్రం ఏర్పాటుకు అవకాశాలు పెరిగాయి. 1949 లో అయ్యదేవర కాళేశ్వరరావు విశాలాంధ్ర మహాసభ ఏర్పాటు చేశారు. 1951 లో కూడా కాంగ్రెస్ అఖిల భారత సమావేశాలలో ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు విశాలాంధ్ర విషయాన్ని ప్రస్తావించారు. పొట్టి శ్రీరాములు అక్టోబర్ 19, 1952లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర డిమాండ్‌తో మద్రాసులో ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించారు. 50రోజుల నిరహార దీక్ష తరువాత, మద్రాసును వదులుకొంటే ఆంధ్ర రాష్ట్ర నిర్మాణం సాధ్యపడుతుందని ప్రధాని నెహ్రూ ప్రకటించారు. పొట్టి శ్రీరాములు అందుకు అంగీకరించ కుండా తన నిరాహార దీక్షను కొనసాగించి డిసెంబర్ 15వ తేదీన ఆత్మార్పణ చేసుకొన్నారు. ఆయన ఆత్మార్పణ తరువాత ఆంధ్ర ప్రాంత జిల్లాల్లో పెద్దయెత్తున హింసా కాండ చెలరేగింది. మద్రాసు నగరాన్ని మినహాయించి మద్రాసు రాష్ట్రంలోని తెలుగు జిల్లాలతో ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేస్తామని ప్రధాని నెహ్రూ లోక్‌సభలో ప్రకటించారు. ఆర్థికపరమైన, పాలనా పరమైన విషయాలను దృష్టిలో ఉంచుకొని విభజన ప్రక్రియలో అవసరమైన సిఫారసులు చేయడానికి జస్టిస్ కైలాసనాథ్ వాంచూను ప్రత్యేకాధికారిగా కేంద్ర ప్రభుత్వం నియమించింది. వాంచూ నివేదిక ప్రకారంగా ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటును 1953 మార్చి 25న నెహ్రూ ప్రకటించారు. ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు ప్రకటనతో రాయలసీమ శాసనసభ్యులు రాజధాని విషయంలో శ్రీబాగ్ ఒడంబడికను పాటించాలని కోరారు. ఆచార్య రంగా నాయకత్వంలోని కృషిక్ లోక్‌పార్టీ తిరుపతిని ఆంధ్ర రాష్ట్ర రాజధానిగా చేయాలని కోరారు. కమ్యూనిస్టులు విజయవాడను రాజధానిగా చేయాలని కోరారు. చివరకు కర్నూలును ఆంధ్ర రాష్ట్ర తాత్కాలిక రాజధానిగా అందరూ ఒప్పుకున్నారు. 1953 వ సంవత్సరం ఇదే రోజు పదకొండు తెలుగు మాట్లాడే జిల్లాలు కలిసి ప్రత్యేక రాష్ట్రంగా అవతరించాయి. అంతకు ముందు ఇవి మద్రాస్ రాష్ట్రంలో ఉండేవి. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు పనిచేసారు. అనంతరం 1956 నవంబర్ ఇదే రోజున నిజాం పాలనలో ఉన్న తెలంగాణా ప్రాంతాన్ని ఆంధ్ర ప్రదేశ్ లో విలీనం చేసారు. 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడ్డాక, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు పై ఒత్తిడి పెరిగింది. కాంగ్రెసు, కమ్యూనిస్టులతో సహా అన్ని ప్రముఖ రాజకీయ పార్టీలూ దీనిని సమర్థించడంతో విశాలాంధ్ర స్వప్నం నిజమయే రోజు దగ్గర పడింది. 1953 డిసెంబరులో సయ్యద్ ఫజల్ ఆలీ నేతృత్వంలో రాష్ట్రాల పునర్విభజన కమిషను ఏర్పాటయింది. 1955 సెప్టెంబర్ 30 న తన నివేదిక సమర్పించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అది సమర్థించింది. మరాఠీ మాట్లాడే ప్రాంతాలను మహారాష్ట్ర లోను, కన్నడం మాట్లాడే ప్రాంతాలను కర్ణాటక లోను కలిపి తెలుగు మాట్లాడే ప్రాంతాలను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చెయ్యాలని సూచించింది. అయితే ఐదు సంవత్సరాల తరువాత రాష్ట్ర శాసనసభలో మూడింట రెండు వంతులు సభ్యులు ఒప్పుకుంటే, ఆంధ్రతో విలీనం చెయ్యవచ్చని కూడా సూచించింది. కమిషను సూచనలను ఆహ్వానించి, ప్రత్యేక రాష్ట్రవాదనను సమర్థించిన వారిలో కె.వి.రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి ప్రముఖులు. హైదరాబాద్ శాసనసభలో అధిక శాతం సభ్యులు ఆంధ్ర ప్రదేశ్‌ను సమర్థించారు. శాసనసభలో ఈ విషయంపై చర్చ జరిగినపుడు, 103 మంది సభ్యులు ఆంధ్ర ప్రదేశ్‌కు మద్దతు తెలుపగా, 29 మంది మాత్రమే వ్యతిరేకించారు. 15 మంది తటస్థంగా ఉండిపోయారు. ఆంధ్ర ప్రదేశ్‌ను సమర్థించిన ప్రముఖ నాయకులలో అప్పటి ముఖ్యమంత్రి బూరుగుల రామకృష్ణా రావు, మాడపాటి హనుమంత రావు, స్వామి రామానంద తీర్థ మొదలైనవారు ఉన్నారు. దీని నివేదికపై తెలంగాణ, విశాలాంధ్ర వాదులు తమతమ వాదనలను తీవ్రతరం చేసారు. కమ్యూనిస్టులు తీవ్రంగా ప్రతిస్పందిస్తూ, హైదరాబాదు శాసనసభకు రాజీనామా చేసి, ఈ విషయంపై ఎన్నికలకు వెళ్తామని ప్రకటించారు. కాంగ్రెసు అధిష్ఠానం కూడా ఆంధ్ర ప్రదేశ్‌నే సమర్థించి, ఆంధ్ర, తెలంగాణా నాయకులను తమ విభేదాలను పరిష్కరించుకొమ్మని ఒత్తిడి చేసింది. 1956 ఫిబ్రవరి 20 న ఢిల్లీలో రెండు ప్రాంతాల నాయకులు సమావేశ మయ్యారు. తెలంగాణా తరపున బూరుగుల రామకృష్ణా రావు, కె.వి.రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి, జె.వి.నర్సింగ్ రావు పాల్గొనగా, ఆంధ్ర తరపున బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, గౌతు లచ్చన్న, అల్లూరి సత్యనారాయణ రాజు సమావేశాల్లో పాల్గొన్నారు. ఆ విధంగా అనేక చర్చలు, సంప్రదింపుల అనంతరం 1956 జూలై 19 న వారిమధ్య పెద్ద మనుషుల ఒప్పందం కుదిరింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమమైంది. 1956 నవంబర్ 1న అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా ఆంధ్ర ప్రదేశ్ ఆవిర్భవించింది. నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు. అప్పటి వరకు హైదరాబాద్ ముఖ్య మంత్రిగా ఉన్న బూరుగుల రామకృష్ణా రావుకు కేరళ గవర్నరు పదవి లభించింది. ఆంధ్ర రాష్ట్ర గవర్నరు అయిన సి.ఎం.త్రివేది, ఆంధ్ర ప్రదేశ్ తొలి గవర్నరుగా కొనసాగాడు. ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవంను నవంబరు 1వ తేదీగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఖరారు చేసింది. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రం నుంచి విడిపోయి 1953, అక్టోబర్ 1న ఆంధ్ర రాష్ట్రం అవతరించగా 1956 నవంబర్ 1న హైదరాబాద్ రాష్ట్రం విలీనం కావడంతో ఆంధ్ర రాష్ట్రం కాస్తా ఆంధ్ర ప్రదేశ్ గా మారింది. దేశంలో తొలి భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ గుర్తింపు పొందింది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటు చేయాలన్న అమరజీవి పొట్టి శ్రీరాములు ఆలోచన సాకారమైన దినమిది. ఆ రోజునే ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవంగా జరుపుకుంటూ వచ్చారు. రెండు రాష్ట్రాలు విడి పోయిన తరువాత రాష్ట్ర విభజన జరిగిన జూన్ 2 వ తేదీన అపాయింట్ డే గా ప్రకటించి ప్రతి సంవత్సరం 2 వ తేదీ నుంచి జూన్ 8 వరకూ నవ నిర్మాణ దీక్ష పేరుతొ ఉత్సవాలు చేస్తూ వచ్చేది గత ప్రభుత్వం అధికారికంగా ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవం జరుపు కోవడం లేదు. జగన్ సీఎం అయినాక నవంబర్ 1న ఆంధ్ర ప్రదేశ్ అవతరణ దినోత్సవం నిర్వహించాలని అధికారికంగా నిర్ణయించి పాటించగా, ప్రస్తుత చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం నవంబర్ 1నే జరపాలని నిర్ణయించింది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# నేర ప్రవర్తన.. ఏదీ పరివర్తన..?

నిజామాబాద్ : ఇటీవల నిజామాబాద్‌లో కానిస్టేబుల్ ప్రమోద్‌ను వాహన దొంగ రియాజ్ (24) హత్య చేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైంది. కొద్దిరోజుల వ్యవధిలో హైదరాబాద్‌లో కరుడుగట్టిన నేరస్థుడు అన్సారీ (32) డీఎస్పీ గన్‌మెన్‌పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఇలాంటి ఘటనలు వరుసగా చోటుచేసుకుంటున్నాయి. పోలీసులపై తిరగబడేవారిలో యువకులైన నేరగాళ్లే ఎక్కువగా ఉ ంటున్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనూ మొత్తం 355 మందిపై రౌడీషీట్లు కొనసాగుతుండగా.. వీరిలో మూడోవంతు మంది 20-35 ఏళ్ల లోపువారే కావడం గమనార్హం.

**వాహనం మాయమైనా.. చోరీ జరిగినా**

జిల్లాలో చోరీలు, ముఖ్యంగా వాహన దొంగలు పేట్రేగిపోతున్నారు. కొందరు యువకులు జల్సాలు, సులువైన సంపాదనకు పక్కదారి పడుతున్నారు. సెప్టెంబరు 28న.. ఐదో ఠాణా పరిధి బ్రాహ్మణ కాలనీలోని ఇంట్లో దొంగతనం జరిగింది. 33 తులాల బంగారం, నగదు మాయమైంది. ఇది.. ఐదుగురు సభ్యుల ముఠా పని. పట్టుబడిన షేక్ సల్మాన్(25), మరాటి ఆకాశ్‌రావు(20)లు చిన్నవయసు వారే. పారిపోయిన మరో ముగ్గురిదీ పాతికేళ్ల లోపు వయసే. మరో ఘటనలో వాహనాలు చోరీ చేసే అంతర్రాష్ట్ర ముఠాను నిజామాబాద్ పోలీసులు ఇటీవల పట్టుకున్నారు. వారి వద్ద 9 ఆటోలు, 3 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ముఠా సభ్యులంతా 20-30 ఏళ్లలోపు వారే.

**మారకుండా.. మరింత ద్వేషంతో..**

ఏ నేర ఘటన జరిగినా, మూడు పదుల వయసు దాటని వారు నేరస్థులుగా చిక్కుతుండటంపై జిల్లా పోలీసు అధికారులు నివ్వెరబోతున్నారు. సత్ప్రవర్తనతో జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాల్సింది పోయి, చిన్న వయసులో కటకటాల పాలవుతున్నారని వారు పేర్కొంటున్నారు. కొందరు బెయిల్‌పై



విడుదలైన తర్వాతా బుద్ధి మార్చుకోకపోవడం, సమాజం పట్ల మరింత ద్వేషంతో పాత నేర ప్రవృత్తిని కొనసాగిస్తుండటం అందరినీ కలవరపరుస్తోంది. ఇటీవల పోలీసు కాల్పుల్లో మరణించిన రియాజ్ నేపథ్యమే ఓ ఉదాహరణ. మూడుసార్లు బెయిల్‌పై బయటకొచ్చినా అతడు మారలేదు. చిన్నతనం నుంచే పిల్లల ప్రవర్తనను గమనించి, వారిని సరైన మార్గంలో నడిపించాల్సిన బాధ్యత కన్నవాళ్లపైనే ఎక్కువగా ఉంటుందని పోలీసు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. మత్తు అనర్థాలపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో సమాజ చైతన్యానికి కృషిచేస్తున్నారు.

**మందలించో.. ప్రేమతో నచ్చజెప్పో**

కులమతాలకు అతీతంగా పండగలు, సంబరాలు జరుపుకొనే ఇందూరులో.. కొందరు ఆర్థిక, రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకు యువతను పెడదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఒకరు వర్గ విభేదాల సృష్టికి, ఇంకొకరు గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయాల్లో ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో కొందరు యువతను కరుడుగట్టిన నేరస్థులుగా తయారు చేస్తున్నారు. జిల్లాలో అర్ధాంతరంగా చదువు మానేస్తున్న వారిలో ఎక్కువ మంది మెకానిక్, ఆటోవాలా, కూలి తదితర పనులపై ఆధారపడుతున్నారు. కొందరు సులువుగా ఎదిగేందుకు గంజాయి సరఫరా, దొంగతనాల బాటపడుతున్నారని పోలీసు చెబుతున్నారు. తొలి నేరం సమయంలోనే కన్నవాళ్లు, కుటుంబీకులు గట్టిగా మందలించో, ప్రేమతో నచ్చజెప్పో పిల్లలను మార్చాలని సూచిస్తున్నారు. నేరగాళ్లతో స్నేహం చేయకుండా, గ్యాంగ్‌ల వెంట తిరగకుండా జాగ్రత్తపడాలన్నారు.

# ఇంకుడు గుంతల్లో ఒర'బడి'

నిజామాబాద్ : పాఠశాల స్థాయిలోనే నీటి విలువ, భవిష్యత్తు అవసరాల గురించి పిల్లలకు అనుభవపూర్వకంగా నేర్పించాలనే సంకల్పంతో.. కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ)' పథకం బడుల్లో వర్షపు నీటి సంరక్షణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పథకం అమలయ్యే బడుల్లో ఇంకుగు గుంతలు నిర్మించేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. ఆ విశేషాలు..

**ఉమ్మడి జిల్లాలో.. 69 పాఠశాలల్లో అమలు..**

పీఎంశ్రీ పథకానికి రెండు విడతల్లో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 69 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఇందులో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న నిజామాబాద్(20), కామారెడ్డిలో(14) పాఠశాలల్లో ఇంకుడు గుంతల కార్యక్రమం అమలు చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ఒక్కో పాఠశాలకు రూ.1.10లక్షలు చొప్పున ఉమ్మడి జిల్లాకు రూ.37.40లక్షలు వెచ్చించనున్నారు.

**జాబితాలో చోటు దక్కించుకున్నవి ఇవే..**

ఉమ్మడి జిల్లాలోమొదటి విడతలో 34 పాఠశాలల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరయ్యాయి.

పల్లికొండ, భీమ్‌గల్, సాలూర, చందూర్, ఎల్లారెడ్డిపల్లి, జక్రాన్‌పల్లి, కొనసముందర్, గొట్టుముక్కల, మల్లారం, వేల్పూర్ జడ్పీహెచ్‌ఎస్



పాఠశాలలతో పాటు ధర్పల్లి, సిరికొండ ఆదర్శ పాఠశాలలు, దూద్‌గాన్ కాలనీ బాలికల టీఎస్ఆర్ఈఐఎస్, నిజామాబాద్ టీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్, నవీపేట్, వర్ని కేజీబీవీలు, కోటగల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వెంపల్లి, రుద్రూర్ గాంధీ, కుర్నపల్లి(తె/మీ) ప్రాథమిక పాఠశాలలు ఎంపికయ్యాయి.

బోర్లంలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్(జి), బాన్సువాడ టీడబ్ల్యూ ఆశ్రమ(బాలికల) పాఠశాలలు, పుల్కల్, దోమకొండ(బాలికల), ఖందేబల్లూర్, కామారెడ్డి(బాలుర), పాల్వంచ, బోర్లం, నెమ్లి, పెద్దకోడపగల్, తలమడ్ల జడ్పీహెచ్‌ఎస్‌లు, మద్నూర్ కేజీబీవీ, నిజాంసాగర్, సదాశివనగర్ ఆదర్శ పాఠశాలలు చోటు దక్కించుకున్నాయి.

**పనులు ప్రారంభించేలా చర్యలు**పీఎంశ్రీ పాఠశాలల్లో వర్షపునీటి సంరక్షణకు సంబంధించిన నిధులు మంజూరు చేస్తూ పాఠశాల విద్యా ప్రాజెక్టు డైరెక్టర్ నవీన్ నికోలస్ ఇటీవల ఉత్తర్వులిచ్చారు. వాటికనుగుణంగా పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అశోక్, డీఈవో, నిజామాబాద్

# ఇంధన రహితం.. కేంద్రం అభిమతం



భగత్‌నగర్ : జిల్లా ఎలక్ట్రికల్ ఛార్జింగ్ స్టేషన్లకు అడ్డా కాబోతోంది. కేంద్ర ప్రభుత్వం శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గిస్తూ పునరుత్పాదక వనరుల వినియోగాన్ని పెంచడానికి ఎలక్ట్రికల్ వాహనాలను ప్రోత్సహిస్తోంది. మరో వైపు కాలుష్యాన్ని తగ్గించాలని చూస్తోంది. దీనిలో భాగంగా ఎలక్ట్రికల్ వాహనాలు(ఈవీ)లకు ఆర్థికంగా ప్రోత్సాహకాలు ఇస్తున్నా.. వినియోగం మాత్రం అనుకున్న స్థాయిలో లేదు. అందుబాటులో ఛార్జింగ్ స్టేషన్లు లేకపోవడమే దీనికి కారణమని తెలుస్తోంది. ఈ ఇబ్బందులను తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం జిల్లాలో 150 స్టేషన్లు మంజూరు చేసింది.

**నూరు శాతం రాయితీ..**

జిల్లావ్యాప్తంగా 14 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లే ఉన్నాయి. ప్రయాణం మధ్యలో ఛార్జింగ్ తగ్గితే తిరిగి పెట్టుకోవడానికి అందుబాటులో కేంద్రాలు లేకపోవడంతోనే వీటి కొనుగోళ్లలో పురోగతి లేదు. ఛార్జింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే స్థలాలను ఏ, బీ, సీ, డీ నాలుగు విభాగాలుగా గుర్తించి రాయితీలు ప్రకటించింది.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్థలాలను 'ఏ' కేటగిరీగా గుర్తించింది. దీని కింద ఏర్పాటు చేసే వాటికి కేంద్రం నూరు శాతం మౌలిక సదుపాయాలకు నిధులు ఇస్తుంది. ఎలక్ట్రిక్ వెహికిల్ సప్లయ్ ఎక్విప్‌మెంట్ (ఈవీఎస్ఈ)కు అయ్యే ఖర్చు నిధులు అందజేస్తుంది. ఏ, బీ కేటగిరీలో లేని ప్రాంతాలు షాపింగ్ మాల్‌లు, మార్కెట్ కాంప్లెక్స్‌లలో ఏర్పాటు చేసే వాటికి మౌలిక సౌకర్యాలకు మాత్రం 80 శాతం రాయితీ ఇవ్వనుంది

బ్యాటరీ మార్చే కేంద్రాలను 'సీ' కేటగిరీగా గుర్తించారు. మౌలిక సౌకర్యాల ఏర్పాటుకు 80 శాతం రాయితీ కింద కేంద్రం నిధులు ఇస్తుంది.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు, పబ్లిక్ సెక్టార్ల ఆధీనంలో లేదా నిర్వహణలో ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసే ఈవీ ఛార్జింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవచ్చు. ఆయా ప్రాంతాలను 'బీ' కేటగిరీగా గుర్తించింది. రైల్వే స్టేషన్లు, విమానాశ్రమాలు, ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల విక్రయ కేంద్రాలు, బస్‌స్టేషన్లు, నగర, పురపాలక పార్కుల్లో ఏర్పాటు చేసేవాటికి మౌలిక సౌకర్యాల ఏర్పాటుకయ్యే ఖర్చులో 80 శాతం, ఈవీఎస్ఈకి అయ్యే ఖర్చుకు 70 శాతం నిధులను కేంద్రం ఇస్తుంది. మిగతా నిధులు సంబంధిత శాఖ పెట్టాల్సి ఉంటుంది.

**జిల్లాలో 48 ప్రాంతాల గుర్తింపు**

విద్యుత్తు అధికారులు జిల్లా కేంద్రంతోపాటు హైవేలలో ప్రభుత్వ, పబ్లిక్ రంగ సంస్థల స్థలాల్లో ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడానికి 48 ప్రాంతాలను గుర్తించాం. ఇందులో 24 ప్రభుత్వ స్థలాలు, 12 ప్రభుత్వ రంగ సంస్థల స్థలాలు ఉన్నాయి. బ్యాటరీ మార్చుకునే స్థలాలను ఇంకా గుర్తించలేదు. మేక రమేశ్‌బాబు, ఎస్ఈ, విద్యుత్తు శాఖ

# గుట్టుగా గుట్టలు మాయం



సైదాపూర్ : వరంగల్-కరీంనగర్ జాతీయ రహదారి పనుల్లో భాగంగా సైదాపూర్ మండలంలోని గొడిశాల గ్రామ శివారులోని గుట్టల నుంచి మట్టిని గుట్టుగా తరలిస్తున్నారు. మట్టి తరలింపు పేరుతో కొందరు అనుమతులకు మించి తవ్వుతూ తరలిస్తున్నారు. అడ్డుకొని ప్రశ్నించిన వారికి డబ్బు ఎర చూపి శాంతింపజేస్తున్నారనే ఆరోపణలున్నాయి. అడ్డుకోవాల్సిన ప్రజాప్రతినిధులు, అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కవుతున్నారని వాపోతున్నారు.

**కొరవడిన పర్యవేక్షణ**

గుట్టలు, వాటి సమీప స్థలాల యజమానులు అక్రమాలను ప్రశ్నించకుండా పట్టాలు తమ పేర్ల మీదనే ఉన్నాయంటూ గుత్తేదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతోనే ఇలా జరుగుతోందంటున్నారు. సంబంధిత మైనింగ్ అధికారులు సైతం పట్టించుకోవడంలేదని.. అనుమతులు తీసుకున్నది ఒక చోట అయితే మరో చోట మట్టి తీస్తున్నారని గ్రామస్థులంటున్నారు. రెవెన్యూ అధికారులు సైతం ఇటువైపు కన్నెత్తి చూడకపోవడంతో గుత్తేదారులు ఇష్టారాజ్యంలా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు, మైనింగ్ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి అనుమతి మేరకు మట్టిని తీసుకునేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**నిబంధనల మేరకే..**

జాతీయ రహదారి నిర్మాణానికి అవసరమైన మట్టిని తీసుకునేందుకు అనుమతులిచ్చాం. మైనింగ్ శాఖ నిబంధనల మేరకు అవకాశం కల్పించాం.

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే మట్టిని తరలిస్తున్నారు. ఎక్కడా అక్రమాలు జరగడంలేదు. ప్రైవేటు వ్యక్తులు వారి పట్టా భూముల నుంచి అనుమతుల మేరకే మట్టిని ఇస్తున్నారు.వెంకటేశ్, అసిస్టెంట్ జియోలజిస్ట్, కరీంనగర్

# ప్రాణవాయువుపై పట్టింపేది?



మెట్‌పల్లి : కరోనా సమయంలో ఆక్సిజన్ కొరత నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాలోని కోరుట్ల, మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రుల్లో 2021లో ఆక్సిజన్ ప్లాంట్‌లు నెలకొల్పింది. అయితే సంబంధిత సిబ్బంది, నిధులు కేటాయించక అవి నిరుపయోగంగా మారి ప్రాణవాయువు అందించలేక పోతున్నాయి. ఈ రెండు దవాఖానాల్లో నిత్యం సుమారు 300 ఓపీ ఉంటుంది. రూ.కోటిపైగా వ్యయంతో 500 ఎల్‌పీఎం(లీటర్ ఫర్ మినిట్) ఉత్పత్తి సామర్థ్యం గల ప్లాంట్‌లతో ఐసీయూలో రోగులకు ఆక్సిజన్ సరఫరా చేయాలి. కానీ వృథాగా ఉండటంపై విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో అవసరం మేరకు ఆక్సిజన్ సిలిండర్, కాన్సంట్రేటర్‌లను వినియోగిస్తున్నారు.

**ఆరుబయట.. నిర్లక్ష్యంగా..**

కోరుట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి పాత, నూతన భవనాల్లో స్థలం, గదుల కొరతతో ఆరుబయట ఆక్సిజన్ ప్లాంట్ పరికరాలను ఉంచి కవర్ కప్పారు. నూతన భవనంలో ఆక్సిజన్ సరఫరాకు ఐసీయూ గదుల్లో ప్రత్యేకంగా పైప్‌లైన్‌లను సైతం ఏర్పాటు చేశారు. 10 నెలల క్రితం భవనాన్ని అందుబాటులోకి తీసుకురాగా.. ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రత్యేక గది, రేకుల షెడ్డును నిర్మించకుండా బయట నిర్లక్ష్యంగా ఉంచారు. రూ.లక్షలు విలువ చేసే పరికరాలు ఎండకు ఎండి, వానకు తడుస్తున్న పట్టించుకోవడం లేదు.

**విద్యుత్తు నియంత్రిక లేక..**

మెట్‌పల్లి సామాజిక ప్రభుత్వాసుపత్రి వెనక భాగంలో రేకుల షెడ్డును నిర్మించి ఆక్సిజన్ ప్లాంట్ యంత్రాలు బిగించారు. ఐసీయూతో పాటు అవసరమైన గదులకు అనుసంధానం చేశారు. తాత్కాలిక జనరేటర్ సహాయంతో ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవడానికి 100 కేవీ విద్యుత్తు నియంత్రిక అవసరం ఉంది. నియంత్రిక ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిన ఇంకా మంజూరు కాలేదు. దీంతో ప్లాంట్ వినియోగంలోకి రాలేదు. ఈ ఆసుపత్రిల్లో రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుండగా.. క్షతగాత్రులకు, శస్త్రచికిత్సలు, ఇతర అత్యవసర సమయాల్లో ఆక్సిజన్ అవసరం ఏర్పడుతోంది.

# సింగూరు లేకుండా.. రెండేళ్లు ఎలా?

హైదరాబాద్: సింగూరు జలాల్లో రెండేళ్లపాటు అంతరాయం ఏర్పడే నేపథ్యంలో నగరంపై తీవ్రమైన ప్రభావం పడనుంది. సింగూరు ప్రాజెక్ట్‌కు మరమ్మతుల నేపథ్యంలో డిసెంబర్ నుంచి రెండేళ్లపాటు డ్యాంలో నీటి నిల్వ లేకుండా చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తాగునీటి సరఫరాకు జలమండలి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సి వస్తోంది. సింగూరు ప్రాజెక్ట్ నుంచి నగరానికి రోజుకు 120 ఎంజీడీల నీరు సరఫరా అవుతోంది. నగరానికి అందే మొత్తం నీటి వాటాలో సుమారు 20 శాతం సింగూరు జలాల వాటాగా ఉంది. ఇప్పటికే డిమాండ్ కంటే తక్కువ సరఫరా అవుతుండగా సింగూరు జలాల్లో కోత పడితే ముమ్ముందు ఎలా? అనే అంశంపై జలమండలి తర్జనభర్జన పడుతోంది. జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి తాజా పరిస్థితిపై సమీక్షించి అత్యున్నత స్థాయి ఇంజినీర్ల సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు.

**ప్రత్యామ్నాయాలపై కసరత్తు**

ఎల్లంపల్లి నుంచి వచ్చే గోదావరి జలాల్లో 31 ఎంజీడీలను మిషన్‌భగీరథ వినియోగించుకుంటోంది. ఇందులో 20 ఎంజీడీల వరకు జలమండలికి అందుబాటులోకి వచ్చినా మరో 90-100 ఎంజీడీల మేర కొరత ఉంటోంది. జంట జలాశయాల నుంచి అదనంగా నీరు తీసుకోవడానికి ఉన్న అవకాశాలపై జలమండలి దృష్టిసారిస్తోంది. రెండు, మూడు రోజుల్లో అన్ని అంశాలను సమీక్షించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేయనున్నట్లు విభాగం ఉన్నతాధికారులు తెలిపారు.

# చరవాణుల వేదికగా.. 'డ్రగ్స్ ఆన్' లైన్

కామారెడ్డి : జిల్లాకేంద్రం శివారులోని క్యాసంపల్లి ప్రాంతంలో ద్రవరూప గంజాయి (యాష్ ఆయిల్)ని గతంలో పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. నిందితులు గంజాయిని విక్రయించడానికి చరవాణులను, సామాజిక మాధ్యమాలనే వాడుతున్నట్లు తేలింది."జిల్లాకేంద్రంలో నాలుగు నెలల కిందట గంజాయి విక్రేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల చరవాణులను పరిశీలించగా ఫోన్ నంబర్లు, మెసేజ్‌లు, సామాజిక మాధ్యమాల వేదికగా వారు గంజాయి సమాచారాన్ని యువకులకు చేరవేస్తున్నట్లు తేలింది. పోలీసులు ఆ యువకులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ నెలలో జిల్లాకేంద్రంలో జరిగిన దాడి ఘటనల్లో యువకులు మత్తులో ఉండి విచక్షణ కోల్పోయి ప్రవర్తించారని పోలీసులు గుర్తించారు.'

ఒకప్పుడు గుట్టుగా మత్తు పదార్థాలను విక్రయించినవారు ఇటీవల పంథా మార్చారు. స్మార్ట్‌ఫోన్లను వేదికగా మలుచుకొని ఫోన్ నంబర్లలో సంభాషిస్తూ, మెసేజ్‌లు పంపుతూ, సామాజిక మాధ్యమాల్లో మత్తు



పదార్థాల సమాచారాన్ని తెలుపుతూ అమ్ముతున్నారు. దీంతో గుట్టుచప్పుడు కాకుండా ఈ దందా సాగుతోంది.

**గ్రూపుల్లో సమస్త సమాచారం**

మత్తు పదార్థాల విక్రేతలు చరవాణులను వినియోగించే యువతను లక్ష్యంగా చేసుకుంటున్నారు. యాప్‌లలో గ్రూపులు ఏర్పాటు చేసి సరకు వివరాలను తెలుపుతున్నారు. మెసేజ్‌ల రూపంలోనే ఆర్డర్లు తీసుకుంటూ ఫోన్లలోనే ఎక్కడికి రావాలో ఎక్కడ సరకు తీసుకోవాలో సూచిస్తున్నారు. ఓ వైపు పోలీసు, ఆబ్కారీ శాఖల అధికారులు విస్తృత తనిఖీలు చేస్తున్నా వీరు చాటుగా వ్యవహారం నడిపిస్తున్నారు. జిల్లాలోకి గంజాయి ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా అవుతోంది. స్థానికులు కొందరు స్థానికేతరులతో కలిసి ఈ అక్రమ దందాకు పాల్పడుతున్నారు. తెచ్చిన గంజాయిని సిగరేట్లు, ఎండుగంజాయి, ద్రవరూపం (యాష్ ఆయిల్) రూపాల్లో అమ్ముతున్నారు. మత్తులో యువత విచక్షణ కోల్పోతున్నారు. మత్తు కోసం కొన్ని ప్రాంతాల్లో గుడుంబా, నాటుసారాకు బానిసలవుతున్నారు. పోలీసు, ఆబ్కారీ శాఖలు కలిసికట్టుగా పనిచేస్తేనే మత్తు పదార్థాల కట్టడి సాధ్యమవుతుంది.

**నిరంతర నిఘా**

గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల అక్రమ రవాణా, వాడకాలపై నిరంతరం నిఘా కొనసాగుతోంది. జిల్లావ్యాప్తంగా ఎప్పటికప్పుడు వాటి రవాణాను కట్టడి చేసే వ్యవస్థను అప్రమత్తం చేశాం. మత్తు పదార్థాల జోలికి వెళ్తే ఎవరినీ వదిలిపెట్టం. రాజేష్‌చంద్ర, జిల్లా ఎస్పీ

# ప్రాణహిత- సుందిళ్ల..హితమేనా?

ఆదిలాబాద్ : కాంగ్రెస్ పార్టీ అధికారంలో రాగానే ప్రాణహిత-చేవెళ్ల పాత ప్రాజెక్టుపై దృష్టి పెట్టింది. మంచిర్యాల, కుమురంభీం జిల్లాలకు సాగునీరు అందించే ప్రయత్నం చేస్తోంది. శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం.. తుమ్మిడిహెట్టి వద్ద జలాశయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. తుమ్మిడిహెట్టి- -సుందిళ్ల బ్యారేజీ అనుసంధానం చేసి నీటిని ఎల్లంపల్లికి తరలిస్తే రూ.1,600 కోట్ల వ్యయం తగ్గటంతోపాటు సాగునీటికి ప్రయోజనకరంగా ఉంటుందని ప్రణాళిక సిద్ధం చేస్తోంది. కానీ, సుందిళ్ల బ్యారేజీలో 2 నుంచి 2.5 టీఎంసీల కంటే ఎక్కువగా నీటి నిల్వ ఉంచటం మంచిది కాదని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్ఏ) ప్రకటించిన దరిమిలా ప్రభుత్వం దీనిపై మరిన్ని సమాలోచనలు చేయాలని భావిస్తోంది. ప్రాణహిత -సుందిళ్లతో అనుసంధానం చేస్తారా? లేక సుందిళ్ల ప్రస్తావన లేకుండా మైలారం దగ్గర పంపుహౌస్ నిర్మించి ఎల్లంపల్లికి నీటిని తరలిస్తారా? అనే దానిపై స్పష్టత రావడం లేదు.ఉమ్మడి రాష్ట్రంలో డా.బీఆర్ అంబేడ్కర్ సుజల స్రవంతి పేరిట వైఎస్సార్ ప్రభుత్వం రూ.38,500 కోట్లతో చేపట్టిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం రీ-డిజైన్ చేయడంతో పూర్తిగా ఆగిపోయింది. వైఎస్సార్ హయాంలో చేసిన రూ.1,728 కోట్ల ఖర్చు ఫలితమివ్వలేదు.

**అప్పట్లో సర్వే చేసినా..**



తొలుత రూపుదాల్చిన ప్రాణహిత-చేవెళ్ల డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు(డీపీఆర్)లో సుందిళ్ల ప్రస్తావన లేదు. కేసీఆర్ ప్రభుత్వం కొలువుతీరాక 2015లో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల సరిహద్దులోని సుందిళ్లతోపాటు భూపాలపల్లి జిల్లాలో కాళేశ్వరం వద్ద నిర్మించిన మేడిగడ్డ ప్రాజెక్టు తెరమీదకు వచ్చింది. అప్పట్లోనే ఇసుక తిన్నెలతో నిండి ఉండే సుందిళ్ల, మేడిగడ్డ ప్రాంతాల్లో బ్యారేజీలు నిర్మాణం చేయవచ్చా..? లేదా..? అనే దానిపై సర్వే చేసినా నివేదిక బయటకు రాలేదు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ద్వారా వైఎస్సార్ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో 65 వేల ఎకరాలకు నీరివ్వాలని భావించింది. రీ-డీజైన్ పేరిట కేసీఆర్ ప్రభుత్వం 2 లక్షల ఎకరాలకు నీరివ్వాలని ప్రతిపాదనలు చేసింది. రెండు ప్రభుత్వాల ప్రతిపాదనలు ఆచరణలోకి రాలేదు. **కేసీఆర్ చేసిన తప్పిదమే చేయొద్దు**

నైనాల గోవర్ధన్, జలసాధన సమితి రాష్ట్ర కన్వీనర్

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు విషయంలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన తప్పిదం కాంగ్రెస్ ప్రభుత్వం చేయవద్దు. సుందిళ్ల దగ్గర నీటిని నిల్వ ఉంచటమనేది తప్పిదమవుతుంది. బ్యారేజీ నీటి నిల్వ సామర్థ్యంపై ఎన్‌డీఎస్ఏ సమర్పించిన తుది నివేదక పేజీ నంబర్ 345లో ఇది స్పష్టంగా ఉంది. దీన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలి. ఇదే విషయం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి సైతం తీసుకెళ్లా. బ్యారేజీటి నిలువటీఎంసీల్లో

సుందిళ్ల : 8.83 అన్నారం : 12

మేడిగడ్డ : 16.17బ్యారేజీ

# మెదడులో.. కల్లోలం

హైదరాబాద్ : విదేశాల్లో ఉంటున్న ఓ యువకుడికి (30) ఏడాది క్రితమే పెళ్లి అయింది. ఇటీవల పాప పుట్టింది. పాపను చూసేందుకు హైదరాబాద్‌కు వచ్చాడు. ఇంతలోనే బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యాడు. పరిస్థితి విషమించడంతో ప్రాణాలు కోల్పోయాడు. నిమ్స్‌కు నిత్యం పది వరకు బ్రెయిన్ స్ట్రోక్ కేసులు వస్తున్నాయి. వీటిలో 1–2 కేసులు యువతేనని వైద్యులు చెబుతున్నారు. ఇందులో ఎక్కువ ఇస్కీమిక్ స్ట్రోక్ (బ్రెయిన్‌లో క్లాట్ వల్ల రక్తనాళం మూసుకుపోవడం), తర్వాత స్థానంలో హెమరేజిక్ స్ట్రోక్ (రక్తనాళం పగిలిపోవడం వల్ల మెదడులో రక్తస్రావం సంభవించడం) కేసులు ఉంటున్నాయని నిమ్స్ వైద్యులు పేర్కొంటున్నారు. గతేడాది కంటే 10–15శాతం కేసులు పెరిగాయని వివరించారు.

ఆ రెండే ఎక్కువ..: బ్రెయిన్‌స్ట్రోక్‌లో మూడు రకాలు నమోదవుతున్నాయి. మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే నాళాల్లో అడ్డంకులు ఏర్పడినప్పుడు ఇస్కీమిక్ స్ట్రోక్, మెదడులో రక్తనాళాలు పగిలితే హెమరేజిక్ స్ట్రోక్, మెదడుకు రక్తసరఫరా ఆగినప్పుడు ట్రాన్సియంట్ ఇస్కీమిక్ స్ట్రోక్(టీఐఏ)గా వ్యవహరిస్తారు.ఎక్కువగా ఇస్కీమిక్ స్ట్రోక్,



హెమరేజిక్ స్ట్రోక్ నమోదవుతుంటాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

**అది పాత మాట..**

ఒకప్పుడు 60 ఏళ్లు దాటిన వారిలో ఎక్కువగా బ్రెయిన్‌స్ట్రోక్ కన్పించేది. మారుతున్న జీవనశైలితో యువతలోనూ ఈ సమస్య పెరుగుతోంది. మెదడు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన తర్వాత తొలి 6 గంటలు చాలా కీలకం. ఆలస్యమైన కొద్దీ ప్రాణాలకు ముప్పే.

**ప్రధాన కారణాలు..**

అధిక రక్తపోటు
మధుమేహం
అధిక కొలెస్ట్రాల్
నిద్రలేమి
పొగతాగడం, మద్యపానం
శారీక శ్రమ లేకపోవడం
తీవ్ర ఒత్తిడి, ఆందోళన

**నిమ్స్‌లో..**

నిత్యం ఓపీ–2000పైనే
న్యూరాలజీ– 250–300
బ్రెయిన్‌స్ట్రోక్ కేసులు–10–15
ఇస్కీమిక్ కేసులు–6–7
హెమరేజిక్–3–4

**ఆసుపత్రికి తరలించే సమయమే కీలకం...**

– డాక్టర్ వంశీకృష్ణ, సీనియర్ న్యూరోసర్జన్, నిమ్స్

బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైన వ్యక్తిని ఎంత వేగంగా ఆసుపత్రికి తరలిస్తే అంత మేలు జరుగుతుంది. గతంతో పోల్చితే కేసులు సంఖ్య పెరిగింది. పోషకాహారం తీసుకోవడం, ఒత్తిడి తగ్గించుకోవడం, సరైన నిద్ర, నిత్యం వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలి.

# మ్యుటేషన్ ఇక ఆన్‌లైన్‌లో

హైదరాబాద్ : మ్యుటేషన్ దరఖాస్తు ప్రక్రియను జీహెచ్ఎంసీ డిజిటలీకరణ చేసి.. వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తును అందుబాటులోకి తీసుకొచ్చింది.ఈ సేవలు మొదలయ్యాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం మీసేవా కేంద్రాలు, పౌర సేవాకేంద్రాలు, అధికారుల వద్దే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ఫలితంగా దళారుల జోక్యం, లంచాల వసూలు పెరిగింది. ఈ విషయమై ఫిర్యాదులు పెరగడంతో దరఖాస్తు ప్రక్రియను ఆన్‌లైన్ చేశారు.

**పాత రిజిస్ట్రేషన్లకే..**

గత సర్కారు హయాంలో భూమి, ఇంటి రిజిస్ట్రేషన్‌తో పాటు ఆస్తిపన్ను రికార్డుల్లో యజమాని పేరు మారే విధానం అందుబాటులోకి వచ్చింది. అప్పటినుంచి రిజిస్ట్రేషన్ సమయంలోనే మ్యుటేషన్ జరిగిపోతోంది. 2020 సంవత్సరానికి ముందు రిజిస్ట్రేషన్లు చేసుకుని, ఇంకా పన్ను రికార్డుల్లో పేరు మార్చుకోని వారు వేలల్లో ఉన్నారు. ఈ నేపథ్యంలో యజమానులు నేరుగా దరఖాస్తు చేసుకునే సదుపాయాన్ని కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

**మొత్తం సేవలన్నీ..**

కొత్తగా కట్టిన భవనాలకు ఆస్తిపన్ను స్వీయ మదింపు(సెల్ఫ్




అసెస్‌మెంట్)నకూ ఆన్‌లైన్‌లో స్వయంగా దరఖాస్తు చేసుకోవచ్చు. పన్ను సవరణ, విశ్రాంత సైనికుల కేటగిరీలో పన్ను మినహాయింపు, ఫోన్ నంబరును మార్చుకోవడం, తప్పుల సవరణ తదితర సేవలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సౌలభ్యాన్ని జీహెచ్ఎంసీ అందుబాటులోకి తీసుకొచ్చింది.మూతపడిన వ్యాపారాలకు సంబంధించి ట్రేడ్ లైసెన్సుల రద్దుకు ఆన్‌లైన్‌లో అర్జీ సమర్పించవచ్చు.

ఖాళీ స్థలాల పన్ను (వీఎల్‌టీ) మ్యుటేషన్‌కూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు అందుబాటులోకి వచ్చింది. ఒకే ఇంటికి రెండు, మూడు ఆస్తిపన్ను నంబర్లు(పీటీఐఎన్) తీసుకున్నారు. వాటిని రద్దు చేసుకోవాలనుకునే వారికి, ఖాళీ స్థలాలకు ఉండే అదనపు పన్ను నంబర్ల రద్దుకూ దరఖాస్తు అందుబాటులోకి వచ్చింది.

# అశాస్త్రీయంగా బ్యాటరీల రీసైక్లింగ్



హైదరాబాద్: పదుల సంఖ్యలో లెడ్ యాసిడ్ బ్యాటరీ రీసైక్లింగ్ యూనిట్లు నిబంధనలను ఉల్లంఘిస్తూ నగరంలో కార్యకలాపాలు సాగిస్తున్నాయి. వెలువడే వ్యర్థాలను జలాశయాలకు తరలిస్తూ కాలుష్యాన్ని పెంచుతున్నాయి. కన్‌సెంట్ ఫర్ ఆపరేషన్ (సీఎఫ్‌వో), కన్‌సెంట్ ఫర్ ఎస్టాబ్లిష్‌మెంట్(సీఎఫ్‌ఈ) అనుమతులు లేకుండా ఏర్పాటు చేస్తుంటడంతో కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) నిఘా లేకుండా పోతోంది. అశాస్త్రీయ పద్ధతుల్లో రీసైక్లింగ్ చేస్తుండటంతో భూ, జల, వాయుకాలుష్యం ఏర్పడుతోంది.

**ప్రక్రియ ఇదీ...**

బ్యాటరీలను శాస్త్రీయ పద్ధతుల్లో, పీసీబీ సూచనల మేరకు రీసైక్లింగ్ చేయడం ద్వారా ప్రమాదకర రసాయన పదార్థాలు బయటకు రాకుండా కాలుష్యాన్ని నివారించొచ్చు. ఉపయోగించిన బ్యాటరీల నుంచి నికెల్, లిథియం, కోబాల్ట్ వంటి లోహాలను తిరిగి పొందడం ద్వారా కొత్త బ్యాటరీల తయారీకి గనులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. ఈ ప్రక్రియలో బ్యాటరీలను ముందుగా డిశ్చార్జి చేసి ఆపై జాగ్రత్తగా విడదీసి, చిన్న చిన్న ముక్కలుగా కత్తిరిస్తారు. వాటి భాగాల నుంచి లోహాలను వేరు చేయడానికి పైరో మెటలర్జీ (అధిక ఉష్ణోగ్రతలను ఉపయోగించి లోహాలను కరిగించి వేరు చేస్తారు), హైడ్రో మెటలర్జీ (రసాయన ద్రావణాలను వినియోగించి విలువైన లోహాలను కరిగించి వేరు చేస్తారు).

లోహాలను శుద్ధి చేసి బ్యాటరీలలో లేదా ఇతర వస్తువుల్లో తిరిగి ఉపయోగిస్తారు.

**ఏం చేస్తున్నారు..?**

సాధారణంగా డీలర్లు, సర్వీస్ సెంటర్లు లేదా స్పెషల్ కలెక్షన్ పాయింట్ల ద్వారా పాత బ్యాటరీలను సేకరించాలి. తయారీదారులు, డీలర్లు ఎక్స్‌టెండెడ్ ప్రొడ్యూసర్ రెస్పాన్సిబులిటీ (ఈపీఆర్) కింద వీటిని తిరిగి సేకరించాలని సీపీసీబీ నిబంధనలు వెల్లడిస్తున్నాయి. నగరంలో ఈ బాధ్యతను 40 సంస్థలకు అప్పగించారు. కానీ ఇవి అనధికారికంగా ఏర్పాటవుతున్న కేంద్రాలకు తరలివెళ్తుండటం గమనార్హం.

అనుమతి లేకుండా ఉన్న యూనిట్లలో ఎయిర్ పొల్యూషన్ కంట్రోల్ ఎక్విప్‌మెంట్‌లు ఏర్పాటు చేయడం లేదు. ఫర్నేస్‌లకు బ్యాగ్ ఫిల్టర్లు ఏర్పాటు చేయడం లేదు. చేసినా వాటి నిర్వహణను విస్మరిస్తున్నారు. బ్యాటరీల నుంచి వచ్చే వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పారబోస్తున్నారు.

ఉదయం పూట పనిచేస్తే స్థానికుల నుంచి ఇబ్బందులొస్తాయని రాత్రి 12నుంచి ఉదయం 8గంటల వరకు వీటిని నిర్వహిస్తున్నారు.

# వడ్డీపై ఆశలు.. ఊడ్చేస్తున్నారు అసలు



తాండూరు : తాండూరుకు చెందిన ఓ మెడికల్ దుకాణం యజమాని, చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ.. సుమారు రూ.10 కోట్లకు పైగా బకాయిలు పెట్టి చెప్పా పెట్టకుండా కనిపించకుండా పోయాడు. తాండూరులోని రెండు చిట్‌ఫండ్ సంస్థలు అధిక వడ్డీ, చిట్టీల డబ్బులను ఎగ్గొట్టి చేతులెత్తేశాయి. ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఇవ్వాల్సి ఉంది. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.ఓ వ్యాపారి ఒక ప్రముఖ కంపెనీ ఏజెన్సీ నడిపించి తెలిసిన వ్యాపారుల వద్ద రూ.3 కోట్ల వరకు అప్పు చేశాడు. కోర్టును ఆశ్రయించి రక్షణ కోరారు. మూడేళ్లు గడిచినా ఒక్కరికీ ఆ డబ్బులు చెల్లించలేదు. అధిక వడ్డీలకు ఆశ పడుతున్నారా.. జాగ్రత్త.. మొదటికే మోసపోయే ప్రమాదం ఉంది. తాండూరులో ఇటీవల జరుగుతున్న వరుస ఘటనలతో రూపాయి కూడబెట్టుకోవాలన్నా.. తెలిసిన వారి వద్ద చీటీలు వేసుకొని రెట్టింపు చేసుకోవాలన్నా ఆలోచించి నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితి. ఒకరిద్దరు కాదు పదుల సంఖ్యలో స్థానికంగా బడాబాబులు పేద, మధ్యతరగతి ప్రజలను మోసగించి ఉడాయించారు. కొన్ని ఘటనలు బయటపడుతున్నా.. చాలా వెలుగుచూడడంలేదు.

**వ్యాపార కేంద్రం కావడంతో..**

తాండూరు వ్యాపార కేంద్రం కావడంతో నిత్యం రూ.కోట్లలో చేతులు మారుతుంటాయి. ఉద్యోగులు, చిరు వ్యాపారులు, మధ్యతరగతి ప్రజలే లక్ష్యంగా కొందరు ప్రైవేటు చిట్టీ వ్యాపారులు అధిక వడ్డీలను ఆశ చూపిస్తున్నారు. ముందుగా నమ్మకం కల్పిస్తూ లావాదేవీలు రూ.కోట్లకు చేరుకోగానే అసలుతో సహా ఊడ్చుకొని అడ్రసు లేకుండా పోతున్నారు. కొందరు వ్యాపారస్థులు పెట్టుబడుల కోసం రోజువారీ రూ.లక్ష నుంచి ఆపై ఇచ్చిపుచ్చుకోవడాలు చేస్తున్నారు. ఇలాంటి లావాదేవీల్లో జాగ్రత్తలు తీసుకోకపోతే మోసపోయే ప్రమాదం ఉంది.

**కుమార్తె పెళ్లి కోసం దాచుకున్నా..** – వెంకట కృష్ణ, తాండూరు

చిట్టీ ముగిశాక రూ.5 లక్షలు నిర్వాహకుడికే అప్పగించాను. వచ్చే వడ్డీతో మరో చీటీ నడుస్తుందని రెండేళ్లలో రూ.10 లక్షలు ఇస్తానని చెబితే నమ్మాను. వచ్చే నగదుతో కుమార్తె వివాహం చేయాలనుకున్నా. ముఖం చాటేశాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నా.

**బ్యాంకులు, విశ్వసనీయ సంస్థలనే నమ్మాలి** – విశ్రాంత పోలీసు అధికారి

డబ్బు దాచుకోవాలన్నా.. భవిష్యత్తవసరాలకు పొదుపు చేసుకోవాలన్నా.. బ్యాంకులు, విశ్వసనీయ లిమిటెడ్ సంస్థలను ఆశ్రయిస్తే మంచిది. పెద్ద సంస్థలు సంబంధిత ప్రభుత్వ శాఖ అధికారులకు చిట్టీ మొత్తాన్ని డిపాజిట్ చేస్తాయి. ఆ శాఖ తరచూ లావాదేవీలనూ పర్యవేక్షిస్తుంది. అందువల్ల దాచుకున్న డబ్బుకు భద్రత ఉంటుంది.

# వర్ష సూచన.. రైతుల యాతన



జగిత్యాల : జిల్లాలో రాగల అయిదు రోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు తెలపటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కోతకు వచ్చిన.. కోసిన ధాన్యాన్ని ఎలా కాపాడుకోవాలో తెలియక వారికి కంటి మీద కునుకు లేకుండా పోతోంది. జిల్లాలో దాదాపు 30 శాతం వరి కోతలు పూర్తి కాగా.. వంద వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కానీ ఎక్కడా తూకం ప్రారంభిచకపోవటంతో రైతులకు శాపంగా మారింది. ఉరుములు, మెరుపులు, పిడుగులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుందని సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎస్.హరీష్‌కుమార్‌శర్మ చెప్పారు. గాలిలో తేమ 61–96 శాతం, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21–23 డిగ్రీలు, గరిష్ఠంగా 26–32 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్నారు.

**అనేక రకాలుగా నష్టం**జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. బుధ, గురు, శుక్రవారాల్లో భారీ వర్షసూచన ఉండటంతో సాగు పంటలు, నూర్పిడి చేసిన ఉత్పత్తులు తడిసి తీరని నష్టం వాటిల్లుతుందని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మక్కలను ఆరబెట్టడం, మార్కెటింగ్ చేస్తున్న తరుణంలో వర్షాలతో నాణ్యత దెబ్బతిని మార్క్‌ఫెడ్ సేకరణకు వీలులేకుండా పోతోంది. 3.15 లక్షల ఎకరాల్లో సాగుచేసిన వరిలో అన్ని గ్రామాల్లో నూర్పిడి చేపడుతూ.. ధాన్యాన్ని విక్రయ కేంద్రాల్లో ఆరబెడుతున్నారు. అయితే అన్ని కేంద్రాలు మట్టివి కావటం, తగినన్ని టార్పాలిన్లు అందుబాటులో లేకపోవటంతో తడిసే అవకాశం ఉంది. 27 వేల టార్పాలిన్లు ఉన్నట్లు అధికారులు చెబుతుండగా.. క్షేత్రస్థాయిలో 10వేలు కూడా ఉండవనే ఆరోపణలు ఉన్నాయి. మార్కెట్యార్డుల్లో వసతులు లేక కుప్పలు పోసిన ధాన్యం వరదనీటికి కొట్టుకుపోవటం, తడవటంతో రైతులకు నష్టం వాటిల్లనుంది. పంట ఉత్పత్తులు తడిస్తే నాణ్యత దెబ్బతిని ప్రభుత్వరంగ సంస్థలు సేకరించక పోగా.. తక్కువ ధరకు ప్రైవేటుగా అమ్ముకుని కర్షకులు నష్టపోతారు. వర్షాలతో గాలిలో తేమశాతం పెరిగి దీర్ఘకాలిక వరి రకాల్లో సుడిదోమల తీవ్రత పెరగటం, మామిడి, పసుపు, కంది, కూరగాయలు తదితర వాటిల్లో చీడపీడల ఉధృతి పెరుగుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఎత్తు ప్రాంతాల్లో ధాన్యం ఆరబెట్టుకోవాలని సూచిస్తున్నారు.

# సరిహద్దు దాటితే.. ఆరోగ్య భద్రత లేనట్టే..!

కొత్తగూడెం : దేశవ్యాప్తంగా పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యమందించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలుచేస్తోంది. ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం 'ఆరోగ్యశ్రీ'లో విలీనం చేసింది. తద్వారా తెలంగాణలోని ప్రజలకు ఆయుష్మాన్ భారత్ కార్డులను ప్రత్యేకంగా అందించలేదు. ఉద్యోగ నిర్వహణ, చదువుల నిమిత్తం ఇతర రాష్ట్రాల్లో ఉండే తెలంగాణ వాసులు అక్కడ ఆయుష్మాన్ భారత్ పథకానికి నోచుకోలేకపోతున్నారు. అదే సమయంలో ఇతర రాష్ట్రాల ప్రజలు తెలంగాణలో ఆయుష్మాన్ భారత్ పథకం కింద వైద్యసేవలు పొందుతుండటం గమనార్హం.పరిష్కారం దిశగా ఆలోచిస్తేనే..రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని ఈకేవైసీ పూర్తిచేసుకున్న అర్హులకు భౌతిక–డిజిటల్ ఆయుష్మాన్ భారత్ కార్డులను జారీ చేయాలి. తెలంగాణలో తెల్లరేషన్‌కార్డులు కలిగిన కుటుంబాలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10లక్షల వరకు ఉచిత వైద్యమందుతున్నప్పటికీ.. ఆయుష్మాన్ భారత్ కింద ఇతర రాష్ట్రాల్లో రూ.5లక్షల వరకు వైద్యసేవలు పొందలేకపోతున్నారు. ఇదే విషయంపై ఓ వైద్యాధికారిని 'ఈనాడు' వివరణ కోరగా.. ఇది రాష్ట్రవ్యాప్త సమస్య అని, ఆరోగ్యశ్రీలో ఆయుష్మాన్ భారత్ విలీనమవటం వల్ల తెలంగాణలో తెల్లరేషన్‌కార్డులు ఉన్నవారందరికీ రూ.10లక్షల వరకు ఉచిత వైద్యం అందుతోందని తెలిపారు. ఆయుష్మాన్ కార్డులు లేకపోవటం వల్ల ఇతర రాష్ట్రాల్లో వైద్యసేవలు అందట్లేదని చెప్పారు.

# హస్తగతం చేసుకోవాలని..!

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను అధికార కాంగ్రెస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. భారాస సిటింగ్ స్థానం చేజిక్కించుకోవాలనే లక్ష్యంతో వ్యూహరచన చేస్తోంది. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రంగంలోకి దిగారు. 58 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా ప్రధానంగా మాగంటి సునీత (భారాస), నవీన్ యాదవ్ (కాంగ్రెస్), లంకల దీపక్‌రెడ్డి (భాజపా) మధ్య పోటీ నెలకొంది. ఎన్నికల సమయం దగ్గర పడుతుండడంతో కాంగ్రెస్ అధిష్ఠానం జూబ్లీహిల్స్ నియోజకవర్గ బాధ్యతలను పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, పీసీసీ బాధ్యులకు అప్పగించింది. మొత్తం ఏడు డివిజన్లు ఉండగా ఒక్కో



డివిజన్ బాధ్యత ఇద్దరు మంత్రులకు కేటాయించింది. నియోజకవర్గంలో 407 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ప్రతి పది కేంద్రాలకు ఒక ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీని బాధ్యులుగా నియమించింది. 40 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను రంగంలోకి దించడం విశేషం. మరోవైపు ప్రతి వందమంది ఓటర్లకు ఒక జిల్లా స్థాయి నేతను నియమించింది. వారు ప్రతిరోజూ తన పరిధిలోని ఓటర్లను కలవాల్సి ఉంటుంది. : మొత్తం ఏడు డివిజన్లలో 70 మంది వరకు ఇన్‌ఛార్జులను నియమించి జాబితాను విడుదల చేసింది. నాయకులందరిని మోహరించడంతో కార్యకర్తల్లో జోష్ పెరిగింది. నియోజకవర్గంలో 1200 ఓటర్లు పైబడిన బూత్‌లు 11 మాత్రమే ఉన్నాయి. అన్నీ వెయ్యి లోపు ఓటర్లు ఉన్నవే.

# చారిత్రక జలసిరికి పునరుజ్జీవం

హైదరాబాద్: పాతబస్తీలోని బమ్‌రుఖ్ నుద్దౌలా చెరువు తిరిగి ప్రాణం పోసుకుంది. ఆక్రమణల చెర వీడి.. జలకళ సంతరించుకుంది. హైడ్రా చర్యలతో.. చెరువుకు పునర్జన్మ సాధ్యమైందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తటాకం పునరుద్ధరణ పనులను కమిషనర్ ఏ.వి.రంగనాథ్ పరిశీలించారు. త్వరలో సుందరీకరణ పనులు పూర్తవుతాయని ఆయన తెలిపారు. చెరువు వాస్తవ విస్తీర్ణం 18 ఎకరాలుండగా, ఆక్రమణలతో 4.12ఎకరాలకు కుదించుకుపోయింది. గతేడాది ఆగస్టులో హైడ్రా ఆక్రమణలను నేలమట్టం చేసింది. 18 ఎకరాల మేర విస్తరించి అభివృద్ధి పనులు ప్రారంభించింది. ప్రస్తుతం



తుది దశలో ఉన్నాయి. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వరద చేరేట్లు, అదనపు నీరు వెలుపలికి వెళ్లేట్లు కాలువలను ఏర్పాటు చేశామని రంగనాథ్ స్థానికులకు తెలిపారు. కట్టను బలోపేతం చేసి, కాలిబాట, కంచెను నిర్మిస్తామన్నారు. చిన్నారులకు క్రీడా సౌకర్యాలు, పెద్దలు సేద తీరేందుకు పార్కు, ఓపెన్ జిమ్, ఇతరత్రా పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు.

# వెళ్లింది ఇద్దరు.. వస్తోంది ఒక్కరు

పెద్దపల్లి : విప్లవోద్యమానికి ఆకర్షితులై జూలపల్లి మండలం వడ్కాపూర్‌కి చెందిన ఇద్దరు అడవి బాట పట్టగా ఇందులో ఒకరు ఎదురు కాల్పుల్లో మృతి చెందగా మరొకరు తాజాగా లొంగిపోయారు. ఈ గ్రామం నుంచి పుల్లూరి ప్రసాద్‌రావు, వడ్కాపూర్ చంద్రమౌళిలు దళ సభ్యుల నుంచి కేంద్ర కమిటీల్లో వివిధ పదవులు చేపట్టే వరకు ఎదిగారు. వివిధ ప్రాంతాల్లో అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించారు.వడ్కాపూర్ చంద్రమౌళి అలియాస్ దేవన్న ఏవోబీలో పని చేస్తున్న సమయంలో 2006 డిసెంబరు 27న విశాఖపట్టణం ఏజెన్సీ ప్రాంతంలో పనసపల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృత్యువాతపడ్డాడు. తాజాగా కేంద్ర కమిటీ సభ్యుడు




పుల్లూరి ప్రసాద్‌రావు అలియాస్ చంద్రన్న లొంగుబాటుతో ఇద్దరు అడవి బాట పట్టారని ఒకరు తిరిగి వస్తున్నారని వడ్కాపూర్ వాసులు చర్చించుకుంటున్నారు.

**అగ్రనాయకత్వం పరిమితం**

ఎదురుకాల్పులు, లొంగుబాటులతో మావోయిస్టు పార్టీలో పెద్దపల్లి ప్రాంత నేతలు తగ్గిపోతున్నారు. ఇటీవల మల్లోజుల వేణుగోపాల్ లొంగుబాటు అనంతరం తాజాగా ప్రసాద్‌రావు లొంగిపోయారు. ఇన్నాళ్లు జిల్లా నుంచి పార్టీలో నలుగురు అగ్రనాయకులు ఉండగా తాజా లొంగుబాటుతో ఇద్దరే మిగిలారు. ప్రస్తుతం మంథనికి చెందిన మల్లా రాజిరెడ్డి, సబ్బితంకి చెందిన గంకిడి సత్యనారాయణరెడ్డిలు పార్టీలో కీలక స్థానాల్లో ఉన్నారు. వీరు కాకుండా రాష్ట్ర కమిటీలో కంకనాల రాజిరెడ్డితోపాటు అయిదారుగురు అజ్ఞాతంలో ఉన్నారు.

## ఆలయ జీర్ణోద్ధరణకు అడుగులు

ధర్మపురి : ధర్మపురిలోని ఉగ్ర నారసింహస్వామి ఆలయ జీర్ణోద్ధరణ కోసం రూ.6 కోట్ల నిధుల మంజూరుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి లక్ష్మణ్‌కుమార్ ప్రతిపాదనలకు దేవాదాయశాఖ కమిషనర్ అనుమతి ఇచ్చారు. ఆ శాఖ స్థపతి, ఆగమశాస్త్ర పండితులు ఆలయాన్ని ఇటీవల సందర్శించి పనులు చేపట్టాలని నిర్ణయించారు. ధర్మపురి దేవస్థానంలో పాత ఆలయం యోగానందస్వామి క్షేత్రంకాగా కొత్తది ఉగ్ర నారసింహస్వామి మందిరం. ఈ ఆలయం వర్షం కురిసిందంటే చాలా చోట్ల ఉరుస్తోంది. అంతర్గత ఆలయంలో గోడలపై నీరంతా చేరుతుంది. ప్రాకారాల క్షీణత, లీకేజీలు, ఇతర సమస్యలున్నాయి. ఈ నేపథ్యంలో స్థానికులు, భక్తులు ఆలయ జీర్ణోద్ధరణ చేపట్టాలని కోరుతూ వచ్చారు. గత ప్రభుత్వ



హయాంలో నిధులు మంజూరు కాగా టెండర్లు, గుత్తేదారు ఎంపిక ప్రక్రియ పూర్తయింది. ఆఖరులో పనులు చేపట్టేందుకు గుత్తేదారులు ముందుకు రాకపోవడంతో రద్దయింది.

**ముఖ్య కార్యదర్శి సమీక్షతో..** కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆలయ సంరక్షణ, జీర్ణోద్ధరణపై రాష్ట్ర దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ సమీక్ష నిర్వహించారు. మంత్రి సూచన మేరకు నిధులకు ప్రతిపాదించడంతో మంజూరయ్యాయి. త్వరలో టెండర్ ప్రక్రియ, గుత్తేదారు ఎంపిక జరగనుందని ఈవో శ్రీనివాస్ తెలిపారు. ఉగ్ర నారసింహ ఆలయ జీర్ణోద్ధరణ పూర్తయితే ధర్మపురి దేవస్థానం కొత్త కళ సంతరించుకోనుంది.

## బాలామృతం.. వినియోగిస్తేనే సత్ఫలితం

సిరిసిల్ల : చిన్నారులకు అందించే ఆహారం వారి శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం చూపుతుంది. సమతుల ఆహారం అందని పిల్లల్లో రోగనిరోధక శక్తి మందగించి భవిష్యత్తులో అనారోగ్యం బారిన పడే అవకాశాలు లేకపోలేదు. అలాంటి పరిస్థితులకు స్వస్తి పలికేందుకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు అవసరమైన పోషకాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. శారీరక ఎదుగుదలకు అనుబంధంగా బాలామృతం అందిస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో తల్లిదండ్రులు చిన్నారులకు తినిపించడంలో ఆసక్తి చూపడం లేదు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశించిన మేర ఫలితాలు కనిపించడం లేదు.

**అవగాహన అవసరం**

జిల్లాలో 587 అంగన్‌వాడీల పరిధిలో 33,088 మంది చిన్నారులు నమోదయ్యారు. ప్రతినెల చిన్నారుల ఎదుగుదలను ఆయా కేంద్రాల బాధ్యులు పర్యవేక్షిస్తుంటారు. బాలబాలికల ఎత్తు, బరువు, ఆకలి పరీక్షలు నిర్వహిస్తూ రికార్డుల్లో నమోదు చేస్తారు. ఆరు నెలల నుంచి



మూడేళ్లలోపు పోషక లోపాలున్న చిన్నారులకు అవసరమైన మేరకు బాలామృతం, బాలామృతం ప్లస్‌ను అందిస్తుంటారు. కేంద్రాల్లో పంపిణీ చేసే బాలామృతం పొట్లాలను వినియోగించేందుకు చాలామంది తల్లులు ఆసక్తి చూపడం లేదు. బయట లభించే ప్రైవేటు కంపెనీల తృణధాన్యాల ఉత్పత్తులను ఇస్తుంటారు. పప్పులు, బియ్యంతో చేసిన ఉగ్గును తినిపిస్తుంటారు.

ప్రభుత్వం అందించే పోషక విలువలతో కూడిన బాలామృతం పొట్లాలను ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు.. బాలామృతంతో కలిగే లాభాలు తెలియకపోవడమే దీనికి ప్రధాన కారణం. ఫలితంగా చిన్నారుల శారీరక ఎదుగుదలకు అవసరమైన పోషకాలు, విటమిన్లు అందక పోషకలోపాలు ఏర్పడుతున్నాయి.

బాలామృతం వినియోగిస్తే చిన్నారుల ఆకలి పెరుగుతుంది. పోషకాలు, విటమిన్ల కారణంగా రక్తహీనత, బలహీనత సమస్యలు ఉండవు. రోగనిరోధక శక్తి పెరిగి శారీరక, మానసిక ఎదుగుదలకు తోడ్పాటు అందిస్తుంది. కంటిచూపు మెరుగవుతుంది. బాలామృతంతో కలిగే ఫలితాలను తల్లులకు అవగాహన కల్పిస్తే మెరుగైన ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

## ప్రాదేశికం.. పల్లె ప్రగతిలో కీలకం

కుసుమంచి : ఉమ్మడి ఏపీలో '1994-పంచాయతీరాజ్ చట్టం' ద్వారా జిల్లా ప్రాదేశిక, మండల ప్రాదేశిక నియోజకవర్గాలు ఏర్పడ్డాయి. అంతకుముందు గ్రామ సర్పంచులు మండల ప్రజా పరిషత్తుల్లో, మండల ప్రజా పరిషత్తు అధ్యక్షులు జిల్లా ప్రజా పరిషత్తుల్లో సభ్యులుగా ఉండేవారు. ప్రాదేశిక ఎన్నికలకు సమయం సమీపిస్తున్న నేపథ్యంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల ప్రాధాన్యంపై ప్రత్యేక కథనం..

**ఎంపీటీసీ సభ్యుల విధులు.. అధికారాలు**

మండల పరిషత్తు సమావేశాల్లో మెజారిటీ సభ్యుల ఆమోదంతోనే తీర్మానాలు పట్టాలెక్కుతాయి. ఎంపీటీసీ సభ్యుడు తన ప్రాదేశిక నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీల్లో శాశ్వత ఆహ్వానితుడు. పంచాయతీ సమావేశాలకు హాజరు కావచ్చు. ఓటు హక్కు మాత్రం ఉండదు. మండల పరిషత్తు అభివృద్ధి, సమీక్ష సమావేశాలకు హాజరై తన పరిధిలోని సమస్యలను ప్రస్తావించొచ్చు. నిధులు మంజూరుకు కృషి చేయాలి. అభివృద్ధి పనుల్లో అక్రమాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు. తన పరిధిలోని పాఠశాలలను సందర్శించి విద్యా ప్రమాణాల మెరుగుకు సూచనలు అందించవచ్చు. మండల పరిషత్తు నిధుల విషయంలో అధికారులను ప్రశ్నించవచ్చు. అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి సమస్యలు వారి దృష్టికి తీసుకెళ్లే అధికారం ఉంటుంది.

**జడ్పీటీసీ సభ్యులు**

జిల్లా పరిషత్తు తీర్మానాల ఆమోదంలో మెజారిటీ జడ్పీటీసీ సభ్యుల ఆమోదం తప్పనిసరి. తమ మండల పరిషత్తు సమావేశాలకు హాజరై అక్కడ పరిష్కారం పొందలేని సమస్యలు జడ్పీ సమావేశాల్లో ప్రస్తావించొచ్చు. పనుల నిర్వహణలో లోపాలు, నిధుల దుర్వినియోగం లాంటివి జడ్పీ ఛైర్మన్, లేదా సీఈవో దృష్టికి తీసుకెళ్లవచ్చు. జడ్పీ అజెండాలో సమస్యలను చేర్చే, తీర్మానాలను ప్రతిపాదించే అధికారం ఉంటుంది. ముందస్తు నోటీసుతో జడ్పీ పరిపాలనకు సంబంధించిన అంశాలపై ప్రశ్నించవచ్చు. ఆర్థిక నివేదికను పరిశీలించి సూచనలు చేయొచ్చు. జడ్పీ పాఠశాలలను సందర్శించి మెరుగుదలకు సూచనలు ఇవ్వవచ్చు. మండల, నియోజకవర్గ నీటి వినియోగ పరిరక్షణ కమిటీ సభ్యుడిగా నీటి పరిరక్షణ చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది.

# మామూళ్లు ఇచ్చుకో.. మట్టి తవ్వుకో



హైదరాబాద్ : కొత్వాల్‌గూడకు సమీపంలోని హిమాయత్ సాగర్ ఎఫ్‌టీఎల్ సరిహద్దు సమీపంలో మట్టి తవ్వకాలివి. పట్టపగలే పొక్లెయిన్‌తో మట్టిని తవ్వేసి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నా జలమండలి అధికారులు చూడడం లేదు. టిప్పర్లు, మట్టి తవ్వకాలు జలమండలికి సంబంధం కదా.. మాకెందుకని రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదు. రెండు, మూడు రోజుల్లోనే నాలుగైదు అడుగుల లోతు మట్టిని అక్రమార్కులు తీసేశారు.

ఈ అక్రమ మట్టి తవ్వకం హిమాయత్‌సాగర్ సహా శంషాబాద్, షాబాద్, మహేశ్వరం మండలాల్లోని కొన్ని గ్రామాల్లో యథేచ్ఛగా కొనసాగు తోంది. కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు సూత్రధారులు. రాత్రివేళల్లో మట్టిని తవ్వేసి పరిశ్రమలు, ప్రైవేటు నర్సరీలకు విక్రయిస్తున్నారు. రోజూ 500 నుంచి 700 ట్రిప్పుల మట్టిని తవ్వేస్తున్నా రు. నెలకు రూ.8 కోట్ల నుంచి రూ.12 కోట్ల వరకూ ఆర్జిస్తున్నారు.

**పరిశ్రమల ఏర్పాటు నేపథ్యంలో..**

ఫ్యూచర్‌సిటీ, ఫ్యాబ్‌సిటీ నిర్మాణాల నేపథ్యంలో శంషాబాద్, షాబాద్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటవుతు న్నాయి. పునాదులు తీశాక నాణ్యమైన మట్టిని వాటిల్లో వేయాలని ఇంజినీర్లు సూచించడంతో 10, 15 కిలోమీటర్ల దూరంలోని హిమాయ త్ సాగర్, అసైన్డ్ భూములను ఎంచుకుని వాటిని తవ్వేస్తున్నారు. నర్సరీలకూ సరఫరా చేస్తున్నారు. షాబాద్ పరిధి సోలిపేట్‌లోని సర్వే నంబరు 350లో 110 ఎకరాల అసైన్డ్ భూములు, తుమ్మలూర్ సర్వే నంబర్ 315లో వంద ఎకరాల్లో మట్టి తవ్వుతున్నారు. ఒక లారీ ఎర్రమట్టి రూ.5వేల చొప్పున రోజుకు గరిష్ఠంగా 700 ట్రిప్పులు అనుకుంటే.. రోజుకు వారి ఆదాయం రూ.49లక్షలు.

**అన్నీ తెలుసు.. అయినా అలుసు**

శంషాబాద్, మహేశ్వరం, షాబాద్ మండలాల్లోని గ్రామాల్లో మట్టి తవ్వకాలపై కొందరు రెవెన్యూ, మైనింగ్ అధికారులు, సిబ్బందికి తెలుసు. వీరిలో కొందరు అధికారులు రాత్రివేళల్లో మట్టి తవ్వుకుంటే అభ్యంతరం లేదంటూ అభయమిస్తున్నారు. దీంతో అక్రమార్కులు ఒక టిప్పర్‌కు ఇంత చొప్పున మామూళ్లు సమర్పించుకుంటున్నారు. మట్టితో వెళ్తున్న టిప్పర్లను గస్తీ పోలీసులు గమనిస్తే.. వారికి ప్రజాప్రతి నిధులు ఫోన్లు చేసి సాఫీగా వెళ్లేలా చూస్తున్నారు.

# ఖర్చులు భారమాయె.. కడచూపు కరవాయె!



హైదరాబాద్ : ఇంటి యజమాని కూలీ పనికి వెళ్లి అక్కడ జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశాడు. సొంతూరికి మృతదేహాన్ని తీసుకెళ్లాలంటే ప్రైవేటు అంబులెన్సులకు తక్కువలో తక్కువ రూ.5 నుంచి 8 వేలు ఇవ్వాల్సిందే. అప్పు చేసైనా సరే.. వారు అడిగినంత చేతిలోనే పెట్టాల్సిందే. లేదంటే మృతదేహం మార్చురీ దాటి బయటకు రాదని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**మూలకు చేరిన ఉచిత వాహనాలు..**

పేదలు, దిక్కులేని వారు ఎవరైనా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ చనిపోతే.. ఆయా మృతదేహాలను తమ తమ గ్రామాలకు సాఫీగా తరలించడానికి గతంలో ప్రభుత్వం ఉచిత వాహనాలను సమకూర్చింది. ఉస్మానియా, గాంధీ, నిమ్స్‌లో ఈ సేవలు ఒకట్రెండేళ్లు సాఫీగా సాగినా.. ఆయా వాహనాల్లో చాలావరకు పాడయ్యాయి. ప్రస్తుతం ఉస్మానియాలోని వాహనాల్లో సగం మూలన పడ్డాయి. మరికొన్నింటిలో ఫ్రీజర్లు పనిచేయడం లేదు. కొన్నిచోట లఉచితంగా తరలించేందుకు డ్రైవర్లు ముందుకు రావడం లేదనే ఫిర్యాదులున్నాయి. గాంధీలో కూడా ఒకట్రెండు మాత్రమే నడపగలిగే రీతిలో ఉన్నాయి. కూలీనాలీ కోసం నగరానికి వచ్చిన వారి కుటుంబంలో ఎవరైనా ఆసుపత్రిలో చనిపోతే.. మృతదేహాలను సొంతూళ్లకు తరలించడానికి ఒడిశా, బిహార్ రాష్ట్రాలైతే రూ.40-60 వేలు డిమాండ్ చేస్తున్నారు. అంత డబ్బు పెట్టుకోలేక.. ఇక్కడే ఖననం లేదా దహనం చేస్తున్నారు.

**ప్రైవేటు దందా ఇలా...**

ఉచిత వాహనాలను బయటకు తీయాలంటే డ్రైవర్లు సాకులు చెబుతున్నారు. ప్రైవేటు అంబులెన్సుల మాఫియా ఒత్తిడితో ఇలా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. వారికి వచ్చిన దాంట్లో ఉచిత అంబులెన్సులు నడిపే వారికి కొంత కమీషన్లు ఇస్తున్నట్లు తెలుస్తోంది. ప్రైవేటు అంబులెన్సు డ్రైవర్లు అంతా ఒకే రేటు. ఒకరి వద్ద బేరం కుదరకపోతే.. వేరే డ్రైవర్ రావడంలేదు.

# ప్రజాహితం.. కబ్జాలతో మాయం



బాలాపూర్ : కోట విలువ చేసే పార్కు స్థలాల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు నామమాత్రమే. కొన్ని లొసుగులను అడ్డం పెట్టుకుని లేఅవుట్లలో ఉన్న ఖాళీ స్థలాలను యథేచ్ఛగా ప్లాట్లుగా చేసి అమాయకులకు విక్రయిస్తున్నారు. ఫిర్యాదులపై అధికారులు బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకొంటున్నారు. పదేళ్లలో బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలో వేల గజాల స్థలాలు కబ్జాకు గురికాగా మరికొన్నింటిని అమ్మేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అధికారులు దృష్టి సారించకుంటే రూ.50 కోట్లకుపైగా విలువైన స్థలాలు మాయమయ్యే అవకాశం ఉంది. కార్పొరేషన్ పరిధిలో బడంగ్‌పేట, అల్మాస్‌గూడ, గుర్రంగూడ, నాదర్‌గుల్, కుర్మల్‌గూడ, బాలాపూర్, వెంకటాపూర్, మామిడిపల్లి గ్రామాలున్నాయి. పదేళ్ల క్రితం పంచాయతీగా ఏర్పడినప్పుడు పట్టణ ప్రణాళికా విభాగం 147 పార్కులను గుర్తించి బోర్డులు ఏర్పాటు చేసింది. 4 చోట్లే అభివృద్ధి చేశారు. భూముల ధరలు పెరిగి ఆక్రమణదారుల కన్ను పడింది. 'ఖాళీ స్థలం' అనే పదాన్ని ఆసరాగా చేసుకుని అవి తమవే అన్న ధీమాతో భూయజమానులు స్థానిక నాయకుల సహకారంతో చాలా ఖాళీ స్థలాలను ప్లాట్లుగా విభజించి విక్రయించేశారు. వాటిల్లో ఇంటి నిర్మాణాలూ పూర్తి కావడం గమనార్హం.

**కబ్జాల పర్వం ఇలా...**

బడంగ్‌పేటలో మున్సిపల్ కాలనీ లేఅవుట్లలో 5 వేల గజాలు వేర్వేరుగా ఓపెన్ స్థలాలుగా చూపించారు. దీనిపై కన్నేసిన యజమానులు అన్ రిజిస్టర్డ్ అగ్రిమెంట్ ఆఫ్ సేల్ పత్రం ఆధారంగా 3622 గజాలకు సంబంధించి 23 ప్లాట్లకు టీఎస్‌బీపాస్‌లో 2023లో అనుమతులు పొందారు. ఈ స్థలాల విలువ సుమారు రూ.14 కోట్లు ఉంటుంది.

విశాఖనగర్‌లోని చెరువుకు ఆనుకుని ఉన్న 3 వేల గజాల్లో ఓ ఇంటిని నిర్మించారు. ఇదే కాలనీలో మరో చోట 1200 గజాల్లో 600 గజాల స్థలం కాలనీ ఆధీనంలో ఉండగా, మిగిలిన స్థలం స్థానికుల చేతుల్లో ఉంది. మరోచోట 1200 గజాలకు డాక్యుమెంట్లు తయారు చేయగా, మరో 600 గజాలు అమ్మేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది. శ్రీహిల్స్ కాలనీలో ఒక చోట 2200 గజాలు కబ్జా అయ్యింది. మరోచోట 2200 గజాల్లో ఆక్రమణకు గురికాగా, 600 గజాలు మిగిలింది. స రాజీవ్ గృహకల్ప పక్కనే ఇటీవల అధికారులు పార్కు స్థలంలో బోర్డు పాతినా స్థల యజమానులు దానిని తొలగించారు. నాదర్‌గుల్ వివేకానందనగర్‌లో 500 గజాలు, సిద్దార్థనగర్ కాలనీలో 200 గజాల స్థలం కబ్జాకు గురైంది. బడంగ్‌పేట ఎంసీఆర్ కాలనీలో 700 గజాల స్థలం కబ్జాకు గురవుతుందని కాలనీ వాసులు ఇటీవల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

## కొత్త మార్కెట్‌పై దృష్టి

గోదావరిఖని: సింగరేణి వ్యాపార విస్తరణ దిశగా అడుగులు వేస్తోంది. ఉత్పత్తి చేసిన బొగ్గును మార్కెట్ చేసుకోవడంపై దృష్టి సారించింది. కొత్త వినియోగదారులను సమకూర్చుకునే పనిలో పడింది. తాజాగా తమిళనాడు పవర్ కార్పొరేషన్‌కు 2.88 మిలియన్ టన్నుల బొగ్గు రవాణాకు ఒప్పందం చేసుకొంది. ఒడిశాలోని నైనీ నుంచి జీ-11 గ్రేడ్ బొగ్గు సరఫరాకు ఆ సంస్థతో ఒప్పందం కుదిరింది. తమిళనాడు నార్త్ చెన్నై విద్యుత్తు కేంద్రానికి 1.75 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా చేస్తోంది. కొత్త మార్కెట్‌ను సమకూర్చుకుంటున్న సింగరేణి నైనీ బ్లాకు నుంచి ఈ ఏడాది 4 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా నిర్దేశించుకొంది. ఇంకా 1.12 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరాకు కొత్త వినియోగదారులను సమకూర్చుకొనే దిశగా ప్రయత్నాలు చేస్తోంది.

**నగదు వినియోగదారులపై దృష్టి**

సంస్థ నగదు వినియోగదారులపై ఎక్కువ దృష్టి సారించింది. ఇప్పటికే బొగ్గు సరఫరా చేయడం ద్వారా రావాల్సిన బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోయాయి. బకాయిలు చెల్లించకపోవడంతో సంస్థ ఆర్థికంగా



ఇబ్బందులు ఎదుర్కొంటుంది. దీంతో కొత్తగా మార్కెట్ విస్తరిస్తూ బొగ్గు సరఫరా చేయడం ద్వారా వెంటనే డబ్బులు చెల్లించే సంస్థలకు బొగ్గు సరఫరా చేయనుంది. ప్రస్తుతం ఎన్టీపీసీ మాత్రమే సింగరేణికి వెంటనే బిల్లులు చెల్లిస్తోంది. ఏటా 12 మిలియన్ టన్నుల బొగ్గును తీసుకుంటున్న ఎన్టీపీసీ ఏ రోజుకారోజు చెక్కులు అందజేస్తోంది. మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లోని విద్యుత్తు సంస్థలు కూడా దాదాపుగా వెంట వెంటనే బిల్లులు చెల్లిస్తున్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ జెన్‌కోల నుంచే భారీ మొత్తంలో బకాయిలు రావాల్సి ఉంది.

**అందుబాటులోకి ధరలు** వినియోగదారులకు బొగ్గు ధరలు అందుబాటులోకి తెచ్చేందుకు సంస్థ ఆలోచన చేస్తోంది. దీని ద్వారా మార్కెట్‌ను మరింత పటిష్ఠం చేసుకునేందుకు కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కోల్ ఇండియా కంటే సింగరేణి బొగ్గు ధర ఎక్కువగా ఉండటంతో వినియోగదారులు ముందుకు రావడం లేదు. బొగ్గు ధర తగ్గించుకోవడం ద్వారా కొత్త వినియోగదారులను తమ వైపు తిప్పుకోవడానికి సంస్థ ప్రయత్నిస్తోంది. సాధారణంగా కోల్ ఇండియాతో పోల్చితే సింగరేణి బొగ్గు ధర టన్నుకు రూ.1000 నుంచి రూ.2000 వరకు ఎక్కువగా ఉంది. దీంతో వినియోగదారులకు సింగరేణి బొగ్గు భారంగా మారుతుంది. రానున్న కాలంలో కొంత వరకు బొగ్గు ధరను తగ్గించి సరఫరా చేసే యోచన చేస్తోంది.

## ఆర్వోబీ పనులకు 'గేట్' పడింది

పెద్దపల్లి : జిల్లా కేంద్రంలో కూనారం రైల్వే గేట్ కష్టాలు తొలగించేందుకు రెండేళ్ల కిందట చేపట్టిన ఆర్వోబీ నిర్మాణ పనులు ఆరు నెలలుగా నిలిచిపోయాయి. భూసేకరణ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. గేట్ వేసిన ప్రతీసారి వాహనదారులకు గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదు.

**నిర్వహణలో ఆలస్యం**

పెద్దపల్లిలోని కూనారం రోడ్డులో రూ.199.5 కోట్ల అంచనా వ్యయంతో ఆర్వోబీ నిర్మాణ పనులకు 2022లో ప్రారంభించారు. రైల్వే నియంత్రణలోని వంతెన నిర్మాణ పనులు తుది దశకు చేరగా ఆర్అండ్‌బీ పరిధిలో రెండువైపులా అప్రోచ్ వంతెనల పనులకు భూసేకరణ అవరోధంగా మారింది. కూనారం వైపు నిర్మించిన ఓ వంతెనకు 14 పిల్లర్లు, మరో వంతెనకు 13 పిల్లర్లు మాత్రమే నిర్మించారు. ఇక్కడ ఓ గ్యాస్ గోదాంకు సంబంధించిన స్థలానికి చెల్లింపులు జరగకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. రెండు వైపులా సర్వీస్ రోడ్డు నిర్మాణానికి 3 ఎకరాల స్థలం సేకరించాల్సి ఉంది. ఓ వైపు భూసేకరణ పూర్తి కాకపోవడం, మరోవైపు చెల్లింపులో జాప్యం జరుగుతుండటంతో గుత్తేదారు తప్పుకుంటున్నట్లు ఉన్నతాధికారులకు మౌఖిక సమాచారం ఇవ్వడంతో అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

**ఇక్కడ సైతం ఇబ్బందే..**

పాలకుర్తి మండలంలోని కన్నాల, పెద్దపల్లి మండలంలోని దేవునిపల్లి, గౌరెడ్డిపేట, చీకురాయి, ఓదెల మండలంలోని పొత్కపల్లి, కొలనూరు, ఓదెల వద్ద రైల్వేగేటు కష్టాలు నిత్యకృత్యం. ఓదెల మండలం ఉప్పరపల్లి,



పెద్దపల్లి మండలం కొత్తపల్లి వద్ద నిర్మించిన ఆర్‌యూబీలు వర్షాకాలంలో నీట మునుగుతుండటంతో కష్టాలు తప్పడం లేదు. ఇటీవల వినియోగంలోకి వచ్చిన కొత్తపల్లి అండర్‌పాస్‌లో మూడు వైపుల నుంచి దారులుండగా ఆర్‌యూబీ ప్రమాదకరంగా మారింది.

**ప్రతి పది నిమిషాలకు..**

కాజీపేట-బల్లార్ష సెక్షన్‌లో రైళ్ల రద్దీ అధికంగా ఉండటంతో ప్రతీ పది నిమిషాలకు ఒకసారి గేటు పడుతూ ఉంటుంది.

పెద్దపల్లి మండలంలోని హన్మంతునిపేట, రాంపల్లి, మారేడుగొండ, గుర్రాంపల్లి గ్రామాలతోపాటు కాల్వశ్రీరాంపూర్ పూర్తిగా, ముత్తారం మండల కేంద్రంతోపాటు మరికొన్ని గ్రామాలకు అత్యవసర పరిస్థితుల్లో గేటు అవరోధంగా మారింది. గేటు పడితే 108 వాహనాల్లో తీసుకొచ్చిన వారిని అవతలవైపు ఇతర వాహనాల్లోకి మార్చి తరలించిన రోజులున్నాయి. ఈ పరిస్థితులు చక్కదిద్దేలా పనులను వేగిరం చేయాల్సిన అవసరముంది.

చురకలు



# డివిజన్ కేంద్రాల్లో డీఎల్‌డీవో కార్యాలయాలు

మార్కాపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాలన పరంగా పూర్తిగా సంస్కరణలు చేపట్టింది. వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీవో) వ్యవస్థను పూర్తిగా బలోపేతం చేసి వారికి విధులు, అధికారాలు, బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధమైంది.

**పనులు చురుగ్గా సాగుతున్నాయి**

జిల్లాలోని డివిజన్ కేంద్రాల్లో డీఎల్‌డీవో కార్యాలయాల నిర్మాణాల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇప్పటికే కార్యాలయాలకు సంబంధించి 90 శాతం పనులు పూర్తి చేశారు.

ప్రకాశం జిల్లాలో మార్కాపురం, కనిగిరి, ఒంగోలు మూడు డివిజన్ కేంద్రాలు కొనసాగుతున్నాయి. 2020లో ప్రతి డివిజన్‌కు డీఎల్‌డీవోలను నియమించారు. డివిజన్ కేంద్రాల్లోని మండల కార్యాలయాల్లో ఓ గది తీసుకుని ఉండాలని ఆదేశాలు ఇచ్చారు. ఆ సమయంలోనే జడ్పీ నుంచి ఇద్దరు సిబ్బందిని సర్దుబాటు చేసి కేటాయించారు.




**ప్రక్షాళనలో భాగంగా ప్రత్యేక అధికారాల బదలాయింపు**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రక్షాళనలో భాగంగా డీఎల్‌డీవోలకు ప్రత్యేకమైన అధికారాలు ఇచ్చి డివిజన్‌లో మిగిలిన అన్నిశాఖల పర్యవేక్షణ చేయాలనే ఆలోచనతోనే కార్యాలయాలు సిద్ధం చేశారు. మార్కాపురం మండలంలోని రాయవరం జిల్లా నీటి యాజమాన్య సంస్థ కార్యాలయంలో రూ.15 లక్షలతో పూర్తిగా ఆధునికీకరించారు. ఈ కార్యాలయంలో డీఎల్‌డీవో, డీఎల్‌పీవో (డివిజనల్ పంచాయతీ అధికారి) డ్వామా ఏపీడీ కార్యాలయాలను సిద్ధం చేశారు. కనిగిరి డివిజన్ కేంద్రంలో స్త్రీశక్తి భవనంలో రూ.10 లక్షలతో పూర్తిగా ఆధునికీకరించారు.

ఒంగోలు డివిజన్ కేంద్రంలో పాత జిల్లా పరిషత్తు కార్యాలయంలో డీఎల్‌డీవో కార్యాలయం, డీఎల్‌పీవో, డ్వామా ఏపీడీ కార్యాలయాలు సిద్ధం చేశారు. వీటిని నవంబర్ 1వ తేదీ నుంచి పూర్తిగా అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పరిషత్తు సీఈవో చిరంజీవి తెలిపారు.

# నిధులు నేలపాలు.. సామగ్రి చోరుల పాలు

దొనకొండ : పర్యాటకులు ఏదైనా సుందర ప్రదేశాన్ని చూడటానికి వచ్చినప్పుడు వారికి ఆహారానికి ఎలాంటి ఇబ్బంది ఉండకూడదు. తద్వారా వారు ఎంతో ఉపశమనం పొందుతారు. ఇదే ఉద్దేశంతో దొనకొండ మండలంలోని చందవరం గ్రామ సమీపంలోని బౌద్ధ స్థూపం చూసేందుకు వచ్చే పర్యాటకులకు సౌకర్యాలు ఉండాలని ఏపీ టూరిజం 17సంవత్సరాల క్రితం ఫలహారశాల నిర్మాణం చేపట్టింది. ఇందుకోసం రూ.45 లక్షలు మంజూరు చేశారు. వచ్చిన నిధులతో పనులు పూర్తిచేసి మిగిలినవి చేయలేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోయింది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరి ఏర్పాటుచేసిన సామగ్రి దొంగలపాలైంది. కూటమి ప్రభుత్వం దీనిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

**2వ శతాబ్దంలో స్థూపం నిర్మాణం**

క్రీ.పూ. 2వ శతాబ్దంలో ఈ బౌద్ధస్థూపంను నిర్మించారు. ఎంతో విశిష్టత ఉండటంతో ఇక్కడకు పర్యాటకులు వస్తారని వారికి అన్ని వసతులు



కల్పించాలని అప్పట్లో పనులు జరిపారేకాని పూర్తి చేయలేదు. రక్షణకు సిబ్బంది కూడా లేకపోవటంతో విద్యుత్ తీగలు, తలుపులు, బోరు దొంగలపాలయ్యాయి. అప్పుడప్పుడు పర్యాటకులు వచ్చినపుడు వారికి తాగడానికి కనీసం మంచినీరు కూడా లేకపోవటంతో ఉసూరుమంటూ వెనుదిరిగి వెంటనే వెళ్లిపోతున్నారు.

**కల్పించాల్సిన సౌకర్యాలు**

భవనం పనులు పూర్తిచేసి సిబ్బందిని ఏర్పాటుచేసి పూలమొక్కలు, చిన్నారులకు ఆటవస్తువులు, ఉండేందుకు వసతి, స్విమ్మింగ్‌పూల్, అవసరమైన తినుబండారాలు ఉంటే పర్యాటకులు పెరిగి ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఆశిస్తున్నారు. అప్పట్లో వీటికోసం నిధులు కావాలని ప్రతిపాదనలు పంపించారే తప్ప పట్టించుకున్నవారు లేకపోవటంతో విలువైన చరిత్ర ప్రపంచానికి తెలిసే వీలు లేకుండా పోతోంది.

**ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది**చందవరం బౌద్ధ స్థూపాలు అన్నివిధాలా అభివృద్ధి చేయాలని ఉన్నతాధి కారుల దృష్టిలో ఉందని పురావస్తుశాఖ ఏడీఏ జరీనాకు తెలిపారు. నిధులు వచ్చిన వెంటనే మిగిలిన పనులు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

# వలసెల్లిన గ్రామం.. దస్త్రాల్లో పదిలం

దొనకొండ :వీరఘట్టం మండలం రెవెన్యూ దస్త్రాల్లో ఉన్న విక్రమపురం పంచాయతీ పరిధిలోని మొదటికెల్ల, చిట్టపుడివలస పంచాయతీలోని శ్రీహరిపురం గ్రామాలు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. పూర్వం ఆయా ప్రాంతాల్లో 20 నుంచి 30 వరకు కుటుంబాలు నివసించేవి. దశాబ్దాల కిందట ఇక్కడి జనం స్థానికంగా ఉపాధి లేకపోవడం, ఇతర కారణాలతో వలసెల్లిపోయారు. వారి భూములు పరిసర ప్రాంతాల వారికి విక్రయిం చేశారని స్థానికులు చెబుతున్నారు. భూమిపై లేకపోయినా మొదటికెల్ల రెవెన్యూ పరిధిలో 657 ఎల్‌పీఎం నంబర్లలో 337.68 ఎకరాలు, శ్రీహరిపురం 495 ఎల్‌పీఎం నంబర్‌లో 268.75 ఎకరాల భూమి ఉంది. పట్టాదారు పాసుపుస్తకం, వన్–బి దస్త్రాలున్నాయి. ఇటీవల భూసర్వే కూడా నిర్వహించారు.

# దుర్వాసన.. గ్రామీణుల వేదన



పుట్టపర్తి : బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ పరిశ్రమ నుంచి వెలువడే దుర్వాసన, వాయు కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బత్తలపల్లి, ముదిగుబ్బ మండలాల పరిధిలోని నాలుగు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. నిత్యం ఆసుపత్రుల నుంచి వెలువడే వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పడేస్తే మానవాళికి ముప్పు ఉంటుందని గుర్తించిన ప్రభుత్వం వాటి నిర్వహణకు కొందరికి అనుమతి ఇస్తుంది. ఇలా ఉమ్మడి అనంతపురం, కడప జిల్లాల పరిధిలో వ్యర్థాల నిర్వహణకు బత్తలపల్లి మండలంలోని దంపెట్ల గ్రామ పరిధిలో పరిశ్రమకు అనుమతి తెచ్చుకుంది. దీంతో 2016లో పరిశ్రమను ఏర్పాటు చేశారు. దాని చుట్టూ దంపెట్ల, కట్టకిందపల్లి, సిద్ధన్నగారిపల్లి, ఉప్పలపాడు గ్రామాలున్నాయి.

గడువు ముగిసిన మందులు, వాడేసిన సిరంజిలు, శస్త్రచికిత్స సందర్భంగా వెలువడే వ్యర్థాలను ఇక్కడి పరిశ్రమలో వేరుచేసి పసుపు, ఎరుపు, నీలం రంగుల సంచుల్లో నింపుతారు. సూదులు, బ్లేడ్లు, తదితర పరికరాలను తెల్ల కంటైనర్లలో వేస్తారు. వాటి నుంచి దుర్వాసన వెలువడుతుంటుంది. సంచుల్లో నింపిన వాటిని రాత్రివేళల్లో కాల్చివేస్తారు. ఆ సమయంలో పొగ వెలువతున్న పొగతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని ప్రజలు వాపోతున్నారు.

**పనులు చేసుకోలేకున్నాం..**

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలో 1016, కడప జిల్లాలో 600 పైగా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి. వాటిల్లో వెలువడే వ్యర్థాలను పరిశ్రమ రోజూ సేకరిస్తుంటుంది. ఇందుకుగాను ప్రతి ఆసుపత్రి నుంచి వాటిస్థాయికి అనుగుణంగా వేల రూపాయలు ప్రతి నెలా వసూలు చేస్తుంది. ఈ నేపథ్యంలో 33 శాతం గ్రీన్‌బెల్టు ఏర్పాటు చేయాలని... వాయుకాలుష్యం రాకుండా తగు చర్యలు తీసుకోవడం లేదని స్థానికలు అంటున్నారు. అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అనారోగ్యం బారిన పడటంతో పాటు పరిసర ప్రాంతాల్లో పొలాలకు వెళ్లి పనులు చేసుకోలేకపోతున్నాం.. పశువులను మేపడానికి తీసుకెళ్లడమే మానేశామని చెబుతున్నారు.

ఈ విషయంపై పరిశ్రమ నిర్వాహకులు అశోక్‌ను వివరణ కోరగా నిబంధనల మేరకు నిర్వహిస్తున్నాం. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

నిబంధనలకు అనుగుణంగా చేస్తున్నారా.. లేదా? గ్రామీణులకు ఏవైనా ఇబ్బందులున్నాయా.. అనే విషయాలపై ఆరా తీస్తాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

కిశోర్‌రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జి ఈఈ, కాలుష్య నియంత్రణ మండలి

# ఉరిమిన మొంథా.. అలజడే అంతా!



అనకాపల్లి : రావికమతం మండలం చీమలపాడు శివారులో జిలుగులోవలోని 26 గిరిజన కుటుంబాలను చీమలపాడు పునరావాస కేంద్రానికి తరలించారు. రాంబిల్లి మండలంలో సముద్ర తీర గ్రామాలైన వాడపాలెం, వాడనర్సాపురం, కొత్తపట్నం, వేటకొత్తపట్నం, వెంకయ్యపాలెం, లోవపాలెం నుంచి ప్రజలను తరలించారు. ఎలమంచిలిలో 30 ఇళ్లను స్థానికంగా ఉన్న పునరావాస కేంద్రాలకు చేర్చారు. అనకాపల్లి మండలం వెంకుపాలెం రహదారిపై వెదుళ్లగెడ్డ పొంగి ప్రవహించింది. దీంతో కుంచంగి, రొంగలివానిపాలెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కశింకోట మండలం గొలగాం పంచాయతీ శివారు ఎల్లారమ్మ కాలనీ సమీపంలోని కొండచరియలు జారిపడి ఇల్లు ధ్వంసమైంది. మాకవరపాలెం మండలం లచ్చన్నపాలెంలో ఇంటిగోడ కూలింది. కోటవురట్ల మండలం పి.కొత్తపల్లి సమీపంలోని రామన్నపాలెంలో పైల అప్పలనాయుడుకు చెందిన పెంకుటిల్లు స్వల్పంగా కూలింది.

నర్సీపట్నం – అడ్డురోడ్డు ప్రధాన రహదారిపై రామచంద్రాపురం వద్ద భారీ వృక్షం నేలకొరిగింది. కొంత సమయం రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారిపై ఎలమంచిలిలోని పులపర్తి వద్ద ఈదురు గాలులకు భారీ చెట్టు కూలింది. స్థానికుల సహాయంతో దాన్ని తొలగించారు. నక్కపల్లి మండలంలోని గుల్లిపాడు వద్ద చెట్లు, వెదుళ్లపాలెంలో విద్యుత్తు స్తంభం విరిగిపడ్డాయి. ఉదయం నుంచి ఈదురుగాలులు వీస్తున్న నేపథ్యంలో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. తుపాను ప్రభావంతో జిల్లావ్యాప్తంగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. జలాశయాలు, నదులు, వాగులు, కాలువలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. గాలులకు అక్కడక్కడ చెట్లు, విద్యుత్తు స్తంభాలు విరిగిపడ్డాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రతి మండలంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి తరలించారు. ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా మూడుపూటలా సకల సౌకర్యాలు అందించారు. తీరప్రాంత గ్రామాలను ముందస్తుగానే బహుళ ప్రయోజన భవనాల్లోకి తరలించారు. అడపాదడపా చెట్లు, విద్యుత్తు స్తంభాలు విరిగిపడినా.. జిల్లా యంత్రాంగం వెంటనే వాటిని తొలగించి, ప్రజాజీవనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహాయక చర్యలు చేపట్టింది.

జిల్లాలో అధికంగా వర్షాలు పడుతాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ముందుగా రెడ్ అలర్ట్ ప్రకటించింది. దీంతో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లాకు ప్రత్యేక అధికారిగా నియమితులైన వినయ్‌చంద్.. జిల్లా అధికారులను సమన్వయం చేసుకుంటూ పక్కా ప్రణాళికతో ఎక్కడికక్కడ ముందస్తు సహాయక చర్యలు చేపట్టారు. పునరావాస కేంద్రాలు సౌకర్యాలు కల్పించారు. ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటర్ల ద్వారా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు.

జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలు, రక్షిత భవనాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.స్వప్న తెలిపారు. వైద్యాధికారులు, సిబ్బందిని 24 గంటలూ అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. గర్భిణిలను ఆసుపత్రులకు తరలించామన్నారు.

**ముందే రేషన్ పంపిణీ**

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు జిల్లాలో రేషన్ డిపోల ద్వారా సరకుల పంపిణీ ప్రారంభించామని సంయుక్త కలెక్టర్ జాహ్నవి పేర్కొన్నారు. జిల్లాలో 5,35,492 మంది కార్డుదారులకు రేషన్ నిర్ణీత గడువు కన్నా ముందే అందిస్తున్నామన్నారు. డిపోలకు బియ్యం, పంచదార తరలించామన్నారు. తొలిరోజు 30789 మంది కార్డుదారులకు 382 మెట్రిక్ టన్నుల బియ్యం, 27719 మందికి 30 మెట్రిక్ టన్నుల పంచదార పంపిణీ చేశామని తెలిపారు. **సబ్బవరంలో అధిక వర్షపాతం**తుపాను ప్రభావంతో జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు పడుతున్నా యి. నదులన్నీ పొంగి ప్రవహిస్తున్నా యి. ఉదయం 8.30 నుంచి సాయంకాలం 6 గంటల వరకు జిల్లాలో అత్యధికంగా సబ్బవరంలో 167.8 మి.మీ. వర్షం కురిసిందని వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు తెలిపారు. రాంబిల్లి, పరవాడ, అచ్యుతాపురం, కె.కోటపాడు, చోడవరం, మునగపాక, నక్కపల్లి, బుచ్చె య్యపేట, ఎస్.రాయవరం, ఎలమంచిలి మండలాల్లో వంద మి.మీ. కంటే ఎక్కువ.. గొలుగొండ, నాతవరం, మాడుగుల మండలాలు మినహా మిగిలిన అన్నిచోట్లా 66 మి.మీ. కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది.

# ఉపాధి కోర్సులు

తిరుపతి : శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఉపాధి కోర్సుల విద్యార్థినుల బంగారు భవితకు బాటలు వేస్తోంది. ఇందులో భాగంగా పలు ఇంటిగ్రేటెడ్, ఒకేషనల్, హానర్స్ డిగ్రీ కోర్సులను నిర్వహిస్తోంది. ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థినులు ఈ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సులు ఇవే.. బి.ఒకేషనల్‌లో.. మూడేళ్ల ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ అప్పరల్ డిజైనింగ్ (50 సీట్లు), న్యూట్రిషనల్ అండ్ హెల్త్‌కేర్ సైన్సెస్ (50), బీఎస్సీ హానర్స్ స్టాటిస్టిక్స్ (40), బీఏ హానర్స్ సోషల్‌వర్క్(40), ఇంటిగ్రేటెడ్ ఫుడ్ టెక్నాలజీ (40), ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ కోర్సులో 35 సీట్లున్నాయి.

మొదటి, రెండు కౌన్సెలింగ్‌లలో సీట్లు పొందని విద్యార్థినులు వోఎండీసీ పోర్టల్‌లో బుధవారంలోగా నమోదు చేసుకోవాలి. నవంబరు 1వ తేదీ వరకు సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేసుకోవాలి.

**ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో.. 253 పోస్టుల భర్తీకి అనుమతి**

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలో 253 బోధనా సిబ్బంది ఖాళీలను భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఈ ప్రత్యక్ష




నియామకాలు చేపట్టేలా నోటిఫికేషన్ జారీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (పశుసంవర్ధక శాఖ) బి.రాజశేఖర్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

# మెరవని గ్రానైట్!

ఒంగోలు : జిల్లాకు మూలాధారమైన గ్రానైట్ పరిశ్రమల్లో కార్యకలాపాలు నెల రోజులుగా స్తంభించిపోయాయి. బండరాళ్లను పాలిష్ బండలుగా మార్చే కోత యంత్రాలు తిరగడం లేదు. ఫలితంగా చీమకుర్తి ప్రాంతంలో సందడి కనిపించడంలేదు. గ్రానైట్ రంగంలో పనిచేస్తున్న కార్మికుల ఉపాధిపై ప్రభావం పడింది. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడిన వేలాదిమంది పనుల్లేక అల్లాడి పోతున్నారు. క్వారీ నుంచి తీసే గ్రానైట్ బండరాళ్లపై సీనరేజీ వసూళ్ల బాధ్యతను ప్రభుత్వం ఏఎంఆర్ సంస్థకు అప్పగించింది. గనులశాఖ నిర్దేశించిన మేరకు వీరు పన్ను వసూలు చేసి ప్రభుత్వ ఖాతాకు జమ చేయాలి. పన్ను వసూలు చేసే ఏఎంఆర్ సంస్థ, గనులశాఖకు చెల్లించే సొమ్ముతో పాటు అదనంగా చెల్లించాలని కోరడంతో పరిశ్రమ యజమానుల్లో ఆందోళన మొదలైంది. ఒక్కో పరిశ్రమ యజమాని రూ.35 వేలు చెల్లిస్తే సరిపోతుంది. అయితే ఆ సంస్థ అదనంగా బండరాళ్లను కోసే అవకాశం ఉన్నందున మరో రూ.30 వేలు వరకు చెల్లించాలని డిమాండు చేస్తున్నారు. దీంతో యజమానులు ఈ నెల ఆరంభం నుంచి సమ్మెలో దిగారు. గత 15 రోజులుగా పనులు లేకపోవడంతో



కార్మికులు స్వస్థలాలకు వెళ్లిపోయారు. ఈలోగా దీపావళి పండగ రావడంతో మిగిలినవారు సొంతూళ్లకు తరలిపోయారు. దీంతో పరిశ్రమల్లో పనులు నిలిచిపోయాయి. ఆ తరువాత భారీ వర్షాలు కురుస్తుండడంతో పనులకు ఆటంకం ఎదురైంది. దాదాపు నెల రోజులుగా గ్రానైట్ పరిశ్రమలు మూతపడ్డాయి.

**ఎడతెగని వివాదం**అదనపు చెల్లింపులపై ఇప్పటికే ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులతో పరిశ్రమ యజమానులు పలు దఫాలుగా చర్చలు జరిపినా ఫలించలేదు. గ్రానైట్ క్వారీల నుంచి ఏ రాయి తీసుకొస్తే, దానికి ఆమేరకు పన్ను చెల్లించా ల్సిందేనని పట్టుబడుతున్నారు. ఇలా తీసుకొచ్చిన ప్రతి రాయి పాలిష్ బండలుగా మారదని, పగుళ్లు ఉంటాయని కోత ఖర్చులు భరించి పన్ను చెల్లించాలంటే ఎలాగని యజమానులు వాదిస్తున్నారు. తాము ఎంతవరకు కోత కోసి పాలిష్ బండలుగా మార్చామో.. దాని వరకు పన్ను చెల్లించేందుకు సుముఖమేనని వాదన వినిపిస్తున్నారు. అవన్నీ తాము పట్టించుకోబోమని నిబంధనల ప్రకారం చెల్లించాల్సిందేనని ప్రైవేటు సంస్థ పట్టుబడుతోంది. గ్రానైట్ పరిశ్రమలు పూర్తిస్థాయిలో తెరచుకోకపోవడంతో కూలీలతో పాటు రవాణా రంగానికి చెందినవా రు, వీరిపై ఆధారపడిన చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేలాది కుటుంబాల జీవనోపాధితో ముడిపడినందున ప్రజాప్రతినిధులు, అధికారులు జోక్యం చేసుకొని సమస్యకు పరిష్కారం చూపాల్సి ఉంది.

# అధికారులకు అగచాట్లే

నెల్లూరు : బహిరంగ మల, మూత్ర విసర్జన తగదని చెప్పే అధికారులకే ఆ సమస్య తలెత్తింది. జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్ల వసతి లేదు. కొన్నిచోట్ల భవనాలు నిర్మించినా.. మరుగుదొడ్లు ఏర్పాటు చేయలేదు. కొన్నిచోట్ల నిర్మించినా నిరుపయోగంగా వదిలేశారు. ఫలితంగా అక్కడ విధులు నిర్వహించే అధికారులతో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చే సందర్శకులు అత్యవసరానికి అవస్థలు తప్పడం లేదు.

**రెండు శాఖల్లోనూ..**

కావలి పట్టణంలోని మత్స్యశాఖ కార్యాలయంలో సహాయ సంచాలకులు ఉంటారు. కావలి ప్రాంత ఎఫ్‌డీవో కూడా ఇక్కడే విధులు నిర్వర్తిస్తుంటారు. ఇక్కడ మరుగుదొడ్ల వసతి లేకపోవడంతోపాటు భవనం పూర్తిగా శిథిలమైపోయింది. వర్షం వస్తే ఉరుస్తుంది. జలవనరులశాఖ ఈఈ కార్యాలయంలో కూడా మరుగుదొడ్లు లేవు. పలు సచివాలయాల్లోనూ ఇదే సమస్య నెలకొంది. అక్కడ పనిచేసే మహిళా ఉద్యోగులు ఇక్కట్లకు గురవుతున్నారు.

**సముదాయంలో ఆ ఒక్కచోటే..**

కోవూరు పట్టణంలో తాలూకా ఆఫీసు వద్ద తహసీల్దారు, మండల పరిషత్తు, విద్య, వ్యవసాయం, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, గృహనిర్మాణ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా.. అన్నింటికీ మరుగుదొడ్ల వసతి ఉన్నా... గృహనిర్మాణ శాఖ కార్యాలయానికి లేదు. అధికారులు, కార్యాలయానికి వచ్చే ప్రజలు అత్యవసరాలకు సులభ్ కాంప్లెక్స్‌కు వెళుతున్నారు. మహిళలకు ఇబ్బందులు తప్పడంలేదు.

**పంచాయతీల్లో స్వచ్ఛతను పర్యవేక్షించే వారికీ..**

నెల్లూరు నగరంలోని నూతన జడ్పీ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ కార్యాలయం ఉండగా.. అదేశాఖకు చెందిన ఈఈ కార్యాలయం ఆచారివీధిలోని పాత జడ్పీ కార్యాలయం వద్ద కొనసాగుతోంది. ఇక్కడ కార్యాలయ సిబ్బందికి మరుగుదొడ్లు లేవు. పంచాయతీల్లో స్వచ్ఛతను పర్యవేక్షించే అధికారులకే వసతి లేకపోవడం గమనార్హం.



పంచాయతీరాజ్ కార్యాలయంలో కూడా అక్కడకు వచ్చే వారికి ప్రత్యేకంగా ఎలాంటి మరుగుదొడ్లు లేవు. నెల్లూరు నగరంలోని ఆర్డీవో కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎలాంటి వసతి లేక అవస్థలు తప్పడం లేదు. **గదులు నిర్మించి..విస్మరించి..**రాపూరులోని ఉపాధి హామీ పథకం కార్యాలయంతోపాటు గ్రంథాల యంలో మరుగుదొడ్ల వసతి లేదు. ఉపాధి హామీ కార్యాలయంలో గదులు నిర్మించారేగానీ ఎలాంటి వసతులు లేకపోవడంతో గదులన్నీ నిరుపయోగంగా వదిలేశారు. సిబ్బంది మలమూత్ర విసర్జనకు బహిరంగ ప్రదేశాలకు వెళుతున్నారు. గ్రంథాలయంలో కూడా వసతి లేదు.

# నైపుణ్యానికి యువసత్వాలు

డోన్ : యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు కేంద్రం ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎంపికైన వారికి ప్రతి నెలా స్టైఫండ్ అందించడమేకాక ప్రముఖ కంపెనీల్లో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తారు. కార్పొరేట్ సంస్థలకు నైపుణ్యాలు కలిగిన మానవ వనరుల అవసరం ఎంతగానో ఉంది. విద్యార్థులకు అకడమిక్ థియరిటికల్ అంశాలపై అవగాహన ఉన్నప్పటికీ ప్రాక్టికల్ నాలెడ్జ్ అంతంతమాత్రమే. ఈ అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో 2024-25 నుంచి 'ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

**అర్హులు ఎవరంటే**

పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీబీఏ, బీఫార్మసీ తదితర కోర్సులు చదివినవారు.

21-24 ఏళ్ల మధ్య వయస్సు ఉన్నవారు..

వీరు అనర్హులు

ఐఐటీ, ఐఐఎం, నేషనల్ లా వర్సిటీ, ఐఐఎస్ఈఆర్, ఎన్ఐటీ, ట్రిపుల్



ఐటీ నుంచి గ్రాడ్యుయేటు, సీఏ, సీఎంఏ, సీఎస్, ఎంబీబీఎస్, బీడీఎస్, ఎంబీఏ, ఏదైనా ఇతర ఉన్నత లేదా మాస్టర్స్ డిగ్రీ ఉన్నవారికి ఈ పథకం వర్తించదు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కింద ఇంటర్న్‌షిప్ చేస్తున్న వారికి, నేషనల్ అప్రెంటిస్‌షిప్ ట్రైనింగ్ సిస్టం, నేషనల్ అప్రెంటిస్‌షిప్ ప్రమోషన్ పథకం కింద శిక్షణ పొందినవారికి పీఎం ఇంటర్న్‌షిప్ లభించదు.

**కావాల్సిన పత్రాలు**

దరఖాస్తు చేసుకునేందుకు ఆధార్‌కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, విద్యార్హత పత్రాలు తప్పనిసరి.

**ఎంపిక ఇలా**

అభ్యర్థికి గరిష్ఠంగా మూడు ఐచ్ఛికాలు (కంపెనీలు) ఇస్తారు. ఎంపికైన వారికి ప్రముఖ సాఫ్ట్‌వేర్, బహుళజాతి సంస్థలు, చమురు, గ్యాస్, ఇంధన రంగం, టూర్స్ అండ్ ట్రావెల్స్, ఆతిథ్య రంగంలో అవకాశాలు ఇస్తారు.

**ఏడాదికి రూ.60 వేల వేతనం**


ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికైన వెంటనే విద్యార్థికి రూ.6 వేలు ఇస్తారు. దీంతోపాటు ప్రతి నెలా రూ.5 వేల చొప్పున ఏడాదిపాటు రూ.60 వేలు అందిస్తారు. ఇందులో కేంద్రం రూ.4,500, సదరు కంపెనీ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.500 లభిస్తుంది. విద్యార్థిలోని ప్రతిభను బట్టి సదరు కంపెనీ ఇంకనూ ఎక్కువ ఇవ్వొచ్చు.

# రక్తంలో రాకాసి.. కొడవలిలా మాటేసి

విజయనగరం : ఉమ్మడి జిల్లాలో సికిల్‌సెల్ ఎనీమియా విజృంభిస్తోంది. రానురానూ బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో యంత్రాంగం దృష్టిసారించింది. అవగాహనతో పాటు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా వైద్యులు నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. ఇటీవల విజయనగరం జిల్లాలో 40 ఏళ్ల లోపు వయసున్న సుమారు 28,173 మంది గిరిజనులను గుర్తించి, 26,656 మందికి పరీక్షలు చేశారు. వీరిలో ఇద్దరికి పాజిటివ్ లక్షణాలు కనిపించాయి. వీరే కాకుండా ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 162 మంది బాధితులు చికిత్స పొందుతున్నట్లు వైద్యారోగ్యశాఖ గణాంకాలు చెబుతున్నాయి. మన్యంలో ఈ సంఖ్య 219కి చేరింది.

**ప్రత్యేకంగా నిధులు..**

రెండు జిల్లాల్లో తీవ్రతను గుర్తించిన దిల్లీలోని భారత వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఇప్పటికే కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి రూ.4 కోట్లు మంజూరు చేసింది. మూడేళ్ల పాటు పరిశోధనలు చేయాలని ఆదేశించింది. ఈ ప్రాజెక్టును సీటీయూ బయోటెక్నాలజీ అసోసియేట్ ప్రొఫెసర్, ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డా.పరికిపండ్ల శ్రీదేవి



పర్యవేక్షిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ, సరైన చికిత్స, ఆరోగ్య సంరక్షణ తదితర అంశాలపై దృష్టిసారించనున్నారు.

**లక్షణాలివీ..**

విపరీతమైన నొప్పి

రక్తహీనతజి

చేతులు, కాళ్లలో వాపు

ఊపిరి తీసుకోలేకపోవడం

తరచూ జ్వరం రావడం

డీహైడ్రేషన్

మూత్రం ద్వారా రక్తం

ప్రత్యేక దృష్టి..

'రక్తకణాలు కొడవలి ఆకారంలోకి మారిపోయి, అవయవాలను వెంటాడుతాయి. ఈమేరకు అవగాహన కల్పిస్తున్నాం. ఇప్పటికే వైద్య శిబిరాలు ప్రారంభించాం. కళాజాతలు నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు 130 శిబిరాల ద్వారా పరీక్షలు చేశాం. అవసరమైన వారికి సకాలంలో చికిత్సలు చేస్తున్నాం' అని జిల్లా పర్యవేక్షణాధికారిణి కె.రాణి తెలిపారు.

# రూ.173 కోట్ల నీటి పథకానికి గ్రహణం



పామిడి : గుత్తి, పామిడి పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఐదేళ్ల కిందట తెదేపా ప్రభుత్వం భారీ నీటి పథకాలను మంజూరు చేసింది. పెనకచెర్ల డ్యాం నుంచి పామిడి మండలం మీదుగా గుత్తి మున్సిపాలిటీకి తాగునీటి సమస్యను పరిష్కరించాలన్నా సంకల్పంతో రూ.173 కోట్లతో పనులకు అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆయా పనులకు పెనకచెర్ల డ్యాం నుంచి కండ్లపల్లి, సొరకాయల పేట, కొత్తపల్లి, పామిడి గ్రామాల మీదుగా తాగునీటి పైపులైన్‌లతో పాటు తాగునీటి ట్యాంకుల ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. ఇప్పటికీ అవి పూర్తి కాలేదు.

**వైకాపా అధికారంలోకి రావడంతో..**

తెదేపా ప్రభుత్వం మారిపోవడంతో అధికారంలోకి వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో తాగునీటి పథకాల పనులు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో పట్టణ వాసులకు తాగునీటిని అందించాలన్న లక్ష్యం నీరుగారింది. అప్పటి వైకాపా ఎమ్మెల్యేలు నీటి పథకాలను పూర్తి చేసి తాగునీటిని అందిస్తామని చెప్పి ఐదేళ్ల కాలాన్ని వృథా చేసింది.

**నిర్మాణదశలోనే ట్యాంకులు**

పామిడి మండలంలోని సొరకాయల పేట, కొత్తపల్లి, పామిడి పట్టణంలోని గుప్తా కాలనీ తాగునీటి ట్యాంకులు 60 శాతం మేర పనులను పూర్తి చేసుకోగా, పామిడి ప్రభుత్వ బాలుర వసతి గృహ ఆవరణలో పిల్లర్ల దశలో ఆగిపోయింది.

**పెరిగిన వ్యయంతో మారిన టెండర్లు**

నీటి పథకాల నిర్మాణ వ్యయం ఏడాదికేడాది పెరుగుతోంది. తొలుత గుత్తి మున్సిపాలిటీకి తాగునీరు అందించేందుకు రూ.90 కోట్ల నిధులు ప్రతిపాదించారు. తరువాత పథకం వ్యయం పెరిగి రూ.120 కోట్లకు చేరింది. ఆ తరువాత నీటి పథకాన్ని పూర్తి చేసేందుకు గాను అంచనా వ్యయం పెరుగుతూ వస్తోంది. కూటమి ప్రభుత్వం తక్షణమే నీటి పథకాలను పూర్తిచేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

# పత్తి దిగదుడుపే..!



అనంతపురం : సమయానికి కురువని వాన.. తెగుళ్ల విజృంభణ.. వెరసి పత్తి పంట రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. ఆశించిన మేర పూత, కాయ లేకుండా పోయి దిగుబడి తగ్గింది. తెల్లబంగారంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులు దిగాలు చెందుతున్నారు. మరోవైపు ప్రైవేటు వ్యాపారులు దోపిడీతో నేలను నమ్ముకుని వేలకు వేలు అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టినా.. కనీసం రెక్కల కష్టం రాకుండా పోతోంది. దీంతో ఏటా పంట సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది.

**వర్షాధారం.. రైతులకు శాపం**

జిల్లాలో చాలా వరకు వర్షాధారంపై పత్తి సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 44,001 హెక్టార్లలో సాధారణ సాగు లక్ష్యం కాగా 27,285 హెక్టార్లలోనే పంట వేశారు. జూన్, జులైలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో మొక్కలు ఎదగలేదు. పూత, కాయ తగ్గింది. ఎకరాకు సుమారు 16 క్వింటాళ్ల నుంచి 18 క్వింటాళ్లు రావాల్సి ఉండగా 4 నుంచి 5 క్వింటాళ్లు కూడా చేతికొచ్చే పరిస్థితి లేదని వ్యవసాయశాఖ అధికారులే అంచనా వేశారు. ఎకరాకు రూ.35 వేలు పెట్టుబడి పెడుతుండగా.. దిగుబడి అమ్ముకుంటే వచ్చేది రూ.30 వేలు.. రూ.5 వేలు నష్టపోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టులోనూ కొంతమేర పంట వేశారు. ప్రస్తుతం పూత దశలో ఉంది.

**నాణ్యత లేదని..**పత్తి నాణ్యత లేదని ప్రైవేటు వ్యాపారులు ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో తేమ శాతం అధికంగా ఉందని.. వ్యాపారులు ధర తగ్గించేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. బళ్లారి, ఆదోని మార్కెట్లలో క్వింటాలు ధర రూ.4,005 నుంచి రూ.7,000 వరకు కొనుగోలు చేస్తున్నారు.

**త్వరలో రెండు కేంద్రాలు ఏర్పాటు**

రాఘవేంద్రకుమార్, సహాయ సంచాలకులు, మార్కెటింగ్‌శాఖ

జిల్లాలో తాడిపత్రి, గుత్తి మార్కెట్ యార్డులో కొనుగోలుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. మిల్లులకు రవాణా చేసేందుకు టెండర్లు తుది దశలో ఉన్నాయి. నవంబరు మొదటి వారంలో కేంద్రాలు ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాం. నిబంధనల ప్రకారం తేమ 8 నుంచి 12 శాతం ఉండాలి.

**మద్దతు ధర ప్రకటిస్తున్నా..**

ఈఏడాది 27,750 హెక్టార్లలో 24,975 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. మార్కెటింగ్‌శాఖ సహకారంతో కొనుగోలు బాధ్యతలను సీసీఐకు అప్పగించారు. ఈ ఏడాది గతంలో కంటే మద్దతు ధర ఎక్కువ ప్రకటించారు.

**గత మూడేళ్లలో పరిశీలిస్తే..** 2023లో క్వింటాలు మొదటి రకం రూ.7,020 కాగా రెండో రకం రూ.6,620 ఉంది. 2024లో మొదటి రకం రూ.7,521, రెండోది రూ.7,121, గతేడాది మొదటి రకం రూ.8,110 కాగా రెండోది రూ.7,710 ప్రకటించారు. గతం కంటే ఈ ఏడాది బాగా పెంచారు. అయినా కొనుగోళ్లు ప్రారంభించకపోవడం అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

# అక్రమార్కుల చేతిలో.. పెన్నా, జయమంగళి విలవిల



పరిగి : పరిగి మండల పరిధిలోని పెన్నా, జయమంగళి నదుల నుంచి యథేచ్ఛగా అక్రమార్కులు ఇసుకను కొల్లగొడుతూ కాసుల పంట పండిస్తున్నారు. కొడిగెనహళ్లి, పరిగి, పైడేడి, శ్రీరంగరాజుపల్లి, మోదా, నేతులపల్లి నదీ పరివాహక ప్రాంతాల నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఓ వైపు పోలీసు శాఖ దాడులు నిర్వహిస్తూ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను జప్తు చేస్తున్న ఫలితం కానరావడం లేదు. పట్టుబడిన ట్రాక్టర్లకు చిన్నపాటి జరిమానాలు విధించి పంపిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో నదుల నుంచి ఇసుక తరలిస్తూ పట్టుబడితే ఉన్నతస్థాయి నాయకుల నుంచి ఒత్తిడి తెచ్చి ట్రాక్టర్లను విడిపించుకుంటున్నారు.

కొడిగెనహళ్లిలో వైకాపాకు చెందిన ఇద్దరు అన్నదమ్ములు తామేమి చేసిన అడిగేవారే లేరన్న రీతిగా కాలువపల్లి సమీపంలోని జయమంగళి నదిలో తెల్లవారుజాము నుంచే రెండు ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారు. దీంతో జయమంగళి, పెన్నా నదుల స్వరూపమే కోల్పోయాయి. రాత్రి వేళల్లో సైతం ఊటుకూరు, పైడేటి ప్రాంతాల్లో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను కర్ణాటక, సమీప మండలాలకు తరలిస్తున్నారు. **రైతుల ఆందోళన** నదుల నుంచి ఇసుక తరలిస్తుండటంతో నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ బోర్లలో నీటి మట్టం అడుగంటుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డార్క్ ఏరియా మండలంగా గుర్తింపు పొందిన పరిగి మండలంలో ప్రవహించే పెన్నా, జయమంగళి నదుల నుంచి ఇసుక తరలింపును ఇలాగే కొనసాగిస్తే భవిష్యత్తులో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి నెలకొంటుంది. రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి ఇసుక తరలింపును అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

**రాత్రిళ్లు నిఘా ఏర్పాటు చేస్తాం**

అనుమతులు లేకుండా ఎవరైనా ఇసుక ఇతర మండలాలకు తరలిస్తే ట్రాక్టర్లను జప్తు చేసి జరిమానాలు విధిస్తున్నాం. రెవెన్యూ, పోలీసు శాఖ సమన్వయంతో రాత్రివేళల్లో ఇసుక తరలించకుండా ఉండేందుకు గట్టి నిఘా ఏర్పాటు చేస్తాం. హసీనాసుల్తానా, తహసీల్దార్, పరిగి


# నాడితప్పిన ఆసుపత్రి పాలన

కర్నూలు: సర్వజన ఆసుపత్రి నిర్వహణ, పాలన ఇష్టారాజ్యంగా సాగుతోంది. పారిశుద్ధ్య విభాగంలో విధులు నిర్వర్తించాల్సిన ఉద్యోగులు.. వైద్యుల వద్ద కాంపౌండర్లుగా అనధికారికంగా కొనసాగుతున్నారు. భద్రత సిబ్బంది విధులకు హాజరుకాకపోయినా.. తక్కువ మంది వస్తున్నా అందరూ వస్తున్నట్లు నమోదు చేయడం తదితర పలురకాల అవకతవకలు ఇప్పటికే వెలుగుచూశాయి. మందులు, పరికరాలు, ఇంప్లాంట్ల కొనుగోళ్లలో ప్రభుత్వ ఖజానాకు నష్టం వచ్చేలా నిర్ణయాలు తీసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. వైద్యులు ప్రతిరోజూ సాయంత్రం నాలుగు గంటల వరకు విధులు నిర్వర్తించాల్సి ఉండగా మధ్యాహ్నం 2 దాటిన తర్వాత పలువురు వెళ్లిపోతున్నారన్న ఆరోపణలున్నాయి. తాజాగా తనను తన విభాగంలో విధులు నిర్వర్తించే అవకాశం కూడా ఇవ్వడం లేదంటూ పి.అనితారాణి అనే వైద్యురాలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం ఆస్పత్రిలో పాలనకు అద్దం పడుతోంది.

**నిబంధనలకు తిలోదకాలు**

ఇద్దరు గైనకాలజిస్టులు జూన్‌లో అనాటమీ విభాగానికి బదిలీ అయినప్పటికీ కుటుంబ నియంత్రణ విభాగంలోనే కొనసాగుతున్నారు. ప్రభుత్వం తనకు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం బాధ్యతలు అప్పగించాలని సూపరింటెండెంట్‌కు కోరినా పట్టించుకోవడంలేదని డాక్టర్ అనితారాణి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదేమని అడిగితే తననే సరెండర్ చేస్తానని.. కుటుంబ నియంత్రణ విభాగంలో విధులు నిర్వర్తించొద్దని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారని ఆమె వివరించారు.

ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్‌తో వైద్యులను తిట్టిస్తున్నారని.. సీసీ టీవీ



దృశ్యాలు పరిశీలిస్తే వారు వైద్యులతో ఎలా ప్రవర్తిస్తున్నారన్న విషయం తెలుస్తుందని విన్నవించారు.

గైనకాలజిస్టులు, సర్జన్లు, ఎముకల వైద్య నిపుణులు ప్రైవేటు ఆసుపత్రుల్లో పనిచేసుకునేందుకు సూపరింటెండెంట్ సహకరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

చర్మ వ్యాధుల విభాగంలో పనిచేయాల్సిన వైద్యుడు గుండె వైద్య విభాగంలో కొనసాగుతున్నారని, కొందరు సర్జన్లను సంబంధం లేని విభాగాల్లో నియమించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

# నిధుల 'పుర'వళ్లు

ఆదోని : ఉమ్మడి జిల్లాలో పురపాలక సంఘాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. కర్నూలు నగరపాలక సంస్థతో పాటు తొమ్మిది పురపాలక సంఘాలకు మొదటి విడత కింద రూ.43.71 కోట్లు ఇస్తూ కేంద్రం ఉత్తర్వులు ఇచ్చింది. టైడ్, అన్ టైడ్ కింద ఈ మొత్తం మంజూరు చేసింది.

**టైడ్.. రూ.26,22,77,881**

టైడ్ కింద ఇచ్చిన నిధుల్లో చెరి సగం వరకు తాగునీటి సరఫరా, మురుగు నీటి శుద్ధి నిర్వహణకు వినియోగించుకోవాలి. గత ప్రభుత్వంలో అమృత్ పథకం కింద ఇచ్చిన నీటి ప్రాజెక్టులు, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల నిర్మాణాలకు ఖర్చు చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే



నిలిచిపోయాయి. ఈ పనులు పూర్తి చేసేందుకు ఈ నిధులు వినియోగించుకోనున్నారు.

**అన్‌టైడ్.. రూ.17,48,51,740**

అన్ టైడ్ కింద వచ్చే నిధుల్లో పాతిక శాతం సీసీ, బీటీ రహదారుల నిర్మాణాలకు వెచ్చించనున్నారు. మిగిలిన 75 శాతం నిధులతో పురపాలక ఆస్తులు, బహిరంగ స్థలాల సంరక్షణకు వినియోగించుకోవడం, క్రిమిటోరియం నిర్మాణాలు, సామూహిక శౌచాలయాల్లో నీటి వసతి, పార్కుల అభివృద్ధి తదితర పనులు చేయనున్నారు.

# బొప్పాయి పాలు.. విదేశాలకు

చిన్నవంగలి : చాగలమర్రి మండల వ్యాప్తంగా రైతులు అధికంగా బొప్పాయి సాగు చేస్తుంటారు. చిన్నవంగలితో పాటు సమీపంలోని గ్రామాలైన వైఎస్సార్ కడప జిల్లా కానగూడూరు, క్రిష్ణంపల్లె గ్రామాల్లో 1200 ఎకరాల్లో పండిస్తారు. విత్తనం నాటిన కాలం నుంచి తొమ్మిది నెలలకు పంట చేతికొస్తుంది. పండ్ల సేకరణ అనంతరం 13 నెలల తర్వాత మిగిలినవి, ముదురు కాయలకు గాట్లు పెట్టి పాలను సేకరిస్తున్నారు. తెల్లవారుజాము సమయంలోనే కాయలకు గాట్లు పెడితే కేవలం రెండు గంటల్లోనే పాలు ఊరుతుంది. ఇలా సేకరించిన దాన్ని రాయచోటి, రాజంపేటకు చెందిన వ్యాపారులు స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. 20 లీటర్ల పాలు రూ.6 వేలకు విక్రయిస్తున్నారు. ఎకరాకు 3 నుంచి 4 డ్రమ్ముల పాలు సేకరిస్తున్నారు. ఎకరానికి పాల సేకరణ ద్వారా రైతుకు రూ.24 వేల ఆదాయం వస్తుంది. సేకరించిన పాలను పరిశ్రమల్లో మందులు, కాస్మోటిక్స్, సబ్బుల తయారీలో ఉపయోగిస్తున్నారు. బెంగళూరు, చెన్నైతో పాటు నాణ్యతను బట్టి విదేశాలకు సైతం పాలను ఎగుమతి చేస్తున్నారు. బొప్పాయి సాగులో ఎప్పుడైనా ధర పడిపోయినప్పుడు బొప్పాయి పాల సేకరణతో నష్టాల నుంచి రైతులు బయటపడుతున్నారు.

## ఖాళీ స్థలం.. అర్హులకు పట్టం

కర్నూలు : ఇళ్లు కాదు.. ఊళ్లు నిర్మిస్తున్నామంటూ గత ప్రభుత్వం 'గూడు'పుఠాణి నడిపింది.. సెంటు, సెంటున్నర చొప్పున ఇళ్ల స్థలాలు కేటాయించింది. పట్టాలు పొందిన వారిలో ఎక్కువమంది అనర్హులే ఉండటం.. స్థలాలు గ్రామాలకు దూరంగా ఉండటంతో చాలామంది నిర్మించుకోలేదు. ఆయా లేఅవుట్లలో ఖాళీగా ఉన్న స్థలాలను పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల చొప్పున అర్హులకు ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతోంది.

**రద్దు చేసి.. కొత్త వారికిస్తారా**

గత ప్రభుత్వంలో అందరికీ ఇళ్లు పథకం కింద ఉమ్మడి జిల్లాలో 1,04,893 మందికి పట్టాలు మంజూరు చేశారు. 18,623 మంది పట్టాలు తీసుకోలేదు. పట్టాలను తీసుకున్నవారిలో 63,622 మంది ఇప్పటికీ నిర్మాణాలు చేపట్టలేదు.లబ్ధిదారులు 24 నెలల్లోగా ఇళ్లు నిర్మించుకోవాల్సి ఉంది. ఐదేళ్లయినా చాలామంది పనులు చేపట్టలేదు.



వారి పట్టాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసి అర్హులకు ఇస్తుందా? లేక పాతవారే ఇళ్లు కట్టుకునేలా అవకాశం ఇస్తుందా అన్నది తేలాల్సి ఉంది.

**2,609 మంది అనర్హులకు ఇచ్చేశారు**

నివేశన స్థలం లేని నిరుపేదలకు పట్టాలు పంపిణీ చేయాల్సి ఉండగా.. గత ప్రభుత్వ హయాంలో వైకాపా నాయకులు, వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు కలిసి ఒకట్రెండు ఇళ్లున్న వారికి సైతం పట్టాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విజిలెన్స్ అధికారులతో విచారణ చేయించగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. కర్నూలు జిల్లాలో 921, నంద్యాల జిల్లాలో 1,688 మంది కలిపి మొత్తం 2,609 మందిని అనర్హులుగా తేల్చారు.

**కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు** 'హౌసింగ్ ఫర్ ఆల్' పథకానికి కూటమి ప్రభుత్వం ఈ ఏడాది ఆగస్టులో శ్రీకారం చుట్టింది. ఇంటి స్థలాల లేని పేదల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24,118 దరఖాస్తులు రాగా.. అందులో 2,246 వరకు ఆమోదం తెలిపారు. 2,770 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన వాటిపై విచారణ చేయాల్సి ఉంది.

## అనుగ్రహించాలి.. ఆ'మోదీంచాలి

శ్రీశైలం : శ్రీశైల క్షేత్ర అభివృద్ధికి పలు ఆటంకాలు ఎదురవుతున్నాయి. బృహత్తర ప్రణాళిక అమలుకు నిధుల కొరత వేధిస్తోంది. క్షేత్ర పరిసరాలు నల్లమల అడవుల్లో ఉండడంతో రహదారుల విస్తరణ కష్టసాధ్యంగా మారింది. శ్రీశైలానికి ఈనెల 16న ప్రధాని నరేంద్రమోదీ రానున్న నేపథ్యంలో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమవుతాయని దేవస్థానం అధికారులు ఆశలు పెట్టుకున్నారు.

**మాస్టర్ ప్లాన్ మాటేమిటి..**

శ్రీశైల క్షేత్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు 2010లో మాస్టర్‌ప్లాన్ అమలుకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో రూ.600 కోట్లతో ప్రతిపాదించగా.. కేవలం రూ.200 కోట్లతో పనులు చేశారు.

ముఖద్వారం నుంచి సాక్షి గణపతి ఆలయం వరకు వీరభద్ర జంక్షన్ పేరుతో నాలుగు వరుసల రోడ్డుగా విస్తరించాలన్న ప్రతిపాదన ఉంది. ఇక్కడ అలిపిరి తరహాలో టోల్‌గేటు ఏర్పాటుచేయాలని భావిస్తున్నారు. అటవీ భూమి అవసరం కావడంతో ఆచరణ సాధ్యం కావడం లేదు.

**వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య**

శ్రీశైలంలో తరచూ ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. శ్రీశైలం ఆనకట్ట వద్ద నుంచి బ్రహ్మగిరి (తెలంగాణ ప్రాంతం) వరకు వందలాదిగా



వచ్చే కార్లు, ఇతర వాహనాలు ఘాట్ రోడ్డులో గంటల తరబడి ఆగిపోతున్నాయి. బ్రహ్మగిరి నుంచి ఆనకట్ట స్విచ్ యార్డు వరకు కొత్త వంతెన నిర్మాణానికి రూ.500 కోట్లతో నేషనల్ హైవే అథారిటీ ప్రతిపాదించింది.గతంలో హెలీ టూరిజం ప్రవేశపెట్టినప్పటికీ స్థలం కొరతతో ఆపేశారు. చిన్నపాటి విమానాశ్రయం ఏర్పాటుచేసినా అన్ని జ్యోతిర్లింగాలకు అనుసంధానం చేసినట్లవుతుందని భక్తులు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో వీటన్నింటికీ నిధులు మంజూరు చేయాలని పలువురు విన్నవిస్తున్నారు.


**తిరుమల, తిరుపతి తరహాలో..**

శ్రీశైలంలోని నివాసాలను సున్నిపెంటకు తరలించేందుకు 2016లో నిర్ణయం తీసుకున్నారు. శ్రీశైలాన్ని తిరుమల, సున్నిపెంటను తిరుపతి తరహాలో అభివృద్ధి చేయాలని సంకల్పించారు. శ్రీశైలం డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేయాలని భావించారు. దీనికి కేంద్రం సహకారం అవసరమని యంత్రాంగం యోచిస్తోంది.

సున్నిపెంటలో జలవనరుల శాఖకు చెందిన 480 ఎకరాలను శ్రీశైల దేవస్థానానికి కేటాయించారు. శ్రీశైలంలో నివసించే 3,250 మంది నిరుపేదలకు ఎన్టీఆర్ గృహాలు నిర్మించేందుకు పట్టాలు పంపిణీ చేశారు. పునరావాస ప్యాకేజీ అమలుచేస్తే ఇళ్ల నిర్మాణానికి పేదలు ముందుకొస్తారు.

సున్నిపెంటలో రూ.70 కోట్లతో దేవస్థానం రెగ్యులర్ ఉద్యోగుల కోసం క్వార్టర్స్ నిర్మించారు. శ్రీశైలం-సున్నిపెంట మధ్య 8 కి.మీ. దూరం ఉంది.. వంతెన నిర్మిస్తే 2.5 కి.మీ. దూరమే పడుతుంది. వంతెన పనులకు రూ.20 కోట్లవుతుంది. కేంద్రం చేయూతనివ్వాల్సి ఉంది. తీగల వంతెన నిర్మిస్తే పర్యాటకులను ఆకట్టుకోవచ్చు.

## రైతుల చింత.. కష్టాలు తొలగిస్తే నిశ్చింత



పుంగనూరు : ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుమారు 2,774 హెక్టార్లలో చింత తోటలు ఉన్నాయి. పంట చేతికి రాకముందే పెద్ద వ్యాపారులు కొనుగోలు చేసి పర్యవేక్షణ బాధ్యతలు రైతులకు అప్పగిస్తారు. దీంతో ధర పెరిగినా రైతుకు ఎలాంటి ఉపయోగం ఉండటం లేదు. ప్రస్తుతం నిల్వలు బడా వ్యాపారులు, శీతల గిడ్డంగుల యజమానుల ఆధీనంలో ఉన్నాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో మళ్లీ పంట కోతకు వస్తుంది. అప్పటి వరకు ధరలు తగ్గే అవకాశం లేదు.

చింత పండు ధరలు ఒక్కసారిగా పెరిగాయి. గత సీజన్‌లో వర్షాభావంతో తమిళనాడు, తెలంగాణ, మహారాష్ట్రలో దిగుబడులు తగ్గడంతో ఆ ప్రభావం ధరలపై పడింది. మన రాష్ట్రంతో పాటు కర్ణాటకలో పంట బాగానే పండినా బయటనుంచి తక్కువగా దిగుమతి కావడంతో నెలరోజుల వ్యవధిలో పరిస్థితి మారిపోయింది.

**25 వేల టన్నుల నిల్వలు..** పుంగనూరు, హిందూపురం, గుంటూరు, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాల నుంచి ఎగుమతులు, దిగుమతులు జరుగుతాయి. జిల్లాలో పుంగనూరు, పలమనేరు ప్రాంతాల్లోనే గిడ్డంగులు ఉన్నాయి. వీటిలో 25 వేల టన్నులు నిల్వ ఉంది.

**ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు**

సమస్య: రైతులు ఎక్కువగా చింతను కాకి, ముడిపంటగా విక్రయిస్తారు. అంటే చెట్టు నుంచి పండు కొట్టి నేరుగా అమ్మడం. ఇది రైతుకు తక్కువ లాభం అందిస్తుంది. ఎందుకంటే వినియోగదారులు, పరిశ్రమలు ఎక్కువ ధర ఇవ్వడానికి ప్రాసెస్ చేసిన ఉత్పత్తిని కోరుతున్నాయి.

పరిష్కారం: ప్రాసెసింగ్ యూనిట్లు: గ్రామీణ ప్రాంతాల్లో, రైతు సంఘాల వద్ద చింతపండు శుభ్రపరచడం, వేపడం, గింజలు తొలగించడం తయారీ చేసే యూనిట్లను ఏర్పాటు చేయాలి.

మార్కెటింగ్ మద్దతు: ప్రాసెస్ చేసిన ఉత్పత్తులను స్థానికంగా, ఎగుమతి మార్కెట్లకు పంపే విధంగా లాజిస్టిక్స్ సౌకర్యాలు కల్పించాలి.

ఉప ఉత్పత్తుల విక్రయం: గింజలు, ఆకులు, పళ్లపొరలు ఫార్మాస్యూటికల్, ఆహారం, పరిశ్రమలకు అందించి అదనపు ఆదాయం పొందొచ్చు. చెట్టు అన్ని భాగాలతో రైతులకు లాభాలు కల్పించాలి.

చిత్తూరు జిల్లాలో చింత రైతులకు కావాల్సింది: చెట్ల సంరక్షణ ం ప్రాసెసింగ్ యూనిట్లు మార్కెట్ చేయూత

**ఉమ్మడి జిల్లాలో..**

2,774 హెక్టార్లు చింత పంట విస్తీర్ణం

20 వేల టన్నులు ఏటా లభ్యమయ్యేది

30 వేల టన్నులుఇతర రాష్ట్రాల నుంచి వచ్చేది

40 వేల టన్నులు గోదాముల్లో నిల్వలు

## తగ్గించినా తగ్గేదేలే..!




తిరుపతి : కేంద్రం వస్తు సర్వీసు పన్నులు (జీఎస్టీ) తగ్గించినా.. ఆ ఫలాలు వినియోగదారులకు చేరడం లేదు. గత నెల 21 నుంచి తగ్గింపు జీఎస్టీ అమల్లోకి వచ్చినా.. వ్యాపారులు ఇప్పటికీ ఎంఆర్పీకే విక్రయిస్తున్నారు. అధికారులు, నాయకులు అవగాహన కల్పిస్తున్నా.. క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితి నెలకొంది.

**బిల్లులో కానరాని బెనిఫిట్**

వాహనాలు, ఎలక్ట్రికల్ తదితర లగ్జరీ వస్తువులపై 26 శాతం నుంచి 18 శాతానికి, కొన్ని రకాలపై 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. ఔషధాలపై 12 శాతం ఉండగా, పూర్తిగా రద్దు చేశారు. గత ఎమ్మార్పీ ప్రకారం బిల్లు వేయాల్సి వస్తే జీఎస్టీ బెనిఫిట్ నమోదు చేసి మిగిలిన మొత్తం వినియోగదారుల నుంచి తీసుకోవాలి. ఇలాకాకుండా ఎమ్మార్పీనే తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**కనిపించని బోర్డులు**

తగ్గింపు జీఎస్టీ ఫలాలు అందని వినియోగదారులు ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియడం లేదు. చిత్తూరు, తిరుపతి జిల్లాలోని 9 సర్కిల్ జీఎస్టీ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్కులు పెట్టినట్లు అధికారులు ప్రకటించారు. కలెక్టరేట్లో కమాండ్ కంట్రోల్ డెస్క్ ఏర్పాటు చేశారు. అక్కడికి వెళ్లి ఫిర్యాదు చేయాలి. ఫోన్ నంబర్లు ఇవ్వకపోవడంతో చాలామంది మిన్నకుండిపోతున్నారు. చాలా దుకాణాల్లో తగ్గింపు బోర్డులు పెట్టనేలేదు.

ఫిర్యాదు చేయాల్సిన టోల్ ఫ్రీ నంబరు: 87126 31280

**తగ్గించకపోగా బెదిరింపులు**


ఇంటి వైరింగ్‌కు తిరుపతి శ్రీదేవి కాంప్లెక్స్‌లోని ఓ ఎలక్ట్రికల్ షాపుకెళ్లా. రూ.65,300 బిల్లు అయింది. జీఎస్టీ రూపాయి కూడా తగ్గలేదు. మళ్లీ బిల్లు పెరుగుతుందని బెదిరించడంతో రూ.50వేలు చెల్లించి కొంత సరకు తీసుకొన్నా. జీఎస్టీ తగ్గినా.. ఫలం అందలేదు.

దామోదరం నాయుడు, వేదాంతాపురం

**అవగాహన కల్పిస్తున్నాం..**జీఎస్టీ తగ్గింపు రేట్లతో వస్తువులు విక్రయించాలి వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇందుకు ఆయా దుకాణాల ముందు తగ్గింపు రేట్ల పట్టికల ఏర్పాటుకు ఆదేశించాం.

నాగేంద్ర, కమర్షియల్ అడిషనల్ కమిషనర్, తిరుపతి

## అనగనగా ఓ బకింగ్‌హామ్



సూళ్లూరుపేట: బకింగ్‌హామ్ కాలువ పేరు వినని వారు ఉండరు. ఇప్పుడు అనగనగా ఓ కాలువుండేది.. బ్రిటిష్ కాలంలో జల రవాణాకు ఎంత కీలకంగా ఉపయోగపడిందని నేటి తరానికి చెప్పుకోవాల్సిన దుస్థితి. ఈ కాలువ ఆనవాళ్లు లేకుండా ఆక్రమణలకు గురవుతోంది. దీని ఆధునికీకరణకు గతంలో చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

**సర్వే చేసినా..**

కొన్నేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం జల రవాణాకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో జిల్లా మీదుగా వెళ్లే జాతీయ జల రవాణా మార్గం-4 బకింగ్‌హామ్ కెనాల్ తెరపైకి వచ్చింది. 2017లో ఇంజినీర్లు సర్వే చేసి రూ.3,500 కోట్లతో డీపీఆర్‌లు తయారు చేసి కేంద్రానికి పంపించారు.

బకింగ్‌హామ్ కెనాల్‌లో పడవలు వెయ్యి టన్నులతో ఎదురెదురుగా ఏకకాలంలో ప్రయాణించాలి. రెగ్యులేటర్లు, లాక్ లాంఛర్ల వద్ద ఒక్కొక్కవైపు 12 మీటర్ల చొప్పున ఇరువైపులా 24 మీటర్లు ఉండాలి. కాలువలో నీటి ఉపరితలం నుంచి ఏడు మీటర్ల మేర ఖాళీ జాగా అవసరం. కెనాల్ 140 మీటర్ల వెడల్పు, 6 మీటర్ల లోతు ఉండాలి. వంతెనలు, యూటీ టెక్నిల్(అండర్ టెక్నిల్) అక్విడక్టులు, సూపర్ పాసేజ్‌లు, రోడ్ల నిర్మాణం పునఃనిర్మించాలి.

జల రవాణాకు కాలువ విస్తరణకు టెర్మినల్స్, గోదాములు, ఇరువైపులా రోడ్లకు కొంత భూమి కావాలి.

కెనాల్‌లో నీటి ప్రవాహ వేగం అలైన్‌మెంట్ సమగ్ర సర్వే చేయాలి.

**ఘనమైన చరిత్ర**ఈ కాలువ తవ్వకాన్ని 1803లో ప్రారంభించి 1899లో పూర్తి చేశారు.నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలో 178 కి.మీ.లు మేర కెనాల్ విస్తరించింది.

## వ్యర్థం.. ఇదే పరమార్థం

చిత్తూరు : రాష్ట్రంలోని డంపింగ్ యార్డుల్లో గత ఐదేళ్లలో నగరపాలికలు, పురపాలికల్లో 85 లక్షల టన్నుల చెత్తను తొలగించ లేదు. ఈ ఏడాది డిసెంబరు నాటికి విభజించి కాలుష్య నియంత్రణ చర్యలు చేపడుతున్నాం. అసెంబ్లీ పురపాలక శాఖ మంత్రి నారాయణ ఉమ్మడి జిల్లాలోని చిత్తూరు, తిరుపతి కార్పొరేషన్లు, పుత్తూరు, శ్రీకాళహస్తి, గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, కుప్పం, పలమనేరు, నగరి, పుంగనూరు పురపాలికలను స్వచ్ఛతగా మార్చనున్నారు. ఈ పట్టణాల్లో పోగయ్యే వ్యర్థాలను జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్జీటీ) ఆదేశాలతో మూడు నెలలుగా డంపింగ్ యార్డుల్లో రీసైక్లింగ్ చేపట్టారు. కాలుష్యాన్ని తగ్గించి పట్టణా లకు ఊపిరి పోయనున్నారు.కూటమి ప్రభుత్వం ఎన్జీటీ మార్గదర్శకాలను పాటిస్తూ యంత్రాల ద్వారా వ్యర్థాల నుంచి మట్టి, రాళ్లు, ప్లాస్టిక్ వేరు చేస్తున్నారు. అక్టోబరు2 నాటికి దీన్ని పూర్తి చేసి యార్డుల్లో ఒక్క గుట్ట లేకుం డా చేయాలన్న లక్ష్యంతో ప్రారంభించారు. అయితే కొన్ని నగర, పురపాలికల్లో వ్యర్థాలు అనుకున్న దాని కంటే ఎక్కువగా ఉండటంతో ఆలస్యం అవుతోంది. 2025 డిసెంబరు నాటికి లక్ష్యంగా నిర్దేశించారు. ఇది



పూర్తయితే భూ, జల కాలుష్యం తగ్గిపోతుంది. వ్యర్థాలు కాల్చే సమస్య ఉండదిక.వ్యర్థాలు 12 లక్షల టన్నులు

ఇప్పటి వరకు విభజన 6.54 లక్షల టన్నులు

ఇంకా చేయాల్సింది 5.46 లక్షల టన్నులు

## తట్టెడు మట్టేసి.. నిధులు మింగేసి

పత్తికొండ: ఉమ్మడి కర్నూలు జిల్లాలో చెరువుల అభివృద్ధి కాగితాలకే పరిమితమైంది. నిధులు మంజూరు చేసినా పనులు చేయకుండా కాజేశారే తప్ప ఎలాంటి పనులు చేపట్టలేదు. చెరువుల్లో తూతూమంత్రంగా మట్టి పనులు చేసి మమ అనిపించారు. అప్పటి పాలకులు, ప్రజాప్రతినిధులకు మామూళ్లు ఇచ్చి అన్నీ పూర్తి చేసినట్లు సొమ్ము మింగేశారు. హంద్రీనీవా కాలువ నీటితో ఉమ్మడి జిల్లాలోని మద్దికెర, తుగ్గలి, పత్తికొండ, కృష్ణగిరి, డోన్, ప్యాపిలి మండలాల్లోని 68 చెరువులను నింపే కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా గత వైకాపా ప్రభుత్వం కొన్ని చెరువులను గుర్తించి వాటిని అన్నివిధాలా అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. పత్తికొండలో 3 చెరువులు, తుగ్గలిలో 12, మద్దికెరలో ఒక చెరువును అభివృద్ధి చేసేందుకు గత సర్కారు నిధులు మంజూరు చేసింది. చెరువుల్లో పనుల పేరుతో నిధులు పక్కదారి పట్టించారు.

**శిథిలావస్థలో తూములు**

650 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మదనంతపురం చెరువు కింద 750 ఎకరాల ఆయకట్టు ఉంది. లింగాల వాగు నుంచి దీనికి నీరొస్తుంది. ప్రస్తుతం తూములు శిథిలమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో రూ.4.50 కోట్లతో పనులు చేపట్టినా తూముల మరమ్మతులు పట్టించుకోలేదు. చెరువులో మట్టి పని, ఎడమ కాలువ పునర్నిర్మాణం, స్లూయిస్‌ల పనులు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. కొంత మేరకు చెరువులో మట్టి తొలగింపు పనులు చేశారు. ఆపై ఎలాంటి నిర్మాణం చేపట్టలేదు.



**రూ.26.50 కోట్లు మంజూరు**

మద్దికెర, తుగ్గలి మండలాల పరిధిలో 13 చెరువులను అభివృద్ధి చేసేందుకు గత వైకాపా ప్రభుత్వం రూ.26.50 కోట్లు మంజూరు చేసింది. మద్దికెర మండలం మదనంతపురం చెరువుకు రూ.4.50 కోట్లు, తుగ్గలి మండలం జొన్నగిరి చెరువుకు రూ.5.50 కోట్లు, మిగిలిన 11 చెరువులకు రూ.16.50 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో పనులు చేపట్టామని చెబుతున్నా ఎక్కడా కనిపించడం లేదు.

**పూర్తిగా విస్మరించారు: తిమ్మన్న, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షుడు, జొన్నగిరి**

జొన్నగిరి చెరువును వైకాపా హయాంలో రూ.5.50 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని అప్పటి అధికారులు చెప్పి ప్రజలను, రైతులను మభ్యపెట్టారు. ఇక్కడ ఎలాంటి పనులు జరగలేదు. దీంతో కట్ట పూర్తిగా దెబ్బతింది. నీరు వృథా అవుతోంది. ఫలితంగా రైతులు నష్టపోయే పరిస్థితి నెలకొంది.నీటిపారుదల శాఖ ఏఈ ధర్మేంద్ర మాట్లాడుతూ జొన్నగిరి చెరువులో గతంలో వివిధ పనులు చేపట్టారని.. వర్షాలకు కట్ట శిథిలమైందని చెప్పారు. మరమ్మతుల కోసం ఎఫ్‌డీఆర్ నిధుల కింద రూ.7 లక్షలకు ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు.

## అడుగులు పడుతున్నాయ్

నంద్యాల : నంద్యాల పట్టణంలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమై ఆగిపోయిన తెలుగుగంగ, ఎస్సార్బీసీ సర్కిల్-1 కార్యాలయ భవన నిర్మాణాలు మరోసారి తెరపైకి వచ్చాయి. ఈ పనులను తిరిగి ప్రారంభించేలా కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. నంద్యాల కేసీ కాలువ కాంపౌండ్‌లోని తెలుగుగంగ క్వార్టర్స్ స్థలంలో తెలుగుగంగ కార్యాలయ పరిపాలన భవనం, ఎస్సార్బీసీ సర్కిల్-1 కార్యాలయం భవన నిర్మాణాలకు సంబంధించి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్య భవనాల విభాగంలో చేర్చింది. ఇటీవలే ఈ భవనాల నిర్మాణాలకు సంబంధించిన దస్త్రాలను జలమండలి శాఖ ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు.

శిథిలావస్థకు చేరుకుని..

40 ఏళ్ల కిందట నిర్మించిన తెలుగుగంగ కార్యాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. కార్యాలయంలోని కొన్ని భవనాల పైకప్పులు ఎప్పుడూ కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఎస్సార్బీసీ కాలనీలోని ఎస్సార్బీసీ సర్కిల్-1 భవనం పరిస్థితి ఇలానే ఉంది. ఈ రెండు కార్యాలయాల్లో విధులు నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది భయపడుతున్నారు. కనీసం మరుగుదొడ్ల సౌకర్యం కూడా లేదు.

**నిధులివ్వడంలో నిర్లక్ష్యం**

టీజీపీ, ఎస్సార్బీసీ సర్కిల్-1 కార్యాలయ భవన నిర్మాణాలకు



సంబంధించి గత ప్రభుత్వ హయాంలో 2021లో రూ.5.25 కోట్లు మంజూరయ్యాయి. గుత్తేదారుడికి పనులు అప్పగించారు. నిర్మాణంలో భాగంగా పాత క్వార్టర్లను కూల్చివేశారు. నిర్మాణ పనులు కొంతమేర జరిగాయి. అప్పటి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ఆగిపోయాయి. మరోవైపు నిర్మాణ పనుల పర్యవేక్షణ బాధ్యతలను నీటి పారుదల శాఖ విభాగానికి ఇవ్వకుండా ఇష్టానుసారంగా కేటాయించారు.

**గతంలో స్థలం ఎంపిక చేసినా..**

2005లో ఇదే క్వార్టర్స్ ప్రాంతంలో రాయలసీమ స్థాయి జల వనరుల కాంప్లెక్స్ నిర్మించాలని అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలు తయారు చేసింది కేసీ కాల్వ, తెలుగుగంగ, ఎస్సార్బీసీ, గురు రాఘవేంద్ర, ఎల్ఎల్‌సీ, తుంగభద్ర, జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ తదితర అన్ని ప్రాజెక్టుల సీఈలు, ఎస్ఈల కార్యాలయాలు ఇక్కడే ఏర్పాటు చేసేలా ప్రయత్నాలు జరిగాయి. ఆ తర్వాత అడుగులు పడలేదు. అప్పట్లో ఎంపిక చేసిన స్థలంలోనే ప్రస్తుతం రెండు సర్కిళ్ల కార్యాలయాలను నిర్మించనున్నారు.

# ఊపిరి తీస్తున్న ఊబలు..

రాజమహేంద్రవరం : ఇటీవల కాలంలో గోదావరి నదిలో ప్రమాదశాతు జారిపడి గల్లంతైన వారి సంఖ్య పెరుగుతోంది. గత రెండు వారాల్లోనే నలుగురు మృతి చెందారు. ఈ ఏడాది 20 మందికి పైగానే నదిలో గల్లంతై ప్రాణాలు కోల్పోయారు. ఆయా ఘాట్‌ల వద్ద భద్రతా చర్యలు తీసుకోకపోవడంతోపాటు నదిలో పూడిక తీత (డ్రెడ్జింగ్)ను యంత్రాంగం విస్మరించడమే దీనికి కారణాలవుతున్నాయి. నదీ సమతుల్యత కాపాడే ప్రక్రియలో భాగంగా ఏటా నదిలో పూడిక తీత చేయాల్సి ఉంది. పుష్కరాలు సమీపిస్తున్నా.. దీనిపై నీటిపారుదల శాఖ దృష్టిసారించకపోవడం గమనార్హం.

**ఏటా 2 శాతం మేటలు**

ఏటా నదికి వరద తాకిడి ఉంటుంది. ఉత్తరాది రాష్ట్రాల్లో వర్షాల



కారణంగా నదిలోకి వరద నీరు చేరుతుంది. ఏటా రెండు శాతం మేర నదిలో ఇసుక మేట వేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఏటా నీరు నిల్వ ఉన్న చోట మేటలు తగ్గించేందుకు డ్రెడ్జింగ్ చేస్తారు. టెండర్లు పిలిచి యంత్రాల సాయంతో ఈ ప్రక్రియ చేపడతారు. ప్రధానంగా ఘాట్‌ల వద్ద పూడిక తొలగిస్తుండాలి.లేకపోతే నాచు పెరిగి, నదిలోకి దిగిన వారు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది.

**సమీపిస్తున్న పుష్కరాలు**

ఇప్పటికీ నదిలో పూడిక తొలగింపు పనులు చేపట్టకపోవడంతో రానున్న పుష్కరాలకు భక్తులకు భద్రత ప్రశ్నార్థకంగా మారింది. గత పుష్కరాలకు ముందుగానే ఈ ప్రక్రియ పూర్తి చేశారు. ఓఎన్‌జీసీ సంస్థకు చెందిన రెండు యంత్రాలు నదిలో నెల రోజుల పాటు ఈ పనులు చేపట్టాయి. నదిలో మేటలు, ఊబలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

# ఇళ్ల స్థలాల లెక్క తేలింది

కాకినాడ : జిల్లాలోని జగనన్న కాలనీల్లో ఖాళీ స్థలాల లెక్క తేలింది. గత ప్రభుత్వంలో జిల్లా వ్యాప్తంగా 1,500 ఎకరాల భూమిని సుమారు రూ.1,300 కోట్లు వెచ్చించి అప్పట్లో కొనుగోలు చేశారు. మార్కెట్‌ధర కన్నా ఎక్కువకు కొని రూ.కోట్లలో కమీషన్లు కొట్టేశారు. అప్పట్లో పట్టాలు ఇచ్చిన పేదలకు ఈ స్థలాలను అప్పగించకుండా నిరుపయోగంగా వదిలేశారు. దీంతో వేల సంఖ్యలో పేద కుటుంబాలు గూడుకు దూరమయ్యాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక.. వాటిల్లో ఖాళీ స్థలాల గుర్తింపునకు చర్యలు చేపట్టారు. మండలాల వారీగా రెవెన్యూ శాఖ ద్వారా లెక్క తేల్చారు. వీటిని ప్రస్తుతం అందరికీ ఇళ్ల పథకంలో దరఖాస్తు చేసిన పేదలకు పల్లెల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున కేటాయింపునకు కసరత్తు మొదలుపెట్టారు.

**కొత్తగా 25,664 దరఖాస్తులు**

కూటమి ప్రభుత్వం వచ్చాక.. అందరికీ ఇళ్లు పథకం కింద అర్హులైన



పేదల నుంచి ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణంలో 8,600, పట్టణాల్లో 17,064 మంది దరఖాస్తు చేశారు. వీరికి పల్లెల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున కేటాయింపునకు 598 ఎకరాలు అవసరమని గుర్తించారు. ప్రస్తుతం జగనన్న కాలనీల్లో 89.49 ఎకరాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. మిగతా భూమిని సేకరించి, త్వరలో అందజేతకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించామని, అవసరమైన భూములకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని డీఆర్వో వెంకటరావు తెలిపారు.

గతంలో పట్టాలు పొందిన లబ్ధిదారులు గృహ నిర్మాణాలు ప్రారంభించకపోయినా.. స్థలాలు వెనక్కి తీసుకునే ప్రతిపాదన ఏమీ లేదని అధికారులు చెబుతున్నారు.

ఈ కాలనీల్లో పక్కపక్కనే రెండు ప్లాట్లు ఖాళీగా ఉంటే వాటినే కొత్తవారికి కేటాయిస్తారని చెబుతున్నారు.

ఇప్పటికే పట్టాలు పొందిన వారిలో అనర్హులు ఉంటే.. వారిని తొలగించే అంశం.. ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది.

# కొత్త గురువులొస్తున్నారు..!

పి.గన్నవరం : కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని మెగా డీఎస్సీ ప్రకటించి విజయం సాధించిన ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించింది. వీరికి ఈ నెల 3 నుంచి ప్రారంభమైన శిక్షణ తరగతులు 10 వరకూ కొనసాగనున్నాయి. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో మెగా డీఎస్సీ ప్రకటించక ముందు 580 మంది ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాల్సి ఉండగా ఈ ఏడాది మేలో బదిలీలతో 117 పోస్టులు ఖాళీ అయ్యాయి. మొత్తం 697 పోస్టులు నూతన ఉపాధ్యాయుల రాకతో భర్తీ కానున్నాయి. ఈ నెల 13 నుంచి కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరతారు. గత ప్రభుత్వం డీఎస్సీ ప్రకటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. సంవత్సరాల తరబడి పాఠశాలల్లో వివిధ సబ్జక్టు టీచర్లు లేకపోవటంతో విద్యావ్యవస్థ గాడి తప్పింది.

'మెగా డీఎస్సీతో జిల్లాలో ఖాళీగా ఉన్న 697 ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ అవుతాయి. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీరుతుంది. ప్రస్తుతం నూతన ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణ తరగతులు 10వ తేదీతో ముగుస్తాయి. 13 నుంచి ఆయా పాఠశాలలకు కేటాయిస్తాం.' అని డీఈవో షేక్ సలీంబాషా అన్నారు.

జిల్లాలో పాఠశాలలు 1,563
మొత్తం విద్యార్థులు 89,672
బాలురు 42,799 బాలికలు 46,873
భర్తీ కానున్న పోస్టులు 697
ఎస్‌జీటీ తెలుగు 234

# పాలసముద్రంలో మోగనున్న 'బెల్'



సోమందేపల్లి : దేశంలో రక్షణ శాఖకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీహెచ్‌ఈఎల్)ను గోరంట్ల మండలంలోని పాలసముద్రం సమీపంలో నిర్మించేందుకు 2014లో అప్పటి కేంద్ర రక్షణశాఖా మంత్రి మనోహర్‌పారికర్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు భూమిపూజ చేశారు. అనంతరం చాలాకాలం పనులు ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రస్తుత కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ చొరవతో నాసిన్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇండైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ నార్కొటిక్స్) శిక్షణ కేంద్రం ప్రారంభమైంది. నాసిన్‌కు ఆనుకుని ప్రస్తుతం బీహెచ్‌ఈఎల్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. అంతర్గత రహదారులు, ప్రహరీ పనులు పూర్తయ్యాయి. మరోవైపు సౌరశక్తి ఉత్పత్తి ప్రారంభమైంది. ప్రస్తుతం ప్రధాన ద్వారం, ఆవరణలో అవసరమైన భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

**మరో మైలురాయి దాటుతున్న శ్రీసత్యసాయి జిల్లా**

దేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన బీహెచ్‌ఈఎల్ కంపెనీ శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలో ఏర్పాటు అవుతుండటంతో జిల్లాకు మరోఖ్యాతి లభించబోతోంది. అందులోనూ పెనుకొండ నియోకజవర్గం అభివృద్ధిలో మరో పదడుగులు ముందుకు పడనుంది. ఇప్పటికే అంతర్జాతీయ స్థాయిలో కియా కార్ల కంపెనీ, అనుబంధంగా 18 సంస్థలు, మరోవైపు నాసిన్ కొనసాగుతున్నాయి. వీటితో పాటు బెల్ కంపెనీ నిర్మాణంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

సంస్థ: భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్
ఎక్కడ: గోరంట్ల మండలం, పాలసముద్రం పంచాయతీ, మిషన్‌తండా వద్ద
సేకరించిన భూమి: 913 ఎకరాలు

# పురం స్థలం.. పరాధీనం



గుత్తి : పురపాలికల్లో పాఠశాలలు, ఆలయాలు ఇతర ప్రజల అవసరాల కోసం కేటాయించిన రూ.కోట్లు విలువైన స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాల్సిన అధికారులు కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు పట్టణాల్లో రాజకీయ అండదండలున్న కొందరు నాయకులు భూములను కబ్జా చేస్తున్నారు. దర్జాగా ఇళ్లు, భవంతులు నిర్మిస్తున్నారు. పట్టణ ప్రణాళిక అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అధికారుల అలసత్వాన్ని ఆసరాగా చేసుకుంటూ అక్రమార్కులు యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు.

బోగస్ పట్టాలు సృష్టించి.. నిర్మాణాలు

గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు పట్టణాల్లో మొత్తం రూ.13.50 కోట్ల స్థలాలు పరులపాలయ్యాయి.

గుత్తిలోని బీసీ కాలనీలో ఓ నాయకుడు రజకులతో సొమ్ము వసూలు చేసుకుని బోగస్ పట్టాలు సృష్టించి ఇప్పించాడు. అక్కడ రూ.కోటి విలువైన స్థలంలో అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి.

తాడిపత్రి రోడ్డులో సుమారు రూ.50 లక్షలు విలువైన స్థలాన్ని ఓ ప్రజాప్రతినిధి ఆక్రమించాడు. ఆ స్థలంలో భవనాలు, దుకాణ సముదాయాన్ని నిర్మించి అద్దెకు ఇచ్చాడు. ప్రతినెలా బాడుగల రూపంలో పెద్ద ఎత్తున వసూలు చేస్తున్నాడు. గుత్తి మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడే తాడిపత్రిరోడ్డులో రిజర్వుడు స్థలం కబ్జాకు గురైంది.

గుంతకల్లు పట్టణంలోని మోదీనాబాదు, తిలక్‌నగర్, మారుతీనగర్‌లలో రూ.6 కోట్లు విలువైన రిజర్వుడు స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయి. తాడిపత్రిలోని శ్రీనివాసనగర్, సంజీవనగర్‌తోపాటు ఆరు కాలనీల్లో పరిస్థితి ఇలాగే ఉంది.

అక్రమంగా రిజిస్ట్రేషన్లు

రిజర్వుడు స్థలాల్ని అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటూ, ఇతరులకు విక్రయిస్తూ రూ.కోట్లు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు సైతం ప్రభుత్వానికి ఫీజులు వస్తే చాలన్నట్లు పరిశీలించకుండానే రిజిస్ట్రేషన్ పూర్తి చేస్తున్నారు. ఈ వ్యవహారంలో అధికారులకు మాముళ్లు అందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

రిజర్వుడు స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో ఆక్రమణలను గుర్తించి నిబంధనల మేరకు వాటిని తొలగిస్తాం. గుత్తిలో పంచాయతీగా ఉన్నప్పుడే ఆక్రమణలు జరగడంతో ఇప్పుడు ఏమీ చేయలేకపోతున్నాం.

మారుతీప్రసాద్, టీపీవో, గుత్తి

# బిందు సేద్యానికి ఊరట



అనంతపురం : రాష్ట్రంలోనే ఉమ్మడి అనంతపురం జిల్లాలో బిందు సేద్యం పరికరాలు ఎక్కువగా మంజూరు చేస్తున్నారు. పరికరాలకు జీఎస్టీ చెల్లింపు రైతులకు పెనుభారంగా మారింది. సుమారు ఏడేళ్ల కిందట 18 శాతం ఉన్న జీఎస్టీని కేంద్రం ప్రభుత్వం అప్పట్లో 6 శాతం తగ్గించి, 12 శాతం ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. అందులో రైతు వాటా 6 శాతం, రాష్ట్ర ప్రభుత్వ వాటా 6 శాతం చొప్పున జీఎస్టీ చెల్లిస్తూ వచ్చారు. అది కూడా రైతుకు భారమని భావించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాజాగా 5 శాతానికి జీఎస్టీ తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉమ్మడి జిల్లాలో వేలాది మంది రైతులకు భారీ ఊరట కలుగనుంది.

**32 వేల హెక్టార్లు లక్ష్యం**

ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి బిందుసేద్యం లక్ష్యం 32 వేల హెక్టార్లు విధించారు. అందుకు సుమారు రూ.298.57 కోట్లు వెచ్చించనున్నారు. ఇప్పటికే బిందు సేద్యం పరికరాల కోసం ఉమ్మడి జిల్లాలో 43,534 మంది రైతులు 58,161 హెక్టార్లకు పేర్లు నమోదు చేసుకున్నారు. అందులో 6,083 మంది రైతులకు 8,072 హెక్టార్లకు పరికరాలు మంజూరు చేశారు.

అనంతపురం జిల్లాలో 18 వేల హెక్టార్లు లక్ష్యం కాగా 23,154 మంది రైతులు 32,560 హెక్టార్లకు పేర్లు నమోదు చేసుకున్నారు. వారిలో 4,588 మంది రైతులకు 6,162 హెక్టార్లకు పరికరాలు మంజూరు చేశారు.

శ్రీసత్యసాయి జిల్లాలో 14 వేల హెక్టార్లు లక్ష్యం కాగా 20,380 మంది రైతులు 26,451 హెక్టార్లకు పేర్లు నమోదు చేసుకున్నారు. అందులో 1,495 మంది రైతులకు 1,910 హెక్టార్లకు పరికరాలు మంజూరు చేశారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో బిందుసేద్యం పరికరాలకు ఏటా సుమారు 298.57 కోట్లు వెచ్చిస్తున్నారు. అందులో 12 శాతం జీఎస్టీ అంటే రూ.35.82 కోట్లు చెల్లించేవారు. తాజాగా 5 శాతానికి కుదించడంతో రూ.14.92 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. అంటే ఏటా రూ.20.9 కోట్లు భారం తగ్గనుంది.


**రైతులకు వెసులుబాటు**

జీఎస్టీ తగ్గింపుతో కరవు జిల్లాలో రైతులకు ఆర్థికంగా వెసులుబాటు కలుగనుంది. అర్హులైన రైతులందరికీ పథకం వర్తించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన ఉద్దేశం. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

రఘునాథరెడ్డి, పీడీ(ఏపీఎంఐపీ)

# కన్ను పడింది.. కొండ కరిగింది

చౌడేపల్లి: అక్రమార్కుల కన్ను ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న కొండలపై పడింది. ఇటీవల కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వి యథేచ్ఛగా తరలిస్తున్నారు. చౌడేపల్లి మండలంలో ఈ వ్యవహారం జోరుగా సాగుతున్నా అధికారులెవరూ కనీసం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.తిరుపతి- పుంగనూరు ప్రధాన రహదారి పక్కనున్న కొండమర్రి రెవెన్యూ పరిధిలో రామయ్యగట్లకు వెళ్లే మార్గంలో కొండను సుమారు 600 మీటర్లకు పైగా తవ్వి తరలించేశారు. కొండకు ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని సైతం కొందరు రైతులు చదును చేసి తమకు అనుకూలంగా మార్చుకున్నారు.చౌడేపల్లి మండలంలోని కొండామర్రి రెవెన్యూ పరిధిలో రాజనాల బండ ఆలయానికి వెనుక వైపునున్న దేవరకుంట దుస్థితి ఇది. పొలాల చదును పేరుతో ఇక్కడ 200 మీటర్ల పొడవున గ్రావెల్ తవ్వి పట్టణాల్లోని లేఅవుట్లకు తరలించేశారు. అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.



# నదీకోత.. రైతన్న గుండెకోత

ఆలమూరు : గోదారమ్మకు వరదొస్తే పాయల్లోని లంక పొలాల రైతులు కలవరపాటుకు గురవుతుంటారు. విలువైన లంకపొలాలు కోతకు గురై గోదావరిలో కలిసిపోతుండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆలమూరు మండలం బడుగువానిలంకలో సుమారు 800 ఎకరాలు ఉన్నాయి. అందమైన పూలతోటలు, పండ్ల తోటలతో సుసంపన్నంగా ఉంటుంది. అన్నిరకాల పంటలు పండడంతో పాటు, అధిక దిగుబడులు వస్తుండటంతో ఎకరం రూ.50 లక్షల నుంచి రూ.80 లక్షల వరకూ పలుకుతుంటాయి. వరదలు వచ్చినప్పుడల్లా ఎకరాలకు ఎకరాలు కోతకు గురవుతూ ఉండటంతో కర్షకులు తల్లడిల్లుతున్నారు.

**2006లో గ్రోయిన్ల నిర్మాణం**

2006లో అప్పటి ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జునచౌదరి కృషితో గ్రామంలో నదీకోత అధికంగా ఉన్నచోట గ్రోయిన్లు, రాతికట్ట నిర్మించారు. అప్పటి నుంచి నదీకోత తగ్గింది. రాతికట్ట లేని ప్రాంతాల్లో భూమి కోతకు గురవుతోంది. రెండేళ్ల క్రితం రిలయన్స్ గ్యాస్ సంస్థ సుమారు రూ.42 కోట్లతో కొంతమేర రివిట్‌మెంట్ పనులు చేపట్టింది.

**మూడు నెలలుగా వరదలు..**

ఈ సంవత్సరం ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరులో మూడుసార్లు వరదలు



వచ్చాయి. రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకున్న వరద ఉద్ధృతికి కొత్త, పాత రివిట్‌మెంట్‌ల కలయిక ప్రాంతంలో మళ్లీ కోత మొదలైంది. బర్మా సొసైటీకి చెందిన భూముల్లో రెండుచోట్ల భూమి కుంగిపోయింది. మూడు రోజుల వ్యవధిలోనే పలు పూలతోటలు కళ్లముందే కొట్టుకుపోవడంతో అన్నదాతలు తల్లడిల్లుతున్నారు. ఇదిలాగే కొనసాగితే లంక భూములతో పాటు జిరాయితీ భూములు, తరువాత గ్రామానికి సైతం ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద తగ్గిన వెంటనే ఈ ప్రదేశంలో మళ్లీ పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

**ఆరుసార్లు మునక..** 35 రోజులు ముంపుప్రస్తుత వరదల కాలంలో ఇంతవరకు చాకలిపాలెం సమీపంలోని కనకాయలంక కాజ్వే ఆరుసార్లు ముంపులో చిక్కుకుని 35 రోజులపాటు ఉండిపోవటంతో ఇక్కడి ప్రజలు అవస్థలు పడ్డారు. బ్యారేజి వద్ద ఆరున్నర లక్షల క్యూసెక్కుల వరదనీటిని సముద్రంలోకి విడిచిపెడితే ఈ కాజ్‌వే ముంపు బారిన పడుతుంది. ఈ సీజన్‌లో దఫదఫాలుగా వచ్చిన ఉద్ధృత వరదలకు కనకాయలంక ప్రజలు చాకలిపాలెంవైపు రాకపోకలు సాగించేందుకు మరపడవలను ఆశ్రయించారు. ఆదివారం సాయంత్రం బ్యారేజి నుంచి సముద్రంలోకి 5,25,148 క్యూసెక్కుల వరద నీటిని విడిచిపెట్టారు. వరద కనిష్ఠస్థాయికి చేరడంతో కాజ్‌వే ముంపు నుంచి బయటపడింది. వివిధ లంకల్లో వరద ఇంకా తగ్గకపోవడంతో ప్రజలు మరపడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు.

# విలీనం చేయరు.. ఎన్నికలు నిర్వహించరు

కాకినాడ : జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న కాకినాడ గ్రామీణ మండలంలోని రమణయ్యపేట, వలసపాకల, వాకలపూడి, తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ గ్రామాలు గత 14 సంవత్సరాలుగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగడం లేదు. దీంతో అభివృద్ధి లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్పొరేషన్‌లో విలీన ప్రక్రియ నిలిచిపోవడంతో ఇవి ప్రత్యేకాధికారుల పాలనలో నడుస్తున్నాయి.

**రెండింటిని మాత్రమే చేర్చారు**

కాకినాడ గ్రామీణ మండలంలో 20 గ్రామాలు ఉండగా 8 గ్రామాలను కాకినాడ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని తీర్మానం చేయగా వాటిలో 2013లో స్వామి నగర్, ఎస్ అచ్యుతాపురం మాత్రమే విలీనం చేశారు. కోర్టు కేసులతో ఇప్పటి వరకు ఈరెండు డివిజన్లలో కార్పొరేషన్ ఎన్నికలు జరగలేదు. ఒక్క వాకలపూడికి మాత్రమే 2014లో ఎంపీటీసీ ఎన్నికలు నిర్వహించారు. మిగతా ఐదింటిలో 2011 నుంచి పంచాయతీ, ఇతర స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించలేదు. 2015లో రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక జీవో జారీ చేసి విలీనానికి ప్రయత్నం చేయగా స్థానిక ప్రజాప్రతినిధులు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఇటు కార్పొరేషన్‌లో విలీనం కాక, అటు పంచాయతీ ఎన్నికలు జరగక గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం దృష్టిసారించి,



ప్రత్యేక చర్యలు చేపట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**రూ.240 కోట్లు నిధులు కోల్పోయారు..**

గత 14 సంవత్సరాలుగా ఈ 6గ్రామాల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.240 కోట్లు కోల్పోయాయని అంచనా. ఆ నిధులు ప్రత్యేక గ్రాంటు ద్వారా ప్రభుత్వం విడుదల చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రభుత్వం స్పందించాలి**

6 గ్రామాలకు వెంటనే పంచాయతీ ఎన్నికల నిర్వహించి ప్రజా పరిపాలన తీసుకురావాలి. కార్పొరేషన్‌లో విలీనం అయితే పన్నుల భారం పెరుగుతుంది. గ్రామాల్లో నివసించే పేద, మధ్య తరగతి వర్గాల వారు భరించలేరు. దీనిపై ఎమ్మెల్యే పంతం నానాజీకి వినతి పత్రం అందించాం. ఆయన ఈ సమస్యపై అసెంబ్లీకి కూడా ప్రస్తావించడం జరిగింది. ప్రభుత్వం జోక్యం చేసుకుని వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలి. అడబాల రత్నప్రసాదరావు, మాజీ సర్పంచి, రమణయ్యపేట

చురకలు



## 'స్వయంభు' వచ్చే వరకూ నభా కవితలేనా?

సాయంత్రం వెలుగులో నన్ను వెతుక్కుందాం.. నా ముఖంలో చిరునవ్వుతో, నా హృదయంలో వెచ్చదనంతో.. కూర్చుని ఆకాశ సౌందర్యం గురించి మాట్లాడుకుందాం.. గాలితో ఊపిరి పీల్చుకుందాం.., మేఘాల నీడలో విశ్రాంతి తీసుకుందాం.. సూర్యాస్తమయంలో మారుతున్న రంగుల్లో నవ్వుకుందాం.. ఎప్పటికీ నన్ను వెతుక్కుందాం.. ఎవరిలో ఇంత సొగసైన కవిత్వం పొంగి పొర్లుతోంది? ఏమో! అది నభా నటేష్ కావొచ్చు. ఈ కన్నడ బ్యూటీ టాలీవుడ్ లో అడుగుపెట్టినప్పటి నుంచి కెరీర్ పరంగా వరుసగా అవకాశాలు అందుకుంటూనే ఉంది. కానీ ఊహించని విధంగా కెరీర్ దూసుకెళుతున్న సమయంలోనే ఒకే ఒక్క యాక్సిడెంట్ తన కలల్ని కల్లలు చేసేస్తుందని భయపడినట్టు చెప్పుకొచ్చింది నభా. అప్పట్లో తన కెరీర్ గురించి చాలా ఆందోళన చెందింది. అయితే చూస్తుండగానే అంతా మారిపోయింది. తాను అనుకున్న విధంగా కంబ్యాక్ అయింది. ఇప్పుడు దర్శకనిర్మాతలను ఆకర్షించడంలో రేసులో ముందుంది. ఈరోజు ఉన్నది రేపు ఉండదు.. రేపు ఉన్నది ఆ తర్వాత ఉండదు.. ప్రతి రోజూ మారిపోతూనే ఉంటుంది. లైఫ్ అంటే ఇదే కదా.. అయితే కొంచెం ఓపిక సహనం అవసరం. కాలంతో పాటే మార్పు ఉంటుందని



గ్రహించి సహనంతో ఎదురు చూడాలి. ఇప్పుడు తాను వేచి చూసిన సమయం రానే వచ్చింది. తిరిగి ఎప్పటిలానే నభా నటేష్ తన సొగసైన రూపాన్ని తిరిగి పొందింది. బోయ్స్ ని కవ్వించే అందం చందం తనలో మెండుగా ఉన్నాయని చెప్పకనే చెబుతోంది నభా ఇన్ స్టాలోని ప్రతి పోస్ట్. ఎంతో అందంగా డిజైనర్ లుక్కుల్లోకి ఒదిగిపోయి ఫోటోషూట్లలో మిలమిల మెరిసిపోతోంది నభ. తాజాగా నభా నటేష్ షేర్ చేసిన ఓ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారుతోంది. చాలా సింపుల్ గా.. చాలా నేచురల్ గా సహజసిద్ధంగా ప్రకృతి అందాల నడుమ ఒదిగిపోయి కనిపించింది నభా. వైట్ ఫ్రాక్ లో గుబులు రేపేంత అందంగా కనిపిస్తోంది. మునుపటితో పోలిస్తే జిమ్ లో బాగా శ్రమిస్తోంది. దీని ఫలితం నభా ఎంతో స్లిమ్ గా టీనేజర్ ని తలపిస్తోంది. ఈ మేకోవర్ నిజంగా స్టన్నింగ్. హూ ఆర్ యు క్వీన్ నభా.. ఐ మిస్ యు! అంటూ ఒక అభిమాని లవ్ ఈమోజీలను షేర్ చేసాడు. చాలా మంది అభిమానులు నభా నటేష్ అందచందాలకు మైమరిచి పోతున్నామని చెబుతున్నారు. లవ్ కిస్ ఫైర్ ఈమోజీలతో ఫ్యాన్స్ విరుచుకుపడుతున్నారు. తాజా ఫోటోషూట్ వెబ్‌లో మోంతా తుఫాన్ లా దూసుకెళుతోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. నిఖిల్ సరసన స్వయంభు అనే హిస్టారికల్ వారియర్ డ్రామా చిత్రంలో నటిస్తోంది. భరత్ కృష్ణమాచారి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాపై నభా చాలా హోప్స్ పెట్టుకుంది. కొంత గ్యాప్ తర్వాత తనకు బిగ్ బ్రేక్ ఇస్తుందని నభా ఆశిస్తోంది. నభాతో పాటు, సంయుక్త మీనన్ మరో కథానాయికగా నటిస్తోంది.

## ది గర్ల్‌ఫ్రెండ్లో ఆ రోల్ అంత స్పెషలా? ఆ ఇద్దరునో చెప్పారట!

రష్మిక మందన్న నటిస్తున్న 'ది గర్ల్‌ఫ్రెండ్' ట్రైలర్ రీసెంట్‌గా రిలీజై మంచి బజ్ క్రియేట్ చేసింది. రాహుల్ రవీంద్రన్ డైరెక్షన్‌లో వస్తున్న ఈ సినిమా, ఒక ఇంటెన్స్, రియలిస్టిక్ లవ్ స్టోరీలా కనిపిస్తోంది. ట్రైలర్ కట్, ఎమోషన్స్ అన్నీ ఆడియెన్స్‌ను అట్రాక్ట్ చేశాయి. అయితే, ఈ సినిమాకు సంబంధించి ఇప్పుడు ఇండస్ట్రీలో ఒక ఇంట్రెస్టింగ్ గాసిప్ చక్కర్లు కొడుతోంది. ఇది సినిమాలోని ఒక కీలక పాత్ర గురించి. ఈ సినిమాలో రష్మిక, హీరో దీక్షిత్ శెట్టితో పాటు అను ఇమ్మాన్యుయేల్ కూడా ఒక ముఖ్యమైన పాత్రలో కనిపించబోతోంది. అయితే, కథలో వీళ్లతో పాటు మరో కీలకమైన పాత్ర ఉందట. ఆ పాత్ర నిడివి తక్కువే అయినా, ఇంపాక్ట్ మాత్రం చాలా ఎక్కువగా ఉంటుందని సమాచారం. డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ మొదట ఈ రోల్ కోసం చాలా పెద్ద పేర్లనే ట్రై చేశాడని టాక్.



రాహుల్ రవీంద్రన్ ఫస్ట్ ఛాయిస్ ఎవరో కాదు.. 'యానిమల్', 'అర్జున్ రెడ్డి' లాంటి బ్లాక్‌బస్టర్స్ ఇచ్చిన సెన్సేషనల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా అని తెలుస్తోంది. ఒక డైరెక్టర్‌ను యాక్టింగ్ కోసం అప్రోచ్ అవ్వడం అనేది చాలా పెద్ద విషయమే. అయితే, సందీప్ రెడ్డి వంగా ఈ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. కారణం ఏంటంటే, ఆ రోల్ కేవలం 'కామియో' (గెస్ట్ రోల్) కాదని, అంతకు మించి ఉందని, అందుకే తనకు సెట్ అవ్వదని సందీప్ ఫీల్ అయ్యాడట. గతంలో సందీప్ మహానటిలో నటించిన విషయం తెలిసిందే. సందీప్ వంగా 'నో' చెప్పడంతో, రాహుల్ రవీంద్రన్ మరో యాక్టర్‌ను ట్రై చేశాడని అంటున్నారు. ఈసారి ఆయన టాలీవుడ్ టాప్ కమెడియన్ వెన్నెల కిషోర్‌ను అప్రోచ్ అయ్యాడట. కానీ, వెన్నెల కిషోర్ కూడా ఈ రోల్ చేయడానికి ఇంట్రెస్ట్ చూపించలేదని సమాచారం. ఒక స్టార్ డైరెక్టర్, ఒక టాప్ కమెడియన్ ఇద్దరూ వద్దనుకున్న ఆ పాత్రలో అంత స్పెషాలిటీ ఏముంది? అనేది ఇప్పుడు ఇండస్ట్రీలో క్యూరియాసిటీని పెంచుతోంది. ఫైనల్‌గా, ఆ రోల్ చేసేందుకు మరెవరూ దొరక్కపోవడంతో.. డైరెక్టర్ రాహుల్ రవీంద్రనే స్వయంగా ఆ పాత్రను చేశాడని అంటున్నారు.

రీసెంట్‌గా రిలీజైన ట్రైలర్‌లో రాహుల్ రవీంద్రన్ కనిపించడంతో నిజమే అయ్యిండొచ్చనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. మరి, అంతమంది రిజెక్ట్ చేసిన ఆ పాత్ర గుట్టు ఏంటో తెలియాలంటే నవంబర్ 7 వరకు ఆగాల్సిందే. గీతా ఆర్ట్స్ సమర్పణలో వస్తున్న ఈ సినిమాను విద్యా కొప్పినీడి, ధీరజ్ మొగిలినేని నిర్మించారు.




## దుల్కర్ 'కాంత'.. ఈ సాంగ్ ఇంకాస్త కొత్తగా..




మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ తన మార్కెట్‌ను చాలా తెలివిగా పెంచుకుంటూ వెళ్తున్నాడు. 'సీతారామం'తో తెలుగులో క్లాసిక్ హిట్ కొట్టి, 'గన్స్ అండ్ గులాబ్స్'తో నార్త్‌లో క్రేజ్ తెచ్చుకున్న దుల్కర్, ఇప్పుడు మరో భారీ పాన్ ఇండియా ప్రాజెక్టుతో రాబోతున్నాడు. అదే 'కాంత'. ఈ సినిమా అనౌన్స్‌మెంట్ టీజర్ నుంచే క్యూరియసిటీని క్రియేట్ చేసుకుంటోంది, ఇక లేటెస్ట్ రిలీజైన టైటిల్ ట్రాక్ "రేజ్ ఆఫ్ కాంత" ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. ఇది రెగ్యులర్ సినిమా కాదని, ఏదో కొత్త ప్రయోగం చేస్తున్నారని స్పష్టంగా తెలుస్తోంది. సినిమా ప్రమోషన్స్‌ను కూడా చాలా డిఫరెంట్‌గా ప్లాన్ చేశారు. ఇక "రేజ్ ఆఫ్ కాంత" పాట ఒక యాంథమ్‌లా ఉంది. ఇది కేవలం ఒక భాషకే పరిమితం కాలేదు. తెలుగు, తమిళ లిరిక్స్‌ను మిక్స్ చేసి, ఒక పవర్‌ఫుల్ రాప్ సాంగ్‌గా కంపోజ్ చేశారు. జాను చంతర్ ఈ పాటకు మ్యూజిక్ అందించారు. ఈ పాటలో "నిజం నేనే.. అలల పొగరుని", "నిశి నేనే.. శశి నేనే.. పిడుగు పడినా పడనే పడదు వెనకడుగు" లాంటి తెలుగు రాప్ లిరిక్స్ ని అభినవకవి రాశారు. ఈ ప్రాజెక్ట్ ఇంతలా బజ్ క్రియేట్ చేయడానికి కారణం కేవలం దుల్కర్ సల్మాన్ మాత్రమే కాదు, దీని వెనుక ఉన్న ప్రొడక్షన్ టీమ్. ఈ సినిమాను దుల్కర్ సల్మాన్ వయఫేరర్ ఫిల్మ్స్, రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియాలతో కలిసి నిర్మిస్తున్నారు. వీరిద్దరితో పాటు ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ కూడా నిర్మాతలుగా ఉన్నారు. ఇలా రెండు డిఫరెంట్ ఇండస్ట్రీలకు చెందిన స్టార్ యాక్టర్స్ కలిసి ఒక సినిమాను నిర్మించడం అనేది చాలా అరుదైన, ఇంట్రెస్టింగ్ కాంబినేషన్.

'కాంత' ఒక పీరియడ్ డ్రామా థ్రిల్లర్‌గా ఉండబోతోంది. ఒకప్పటి సూపర్ స్టార్స్ సినీ తారల లైఫ్ ను వెండితెరపై ఫిక్షనల్ గా చూపించనున్నట్లు తెలుస్తోంది. సెల్వమణి సెల్వరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో దుల్కర్‌తో పాటు సముద్రఖని, భాగ్యశ్రీ బోర్సే లాంటి టాలెంటెడ్ యాక్టర్స్ కూడా నటిస్తున్నారు. టీజర్, సాంగ్ విజువల్స్ అన్నీ బ్లాక్ అండ్ వైట్‌లో, చాలా ఇంటెన్స్‌గా, స్టైలిష్‌గా ఉన్నాయి. ఇక 'కాంత' సినిమాను నవంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.

## జిమ్ లో తెగ కష్టపడిపోతున్న నభా నటేష్.. స్పెషల్ ఏంటంటే?





సాధారణంగా పురుషులతో పోల్చుకుంటే మహిళలు త్వరగా ఏజ్ ఉన్నవారిగా కనిపిస్తారన్న విషయం అందరికీ తెలిసిందే. ముఖ్యంగా వివాహం తర్వాత గర్భం.. ఆ తర్వాత శరీరంలో వచ్చే మార్పులు.. పనిలో ఒత్తిడి ఇలా పలు కారణాల వల్ల అమ్మాయిల శరీరంలో మార్పులు వస్తూ ఉంటాయి. కానీ హీరోయిన్స్ ని చూస్తే మాత్రం 50 ఏళ్లు కాదు కదా 70 ఏళ్లు వచ్చినా సరే ఇంకా యంగ్ గా కనిపిస్తూ అందరిని ఆశ్చర్యపరుస్తూ ఉంటారు. అసలు వీరి ఫిట్నెస్ వెనుక రహస్యం ఏంటి అని అమ్మాయిలు వెతకడం ఆరంభిస్తారు అనడంలో సందేహం లేదు. అయితే హీరోయిన్స్ లేటు వయసులో కూడా అంత అందంగా కనిపించడానికి కారణం వారు తీసుకునే డైట్ మాత్రమే కాదు జిమ్ సెంటర్లలో వారు కష్టపడే తీరు కూడా వారిని బొమ్మలా మారుస్తున్నాయి అనడంలో సందేహం లేదు. అందుకే నిత్యం జిమ్ సెంటర్లలో కనిపిస్తూ శరీరాన్ని ఫిట్ గా ఉంచుకుంటున్నారు. అంతేకాదు మనసును ప్రశాంతంగా ఉంచుకోవడానికి తగిన యోగా శిక్షణలు కూడా తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఇటు మానసికంగా అటు శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే మన శరీరం ఫిట్ గా ఉంటుందని.. వయసు మీద పడినా.. అసలు తెలియదు అంటూ కామెంట్ లు చేస్తున్నారు. ఈ క్రమంలోనే అలా నిత్యం తన శరీరాన్ని ఫిట్గా ఉంచుకుంటూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న హీరోయిన్స్ లో నభా నటేష్ కూడా ఒకరు ఈమె ఎక్కువగా సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ గ్లామర్ ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. అయితే ఈసారి తాజాగా తన వారం మొత్తానికి సంబంధించిన జిమ్ వీడియోని అభిమానుల తో షేర్ చేసుకుంది. అయితే ఈ జిమ్ వీడియోలో స్పెషల్ ఏంటో కూడా క్యాప్షన్ లో జోడించింది ఈ ముద్దుగుమ్మ. అసలు విషయంలోకి వెళ్తే.. సోమవారం నుంచి ఆదివారం వరకు జిమ్లో గడిపిన రోజుకు ఒక ఫోటో తీసుకుంది. వాటన్నింటినీ సోషల్ మీడియాలో షేర్ చేసింది. అయితే ఆ ఒక్కొక్క ఫోటోలో సెల్ఫీ ఫోటో తోపాటు రంగురంగుల జిమ్ దుస్తులు ధరించి తన వస్త్రాల తో కూడా అందరినీ ఆకట్టుకుంది. మొత్తానికి అయితే జియో లో కష్టపడుతూనే అటు రోజుకొక ఫోటో షేర్ చేస్తూ రోజుకు ఒక రంగు డ్రెస్ ధరించినట్లు చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారుతోంది. నభా నటేష్ కెరియర్ విషయానికి వస్తే.. గత రెండు మూడు సంవత్సరాల క్రితం యాక్సిడెంట్ బారిన పడిన ఈమె ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. అందులో భాగంగానే తాజా నిఖిల్ హీరోగా నటిస్తున్న స్వయంభూ సినిమాలో కీలకపాత్ర పోషిస్తుంది. ఈ సినిమాలో సంయుక్త మీనన్ కూడా మరో హీరోయిన్గా నటిస్తోంది . భరత్ కృష్ణమాచార్య దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా నిఖిల్ కెరీర్ లోనే భారీ బడ్జెట్ మూవీ అని చెప్పవచ్చు. ఈ సినిమాతో నభా నటేష్ సక్సెస్ అందుకోవాలని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.

## ఏళ్ల తరబడి గుర్తుంచుకునే కథ... ఆమె వ్యాఖ్యలు వైరల్

బాలీవుడ్‌లో సక్సెస్ రేటు నానాటికి తగ్గుతున్నా వచ్చే సినిమాల సంఖ్య మాత్రం తగ్గడం లేదు. పెద్ద హీరోల సినిమాలు, క్రేజ్ ఉన్న దర్శకుల సినిమాలు, పెద్ద బ్యానర్‌లో రూపొందిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద కంటిన్యూగా సందడి చేసేందుకు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాయి. యాక్షన్ ఎంటర్‌టైనర్‌మెంట్ సినిమాలకు హిందీ ప్రేక్షకులు అలవాటు పడ్డ నేపథ్యంలో చాలా మంది యంగ్ హీరోలు అలాంటి సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అలాంటి కాన్సెప్ట్, జోనర్‌లో రూపొందిన సినిమా ధురంధర్. బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన ధురంధర్ సినిమా డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. రణ్‌వీర్ సింగ్ గత చిత్రాల ఫలితాలతో సంబంధం లేకుండా ఈ సినిమాపై ప్రేక్షకులు, ఆయన అభిమానులు, ఇండస్ట్రీ వర్గాల వారు నమ్మకం పెట్టుకుని ఎదురు చూస్తున్నారు.

**ధురందర్ సినిమా విడుదల తేదీ...** రణ్‌వీర్ సింగ్ ధురంధర్ సినిమాకు ఆదిత్య ధార్ దర్శకత్వం వహించాడు. రచయితగా, నిర్మాతగా పలు హిట్ సినిమాలను అందించిన ఆదిత్య ధార్ కి దర్శకుడిగా ఇది రెండో సినిమా. మొదటి సినిమా ఉరి : ది సర్జికల్ స్ట్రైక్ కమర్షియల్‌గా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు, విమర్శకుల



ప్రశంసలు దక్కించుకుంది. ఆ సనిమా వచ్చి ఆరు ఏళ్లు దాటిన తర్వాత ఎట్టకేలకు ఆదిత్య ధార్ నుంచి కొత్త సినిమా రాబోతుంది. ఈ సినిమా ప్రారంభించినప్పటి నుంచి అంచనాలు భారీగా పెరుగుతూ వచ్చాయి. అందుకు తగ్గట్టుగా సినిమాను భారీగా ఖర్చు చేసి రూపొందించినట్లు సమాచారం అందుతోంది. తాజాగా ధురంధర్ సినిమా గురించి ప్రముఖ హీరోయిన్ యామి గౌతమ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఈ సినిమా దర్శకుడు ఆదిత్య ధార్ భార్య అయిన యామి గౌతమ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

**హీరోయిన్ యామి గౌతమ్ మాట్లాడుతూ...** మరో నెల రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ధురంధర్ సినిమా గురించి యామి గౌతమ్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... తాను ఆర్టికల్ 370 సినిమా చేస్తున్న సమయంలో ధురంధర్ కథ విన్నాను. ఆర్టికల్ 370 సినిమాకు రచయితగా చేసిన ఆదిత్య ధార్ ఆ సమయంలోనే నాకు ధురంధర్ కథను చెప్పారు. నా భర్త ఆదిత్య ధర్ ఆ కథ చెప్పినప్పుడు ఏమోషనల్ అయ్యాను. దా స్క్రిప్ట్ చదివిన సమయంలో భావోద్వేగానికి గురి అయ్యాను. నేను ఇప్పటి వరకు చదివిన కథల్లో అత్యంత పవర్ ఫుల్ కథ ధురంధర్ అనిపించింది. ఒక అద్భుతమైన మల్టీస్టారర్ సినిమాను ప్రేక్షకులు ఎక్స్‌పీరియన్స్ చేయబోతున్నారు అంటూ ధురంధర్ గురించి యామి గౌతమ్ చెప్పుకొచ్చింది. ఆదిత్య ధార్ సినిమా ప్రారంభించినప్పటి నుంచి కూడా నేను ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్నాను అని యామి గౌతమ్ చెప్పుకొచ్చింది.

## కొత్త ఏడాది సీతమ్మ కొత్త కబురా?

ఒకేసారి రెండు పడవల ప్రయాణం అంత సులభం కాదు. అందులోనూ నటీమణులకు అసలే సాధ్యం కాదు. ఎంతో ఫ్యాషన్ ఉంటే తప్ప సాధ్యం కాదు. బాలీవుడ్ లో ఇలా రెండు పడవల ప్రయాణాన్ని మొదలు పెట్టింది కృతి సనన్. అమ్మడు బాలీవుడ్ లో ఎంత బిజీగా ఉందో చెప్పాల్సిన పనిలేదు. వరుస ప్రాజెక్ట్ లతో క్షణం తీరిక లేకుండా గడుపు తోంది. ఓ పక్క హీరోయిన్ గా నటిస్తూ మరో వైపు కమర్శియల్ యాడ్స్ తోనూ బిజీగా ఉంది. గత ఏడాది నిర్మాణ రంగం లోకి కూడా అడుగు పెట్టింది. బటర్ ప్లై ఫిల్మ్స్ బ్యానర్ స్థాపించి తొలి చిత్రంగా దో పత్తీ నిర్మించింది. ఈ సినిమాకు డివైడ్ టాక్ వచ్చింది.

**దర్శక, నిర్మాతలతో చర్చలు:** ఈ సినిమా విడుదలై ఏడాది పూర్తయింది. అయితే ఆ తర్వాత మళ్లీ మరో కొత్త ప్రాజెక్ట్ పట్టాలెక్కించలేదు. నటిగా బిజీగా ఉంది గానీ నిర్మాతగా మాత్రం బిజీ కాలేదు. ఈ నేపథ్యంలో తొలి సినిమాతోనే నిర్మాణం ఆపేసిందా? అన్న సందేహాలు బాలీవుడ్ లో వ్యకమవుతున్నాయి. నటిగా బిజీగా ఉండటంతో బ్యానర్ ని



పట్టించుకోలేని స్థితిలో ఉందా? అన్న సందేహాల నేపథ్యంలో అందుకు ఛాన్సే లేదంటూ ముందుకొచ్చింది. రెండవ సినిమాగా ఎలాంటి చిత్రం నిర్మించాలి ? అన్న దానిపై సీరియస్ గా దర్శక, రచయితలతో చర్చలు జరుపుతున్నట్లు వెలుగులోకి వచ్చింది.

**లాంగ్ గ్యాప్ ఎందుకంటే?...** ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది ఆ ప్రాజెక్ట్ కు సంబంధించి అప్ డేట్ ఇచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కొత్త ప్రాజెక్ట్ తో పాటు మరిన్ని కథలు విని లైన్ లో పెడుతున్నట్లు వినిపిస్తోంది. ఏ సినిమా నిర్మాణమైనా వెంట వెంటనే సాధ్యమ య్యేది కాదు. సినిమాపై కోట్ల రూపాయల పెట్టుబడి అంటే ఎన్నో విషయాలు ఆలోచించాల్సి ఉంటుంది. తొలి సినిమా డివైడ్ టాక్ వచ్చిన నేపథ్యంలో కృతిసనన్ మళ్లీ అలాంటి తప్పిదాలు దొర్లకుండా జాగ్రత్త పడుతుంది. ఈ క్రమంలోనే దో పత్తి తర్వాత కొత్త సినిమాకు లాంగ్ గ్యాప్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.

**వెకేషన్ ఆస్వాదనలో సీతమ్మ:** తాజా అప్ డేట్ నేపథ్యంలో కొత్త ప్రాజెక్ట్ కు సమయం ఆసన్నమైనట్లే. ఇక నటిగా కృతి సనన్ ఫుల్ బిజీగా ఉంది. ధనుష్ హీరోగా ఆనంద్ ఎల్. రాయ్ తెరకెక్కిస్తోన్న తేరే ఇష్క్ మేలో హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. హిందీ , తమిళ్ లో తెరకెక్కుతోన్న ఈ సినిమా షూటింగ్ ఇప్పటికే పూర్తయింది.

ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగు తున్నాయి. అలాగే కాక్ టెయిల్ 2లోనూ నటిస్తోంది. ప్రస్తుతం కృతిసనన్ విదేశీ వెకేషన్స్ లో ఉంది. అబుదాబీ అందాల్ని ఆస్వాదిస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536